



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



'జల్ సంచయ్ జన్ భాగీదారీ' విభాగంలో తెలంగాణ టాప్

మహిళలకు కోటి చీరలు

ఉమ్మడి భాగస్వామ్యంలో మెట్రో రైల్ 04



సంపుటి 28, సంచిక: 149 | బుధవారం | 19-11-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00





# హైదరాబాద్ అభివృద్ధికి సహకరించండి

● పలు పనులకు వేగంగా అనుమతులివ్వండి ● కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి ● హైదరాబాద్‌లో దక్షిణపశ్చిమ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రుల ప్రాంతీయ సమావేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులు వేగంగా జారీచేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన దక్షిణపశ్చిమ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రుల ప్రాంతాయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు సిఎం ఈ మేరకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనతో పాటు తరువాయి 2లో



## మండలి సభ్యులకు ఇబ్బంది కలగొద్దు

శాసనసభ ప్రాంగణంలో శాసనమండలి భవన మరమ్మతుల పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి 03

# మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్

● ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లిలో భీకర ఎదురుకాల్పులు ● ఆరుగురు మావోయిస్టుల మృతి ● మృతుల్లో హిడ్మా భార్య రాజక్క కూడా ● కాల్పులతో దద్దరిల్లిన ఎఒబి ● ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్... ముగ్గురు మృతి ● ఎపిలోని 5 జిల్లాల్లో ఆక్టోపస్, ఇంటెలిజెన్స్ ముమ్మర గాలింపు ● 50 మందికిపైగా అరెస్టు














**రంపచోడవరం(అల్లూరి జిల్లా):** అల్లూరి సీతారామ రాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా మృతి చెందాడు. ఈ ఘటనలో హిడ్మాతో పాటు ఆయన భార్య రాజే , అంగరక్షకులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ చనిపోయారు. ఆరుగురు మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మావోయిస్టుల మృతదేహాలను తీసుకొచ్చిన నేపథ్యంలో మార్చురీ వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల గాలింపు ప్రారంభించినట్లు ఆంధ్రప్రదేశ్ డిజిపి హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా... బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు భద్రతా బలగాల మధ్య తరువాయి 2లో

## ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని డిమాండ్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

మావోయిస్టు కేంద్రమిటీ సభ్యుడు మాడవి హిడ్మాతో పాటు మరో ఐదుగురిది ముమ్మాటికీ బూటకపు ఎన్ కౌంటరే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం శేషగిరి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్ కౌంటర్ల పేరుతో నరహత్యలకు పాల్పడుతోందని ఆవేదనవ్యక్తం చేశారు. అసలు ఎన్ కౌంటర్ అంటే ఇరు పక్షాలు ఎదురెదురుగా కాల్చుకునేది అని,కానీ ప్రస్తుతం హిడ్మా ఎన్ కౌంటర్ చూస్తుంటే వారిని పట్టుకుని తెచ్చి కాల్చి చంపినట్లుగా తరువాయి 2లో



## తెలంగాణ రైజింగ్ ఉత్సవాలలో పలు పాలసీలు

● బ్యాంకింగ్ రంగంతో పాటు స్వయంసహాయక సంఘాలు, సూక్ష్మ, మధ్యతరహా, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం ● మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా 2047 రోడ్‌మ్యాప్ విడుదల చేస్తాం ● బ్యాంకర్లు పెద్దసంఖ్యలో భాగస్వామ్యం కావాలి ● ఉపముఖ్యమంత్రి భట్టి




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిర్వహించబోతున్న 'తెలంగాణ రైజింగ్ 2047' ఉత్సవాలలో అన్ని రకాల పాలసీలను ప్రకటిస్తామని,ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బ్యాంకర్లు కార్పొరేట్ సంస్థలతో పాటు స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ మధ్యతరహా, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ రెండు రంగాలను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా సంపద సృష్టించబడుతుందని, తద్వారా జిడిపి పెరుగుతుందని వివరించారు. హైదరాబాద్,బేగంపేటలోని ఒక ప్రైవేటు హోటల్‌లో మంగళవారం తరువాయి 2లో







# సిపిఐ పోరాటాలతోనే దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం

## ప్రచార జాతాల్లో సిపిఐ సీనియర్ నేతల ఉద్ఘాటన

ప్రజాపక్షం/ దేవరకొండ/ హన్మకొండ/ వికారాబాద్

భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటిగా పోరాటం చేసింది కేవలం సిపిఐ మాత్రమేనని, నాటి నుండి నేటివరకు పేదల పక్షాన నిరంతరం పోరాడుతున్నదని సిపిఐ బస్సు ప్రచార జాతాల్లో పలువురు నేతలు ఉద్ఘాటించారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని మూడు ప్రచార జాతాలు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి. నాల్గొవ రోజు నల్లగొండ, సిద్ది పేట, హన్మకొండ, వరంగల్, రంగారెడ్డి జిల్లాల్లో నిర్వహించారు. గద్వాల్ నుంచి ప్రారంభించిన జాతాలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లావెంకట్‌రెడ్డి, సిపిఐ ఎమ్మెల్యే సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ్మ తదితరులు పాల్గొనగా, జోడేఘాట్ నుంచి ప్రారంభమైన జాతాలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, కలవేన శంకర్, బాసర నుంచి మొదలు పెట్టిన జాతాలో తరువాయి 12లో




## పోలవరం- బనకచర్లకు అనుమతులు ఇవ్వొద్దు

● ఆల్మట్టి ఎత్తు పెంచితే తెలంగాణకు అన్యాయం.. కర్ణాటకను నిలువరించండి ● జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌కు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్లాన్ చేస్తున్న పోలవరం బనకచర్ల ప్రాజెక్టుకు తెలంగాణ రాష్ట్రం వ్యతిరేకమని, ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్.పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో మంగళవారం కేంద్రమంత్రితో భేటీ అయిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'కొంత కాలం నుంచి జల్ శక్తి మినిస్ట్రీలో తెలంగాణకు చెందిన అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రమంత్రిగా చొరవ చూపి వాటిని త్వరగా పరిష్కరించాలని కోరాం. పాలమూరు–రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మొత్తం 90 టిఎంసిల నీటి కేటాయింపు అడిగాం. వాటిలో 45 టిఎంసిల నీటిని వెంటనే పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కేటాయించాలని కోరాం. ఈ సమావేశంలో కేంద్రమంత్రి సిఆర్ పాటిల్తో సహా సిడబ్ల్యూసి చైర్మన్ కూడా ఉన్నారు. వారికి కూడా ఇదే విషయాన్ని చెప్పాం. ఈ అంశం సిడబ్ల్యూసి దగ్గరే తరువాయి 2లో

## రూ.కోట్లలో పన్ను ఎగవేత ప్రముఖ హోటళ్లపై ఐటి దాడులు

హైదరాబాద్ నగరంలో ఏకకాలంలో 30 చోట్ల సోదాలు

రికార్డుల్లో చూపిన ఆదాయం, నిజమైన ఆదాయం మధ్య వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించిన అధికారులు


ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రముఖ బిర్యానీ రెస్టారెంట్‌లపై భారీ స్థాయిలో పన్ను ఎగవేత ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఆదాయపు పన్ను దర్యాప్తు విభాగం హైదరాబాద్‌లో సోదాలు నిర్వహించింది. పిస్తా హౌస్, షా గౌస్, మెహిఫిల్ గ్రూప్‌కు చెందిన హోటళ్లు, కార్యాలయాలు, వారికి సంబంధించిన నివాసాలు, ఇతర సంబంధిత ప్రదేశాల్లో అధికారులు దాడులు చేశారు. కాగా.. సుమారు 600 మంది పైగా ఐటి అధికారులు 30 బృందాలుగా విడిపోయి నగరంలోని వివిధ ప్రాంతాల్లో సోదాలు జరిపారు. కోట్ల రూపాయల విలువైన అమ్మకాల వివరాలు గోప్యంగా ఉంచినట్టు అనుమానం రావడంతో ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం.సోదాలు మూడు బ్రాండ్లకు చెందిన పలు యూనిట్లు, తరువాయి 12లో

# 'సర్'పై ఇక వీధుల్లోకి..

● కాంగ్రెస్ నిర్ణయం ● డిసెంబరు మొదటి వారంలో రామ్‌లీలా మైదానంలో లక్షలాది మందితో నిరసన ర్యాలీ ● బిజెపి నీడలో పనిచేయడం లేదని ఇసి నిరూపించుకోవాలి డిమాండ్ ● సర్ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ ప్రవర్తన తీవ్ర నిరాశపరిచిందని వ్యాఖ్య


**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ తన 'ఓట్ చోరీ' ఆరోపణలను మరోసారి పునరుద్ఘాటించింది. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో ఎన్నికల కమిషన్ ప్రవర్తన తీవ్ర నిరాశపరిచిందని పేర్కొంది. ఎన్నికల సంఘం బిజెపి నీడలో పనిచేయడం లేదని వెంటనే నిరూపించాలని డిమాండ్ చేసింది. ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడానికి 'దుష్టమైన ప్రణాళిక'పై పనిచేస్తోందని ఆరోపించింది. డిసెంబర్ మొదటి వారంలో ఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిరసన ర్యాలీని నిర్వహించడం ద్వారా వీధుల్లోకి వస్తామని ప్రతిన బూనింది. మంగళవారం సర్ ప్రక్రియ కొనసాగుతున్న 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల కీలక ఆఫీస్ బేరర్ల సమావేశం కాంగ్రెస్



అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జరిగింది. సమావేశంలో పార్టీ మాజీ చీఫ్ రాహుల్ గాంధీ ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్. రాష్ట్ర యూనిట్ చీఫ్‌లు, కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకులు సర్ జరుగుతున్న 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల కార్యదర్శులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఉద్దేశ్యం ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్ష పార్టీలను నాశనం చేయడమేనని, ఇది చరిత్రలో ఎప్పుడూ తరువాయి 2లో

# నేడు దేశవ్యాప్త నిరసనలు

● ప్రజాస్వామ్య ఉద్యమానికి అవామీలీగ్ పార్టీ పిలుపు ● బంగ్లాదేశ్‌లో ఘర్షణలు : ఇద్దరు మృతి ● దేశవ్యాప్తంగా స్తంభించిన కార్యకలాపాలు



**ఢాకా:** షేక్ హసీనాకు వ్యతిరేకంగా ఐసిటి మరణశిక్ష విధిస్తూ తీర్పు ఇవ్వడంతో అల్లర్లు చెలరేగాయి. ఒక్కసారిగా సోమవారం నుండి ప్రారంభమైన అల్లర్లు, నిరసన ప్రదర్శనలు రెండోరోజు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ అల్లర్లలో ఇద్దరు మరణించారు.ఐతే దేశవ్యాప్తంగా అవామీలీగ్ ఇచ్చిన సమ్మె పిలుపు మేరకు బంగ్లాదేశ్‌లో అన్ని కార్యకలాపాలూ స్తంభించాయి. ఇతర ప్రాంతాలలో స్తబ్దత నెలకుంది. ఇంకెక్కడా హింసాత్మక ఘటనలు నమోదు కాలేదు. దేశమంతా రోడ్లపై వాహనాలు చాలా పరిమితంగా తిరిగాయి. అనేక కార్యాలయాలు, విద్యాలయాలలో చాలా పరిమితంగా హాజరు కనిపించింది. పోలీసులు, సైన్యం దేశమంతా భారీ భద్రత, గస్తీ చర్యలు చేపట్టారు. ఈనెల 19,20 తేదీలలో దేశవ్యాప్తంగా ప్రదర్శనలు, నిరసన కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రతిఘటన చర్యలు చేపట్టాలని సోషల్ మీడియా ద్వారా అవామీ లీగ్ పార్టీ పిలుపు ఇచ్చింది. రాజ్యాంగ విరుద్ధ, ఫాసిస్టు యూనస్ ప్రభుత్వం కుప్పకూలేవరకూ, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేవరకూ తమ ఉద్యమం కొనసాగుతుందని ఆ పార్టీ ప్రకటించింది. ఢాకాలోని కొన్ని ప్రాంతాలలో ప్రత్యర్థి వర్గాలతో హసీనా అనుచరులకు ఘర్షణలు చెలరేగాయి. దీంతోపాటు పోలీసులు కూడా రంగంలోకి దిగారు. పోలీసులతో కూడా హసీనా అభిమానులకు ఘర్షణలు జరిగాయి. ఢాకాలోని పలు ప్రాంతాలలో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఢాకా నగరంలో నెలకు 20 హత్యలు

**ఢాకా:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకా అత్యంత హింసాత్మక నగరంగా రూపుదాల్చింది. ఈ నగరంలో ప్రతి నెల 20 హత్యలు జరుగుతున్నాయి. రాత్రీ పగలూ అనే తేడా లేకుండా విచక్షణా రహితంగా నేరముఠాలు హత్యలకు పాల్పడుతున్నాయి. ఢాకా నగరంలో శాంతి భద్రతల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. రాజధాని ఢాకా అనేక ఉద్యమాలకు కేంద్రంగా మారుతున్నది. ఈ ఏడాది గడచిన పది నెలల కాలంలో ఢాకాలో 198 హత్యలు జరిగాయి. డిఎంపి మీడియా–ప్రజా సంబంధాల అధికార ప్రతినిధి టాలిబర్ రెహ్మాన్ ఈ విషయం చెప్పారు. ఆధిపత్య వివాదాలు, కుటుంబ తగాదాలు, పూర్వపు శత్రుత్వాలు, పాతకక్షలు తీర్చుకోవడం, ఆర్థిక ఆధిపత్యం వంటి అనేక అంశాలు ఈ హత్యలకు కారణాలవుతున్నాయని ఆయన చెప్పారు. ఐతే పోలీసులు వీటికి గల కారణాలు తెలుసుకుని విజయవంతంగా నిందితులను అరెస్టు చేయగలుగుతున్నారని ఆయన చెప్పారు. నగరంలో ఉన్న సామాజిక, ఆర్థిక కారణాలే ఈ హత్యల వెనుక ప్రధానాంశాలు.

## ట్రంప్ ఆంక్షల వెనుక రహస్య ఎజెండా
### డాలర్ డామినేషన్ కోసం తంటాలు!



**వాషింగ్టన్:** మెల్లిగా సమస్య ఊబిలోకి వెళుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దేశంలోనూ, దేశం వెలుపలా తన పట్టు నిలబెట్టుకునేందుకు గంభీరంగా పోరాటం చేస్తున్నారు. రష్యా వ్యాపారం చేస్తున్న దేశాలపై కూడా ఆంక్షలు విధించేందుకు ఆయన రిపబ్లికన్ పార్టీ అనుచరులు బిల్లులను తయారు చేస్తున్నారు. రష్యాను, దాని మిత్రదేశాలను లక్ష్యంగా చేసుకోవడం వెనుక ట్రంప్‌కు వేరే ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంచనావేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు డాలర్ విలువ పడిపోతోంది. దాని చలామణీ తగ్గే పరిస్థితులు రాకుండా డాలరు ఆధిపత్యాన్ని కాపాడుకోవాలని, 'అమెరికా గ్రేట్ ఎగైన్ (మాగా) లక్ష్యంగా ట్రంప్ పనిచేస్తున్నారు. ఎన్నికల్లో ఆయన ప్రజలకు ''మాగా'' వాగ్దానాలు చేశారు. కానీ ఆ లక్ష్యాలు నెరవేరకపోగా ఆయన చాలా సందర్భాల్లో టారిఫ్‌లు తగ్గించుకునే విషయంలో రాజీ పడాల్సి వస్తోంది. డాలర్ డామినేషన్‌ను కాపాడుకునేందుకు, పతనం కాకుండా అడ్డుకునేందుకు ట్రంప్ తంటాలు పడుతున్నారు. అందులో భాగంగానే రష్యాపైన, దానితో వ్యాపారం చేసే ఇతర దేశాలపైనా కూడా భారీ టారిఫ్ లు, ఆంక్షలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. గత ఏడాదిలో 134 బిలియన్ డాలర్లు మేరకు డాలన్ పతనమైంది. మరో 75 బిలియన్ డాలర్ల మేరకు ఇతర కరెన్సీల చెలామణీలో గ్లోబల్ లావాదేవీలు జరుగుతున్నాయి. భారత్–రష్యా మధ్య రూపాయితోనే లావాదేవీలు జరుగుతున్నాయి. ప్రస్తుతం డాలరు ఆధిక్యం ప్రపంచదేశాలలో 50 శాతం లోపుగానే ఉంది. మరోవైపు అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా 37 ట్రిలియన్ డాలర్ల మేరకు అప్పుల్లో నడుస్తోంది. మూడు ట్రిలియన్ డాలర్ల మేరకు లోటులో నడుస్తోంది. అందుకే భారత్‌పై అమెరికా తీవ్ర ఒత్తిడి చేస్తోంది. అత్యధిక జనాభాగల భారతదేశ మార్కెట్లను చేజిక్కించుకునేందుకు ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో ఆధిపత్యం సాధించేందుకు ప్రయత్నం చేస్తోంది.

**ఎప్‌స్టీన్ ఫైల్స్ బిల్లుపై సంతకం చేస్తా : ట్రంప్**

ఇటీవల ఎన్నికల్లో ఓటమి, రాబోయే మధ్యంతర ఎన్నికల ఓటమి భయంతో డోనాల్డ్ ట్రంప్ దేశీయంగా దూకుడు తగ్గించి ఆచితూచి అడుగులువేసే పరిస్థితులు మెల్లిగా వస్తున్నాయి. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై ఓటింగ్‌కు అమెరికా కాంగ్రెస్ సిద్ధమైంది. ఈ ఫైల్స్‌ను విడుదల చేసేందుకు వీలుగా రిపబ్లికన్లు సహకరించాలని, ఫైల్స్ విడుదలయ్యేందుకు అనుకూలంగా ఓటు వేయాలని పిలుపు ఇచ్చారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ బిల్లుపై సతకం చేసి పత్రాలన్నీ జనం చేతుల్లోకి వచ్చేట్టు చూస్తానన్నారు. ఎప్‌స్టీన్ పత్రాల్లో ట్రంప్ పేరు ఉందని ఇప్పటికే అనేకసార్లు బహిర్గతమైంది. అతగాడితో ట్రంప్‌కు లోతైన అనుబంధం ఉందని వెల్లడైంది. ఫొటోలు కూడా బయటకు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఆయన ఆత్మరక్షణలోపడి మాట మార్చారు. గడచన పది నెలలుగా తన ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజల్లో ప్రచారం చేయాలని రిపబ్లికన్లను కోరుతున్నారు. భారీ ప్రజా మెజారిటీతో రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్ ఒక పెద్ద ప్రజాస్వామ్యదేశంపట్ల బాధ్యతగా వ్యవహరిండంలేదని విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

# ట్రంప్ గాజా ప్లాన్‌కు భద్రతా మండలి మద్దతు

**న్యూయార్క్:** ట్రంప్ ప్రతిపాదించిన గాజా 20 సూత్రాల ప్రణాళికకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు తీర్మానం చేసింది. దీంతో గాజాలో అంతర్జాతీయ దళాలను మోహరించాలన్న ట్రంప్ ప్రణాళికకు అధికారిక మద్దతు లభించింది. ఐతే రష్యా, చైనా ఈ తీర్మానానికి దూరంగా ఉన్నాయి. ఒకా రహస్యంగా అనేక దేశాలు గాజాలో శాంతి దళాలను మోహరించేందుకు తనకు మద్దతు తెలియజేశాయని ట్రంప్ చెప్పారు. తన ప్రణాళికకు భద్రతా మండలి మద్దతు తెలియజేయదంపట్ల ఆయన హర్షం ప్రకటించారు. బ్రిటన్, ఫ్రాన్స్ సహా 13 దేశాలు ఈ తీర్మానానికి బాహాటంగా మద్దతు తెలియజేశాయి. కాల్పుల విరమణను పటిష్టంగా అధికారికంగా అమలు చేయడంలో ఈ తీర్మానం ఆమోదం ఒక కీలకమైన ఘట్టమని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు.



**ఇజ్రాయెల్ ఉల్లంఘనలు హమాస్ మండిపాటు**

గాజాలో ఇజ్రాయెల్ చాలా తీవ్రస్థాయిలో కాల్పుల విరమణ ఒప్పంద ఉల్లఘనలకు పాల్పడుతోందని, ఈ విషయంలో అరబ్ లీగ్, ఐఓసి (ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ కో–ఆపరేషన్)లు చాలా స్పష్టమైన వైఖరితో కఠిన చర్యలకు సహకరించాలని పాలస్తినా ప్రతిఘటన సంస్థ హమాస్ అధికార ప్రతినిధి హాజెమ్ క్యాస్సెమ్ డిమాండ్ చేశారు. అక్టోబరు 10వ తేదీన గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత ఇజ్రాయెల్ వందలసార్లు కాల్పుల ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, ఈ దాడుల్లో ఇప్పటివరకూ 246 మంది పాలస్తీనియన్లు హతులయ్యారని హమాస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇజ్రాయెల్ ఇప్పటివరకూ 286 సార్లు కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడిందని, అధికారికంగా పాలస్తీనియన్లను విదేశాలకు వెళ్ళిపోయేందుకు ప్రోత్సహిస్తోందని, వెస్ట్‌బ్యాంక్‌లో పాలస్తీనియన్లపై దాష్టీకాలు సాగిస్తోందని, కీలకమైన అవసరాలు నెరవేర్చకుండా ముఖ్యమైన సహాయాన్ని గాజాలోకి రాకుండా అడ్డుకుంటున్నదని ఆయన విమర్శించారు. గాజాలో ఒకవైపు నుండి విధ్వంసాన్ని కొనసాగించడమే కాకుండా, గాజా పునర్నిర్మానికి ఉద్దేశించిన సాంకేతిక సహాయాన్ని, వాహనాలను గాజాలోకి రానివ్వడంలేదని విమర్శించారు. కాగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారెక్ మాట్లాడుతూ, గాజాలోకి 4000 నిత్యావసర వస్తువులను అనుమతించకుండా ఇజ్రాయెల్ అడ్డుకుందని విమర్శించారు.

**సౌదీకి అమెరికా ఎఫ్–35 యుద్ధ విమానాలు ఐడిఎఫ్ తీవ్ర అభ్యంతరం**

సౌదీ అరేబియాకు అమెరికా ఎఫ్–35 యుద్ధ విమానాలను సరఫరా చేసే అవకాశాలు ఉన్నాయన్న విషయంపై ఇజ్రాయెల్ సైన్యం ఐడిఎఫ్ అధినేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సౌదీ అరేబియాకు ఎఫ్–35లు విక్రయిస్తే పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్ ఆధిపత్యం దెబ్బతింటుందని, అందువల్ల దీనిని అడ్డుకోవాలని ఐడిఎఫ్ పేర్కొంది. ఈ విమాన సరఫరాలను ఐడిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించింది.
సౌదీ అరేబియాకు అత్యాధునిక స్టీల్త్ జెట్ యుద్ధ విమానాలను విక్రయిస్తుందని సోమవారంనాడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధృవీకరించడంతో ఐడిఎఫ్ అభ్యంతరం పెట్టింది. ఈ మేరకు ఐడిఎఫ్ ఇజ్రాయెల్ చట్టసభకు ఒక పత్రాన్ని సమర్పించింది. ఈ విమానాల విక్రయం జరిగితే మొదటి డెలివరీ చేయడానికి ఏడు సంవత్సరాలు సమయం పడుతుంది. ఈ యుద్ధ విమానాలు ఎక్కడ ఎగురుతున్నాయన్న విషయాన్ని శత్రుదేశం కనుక్కోవడం చాలా కష్టమైన పని.

## నైజీరియాలో 25 మంది బాలికల కిడ్నాప్
### స్కూలు టీచర్ హత్య



**అబుజా:** నైజీరియాలో ఒక స్కూలు నుండి సాయుధులైన దుండగులు 25 మంది బాలికలను కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. వాయువ్య నైజీరియాలోని కెబ్బి రాష్ట్రం మాగాలో ఉన్న కాంప్రిహెన్సివ్ సెకండరీ స్కూలు హాస్టలుపై దాడిచేసిన సాయుధులైన దుండగులు స్కూలు ఉపాధ్యాయుణ్ణి కాల్చి చంపారు. 25 మంది బాలికలను కిడ్నాప్ చేశారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఈ ఘటన జరిగిందని పోలీసులు చెప్పారు. పోలీసులు పహారాలో ఉన్నా గానీ సాయుధులు ఫెన్సింగ్‌లు ఎక్కి రహస్యంగా హాస్టల్‌లోకి ప్రవేశించి టీచర్‌ను హత్యచేసి బాలికలను అపహరించుకుపోయారు. కాల్పుల్లో గాయపడిన మరో హాస్టల్ ఉద్యోగి కోలుకుంటున్నారు. పోలీసులు వెంటనే సైనికులను, ఆధునిక ఆయుధాలున్న పోలీసులను రంగంలోకి దించారు. ఆ ప్రాంతాన్ని స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. గడచిన పది సంవత్సరాలుగా నైజీరియాలో పాఠశాలలపై దాడులు చేయడం, బాలికా విద్యార్థినులను అపహరించి తీసుకుపోవడం ఒక అలవాటుగా మారింది. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి భారీగా ధనం సంపాదించడంకోసం సాయుధ మూకలు తరచు ఈ విధంగా స్కూళ్ళపై దాడులు చేస్తూ బాలికలను కిడ్నాప్ చేసి తీసుకుపోతున్నారు. ఐతే ప్రభుత్వం కూడా కిడ్నాపర్లకు లొంగడంలేదు. వారు కోరిన ధనాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం తిరస్కరిస్తోంది. వారిని అణచివేస్తోంది. ఐనాగానీ మళ్ళీ మళ్ళీ ఇలాంటి దాడులు జరుగుతూనే ఉన్నాయి.

## న్యాయవిచారణ
(మొదటి పేజీ తరువాయి)

స్పష్టంగా ఉందని, దానికి కట్టుకథ అల్లి ఎన్‌కౌంటర్ అనే అందమైన పేరు పెడుతున్నారని మండిపడ్డారు. శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పటికీ పంతం పట్టి మరీ కాల్చి చంపుతున్నారని, 2026 మార్చి నెలాఖరు నాటికి మావోయిజాన్ని లేకుండా చేస్తామని చెప్పిన మోడిషాలు వారు చెప్పిన మాటకు సార్థకత చేకూరేలా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌తో పాటు ఇప్పటి వరకు చోటు చేసుకున్న పలు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించి న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేయాలని డిమాండ్ చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ దేశంలో భయానక వాతావరణాన్ని సృష్టించడం సరైంది కాదని, ఎవరు తప్పు చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే మంచిదే అని, ఏకపక్షంగా వ్యవహరిస్తూ కనీస అవకాశం ఇవ్వకుండా చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా బూటకపు ఎన్‌కౌంటర్లు, మత గర్షణలకు, మతాలు, కులాల పేరుతో విభజనలకు స్వస్తి పలికి దేశంలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సలిగంటి శ్రీనివాస్, జి వీరస్వామి, చంద్ర నరేంద్ర, వంట్టికొండ మల్లికార్జునరావు, గుండెపిన్ని వెంకటేశ్వరరావు, వంగా వెంకట్, రత్నకుమారి, నాగుల్ మీరా పాల్గొన్నారు.



**ఎన్ కౌంటర్ ముమ్మాటికి కేంద్ర ప్రభుత్వ బూటకపు హత్యలే**
సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి
కేంద్రంలోని బీజేపీ, నరేంద్ర మోదీ ప్రభుత్వం మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నదని సీపీఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తీవ్రంగా విమర్శించారు. సీపీఐ బస్సు జాతా ముల్కనూర్‌కు చేరుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ “ఇంతకుముందు కనబడితే కాల్చివేత అన్న సామెత ఉండేదని,అయితే ఇప్పుడు 'సరెండర్ కావాలి లేకపోతే చంపేస్తాం, ఎన్‌కౌంటర్ చేస్తాం' అన్న విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోంది” అని ఆరోపించారు. ఇటీవల పద్మతో పాటు మరికొందరు మరణించిన ఘటన కూడా ముమ్మాటికీ బూటకపు ఎన్‌కౌంటర్ అని ఆయన పేర్కొన్నారు.

## అనుమతులు ఇవ్వొద్దు
(మొదటి పేజీ తరువాయి)

చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉందని తెలిపాం. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మొదట 45 టిఎంసిల నీటిని వెంటనే కేటాయించాలని విజ్ఞప్తి చేశాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.
సమ్మక్కసారక్క ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇవ్వండి
'గోదావరి జలాల్లో సమ్మక్కసారక్క ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్‌ను అందజేశామని, సిడబ్ల్యూసికి అనేక సందర్భాల్లో వారు అడిగిన వివరాలు ఇచ్చాం. ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని క్లియరెన్స్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. దాని పూర్తి వివరాలు మళ్లీ సమర్పించాం. బ్రిజేష్ ట్రిబ్యునల్ (కృష్ణా వాటర్ డిస్‌ప్యూట్ ట్రిబ్యునల్2) ఎపితెలంగాణ మధ్య 811 టిఎంసిలను ఇరు రాష్ట్రాలకు పంపిణీ చేయాలి. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కూడా చాలా నెమ్మదిగా జరుగుతున్నాయి. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం చొరవ చూపి జస్టిస్ బ్రిజేష్‌కు విజ్ఞప్తి చేసి ఈ ప్రొసీడింగ్స్‌ను వేగవంతంగా ఫైనల్ చేయాలని కోరాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.
**పోలవరం –బనకచర్లకు మేము వ్యతిరేకం**
ఆంధ్రప్రదేశ్ పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ఫీజుబులిటీ రిపోర్ట్‌ను అందజేశాం. దానిని మేము వ్యతిరేకించాం. అది చాలా స్పష్టంగా గోదావరి వాటర్ డిస్‌ప్యూట్ 1980 అవార్డులో ఫ్లడ్ వాటర్ కేటాయించడానికి ఎవరికీ ఎటువంటి ఆస్కారం లేదనే విషయాన్ని అప్పుడు కూడా తెలియజేశాం. ఇప్పుడు ఎపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు టర్మినల్ ఫేజ్‌ను, ప్రాజెక్టు పేరును మార్చి తిరిగి గోదావరి వరద జాలలపై మరొకసారి కేంద్రం ముందుకు వస్తున్న సందర్భంగా తెలంగాణ దీనికి కూడా వ్యతిరేకం అని చెప్పాం. స్పష్టంగా, లిఖితపూర్వకంగా కేంద్ర మంత్రికి వివరించాం. ఈ ప్రాజెక్టు అక్రమమం అని స్పష్టంగా చెప్పాం. ఈ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ రాష్ట్రాలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయో కేంద్ర మంత్రికి తెలియజేశాం. దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని చెప్పాం' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.
**ఆల్మట్టి ఎత్తు పెంచొద్దు.. ఆదేశాలు ఇవ్వండి**
'ఆల్మట్టి డ్యాం 519 మీటర్ల కంటే ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టులో స్టే ఉంది. ఈ స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం మంత్రివర్గం తీర్మాణం చేసి, జీఓ ఇచ్చి ఎత్తు పెంచడానికి భూసేకరణ కోసం ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం. ఇది చట్ట వ్యతిరేకం, కేంద్ర ప్రభుత్వం కూడా కర్ణాటక ప్రభుత్వానికి చెప్పాలని విజ్ఞప్తి చేశాం. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచితే తెలంగాణాకు అన్యాయం జరుగుతుంది. అందుకే దీనిని తెలంగాణ వ్యతిరేకిస్తున్నాం' అని వివరించినట్లు మంత్రి ఉత్తంకుమార్ తెలిపారు.
**ప్రాజెక్టులకు నిధులు ఇవ్వండి**
'గత 22 నెలల నుంచి నీటిపారుదల ప్రాజెక్టుల కోసం నిధులు ఇవ్వాలని అడిగాం. ఇప్పటివరకు నిధులు ఇచ్చిన ప్రాజెక్టులను తెలంగాణ పూర్తి చేయాలని తనతో పాటు సిఎం రేవంత్ రెడ్డి కలిసినప్పుడు చెప్పారు. ఆ సూచన మేరకు దేవాదుల ప్రాజెక్టు మినహా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేశాం. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం తెలంగాణ కొన్ని ప్రాజెక్టుల జాబితాను రూపొందించామని, వాటికి సిడబ్ల్యూసి నుంచి పెట్టుబడుల అనుమతులు ఇప్పించాలని కోరాం. ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు, నారాయణపేట కొడంగల్ ప్రాజెక్టు, సీతారామ ప్రాజెక్టు, పాలమూరురంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మోదికుంట వాగు ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అడిగాం' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.
'రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కృష్ణా నది నీటిని ఎవరూ ఎక్కువ మళ్లించవద్దు. దుర్వినియోగం చేయొద్దు. దీనిపై కెఆర్‌ఎంబికి అధికారం ఇచ్చారు. అయితే గత పదేళ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పదేపదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, కెఆర్‌ఎంబికి నిధులు ఇచ్చి టెలిమెట్రీ స్టేషన్ ఏర్పాటు చేయడంలో కొంత పురోగతిని తీసుకొచ్చాం. ఫేజ్1 కింద 18 టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటు జరిగింది. ఫేజ్2 కింద మరో 9 చేయాల్సి ఉంది. ఫేజ్3 కింద 11 టెలిమెట్రీ స్టేషన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఉంది. ఫేజ్2, ఫేజ్3కి సంబంధించి కెఆర్‌ఎంబికి ఆదేశాలు ఇచ్చి వేగవంతంగా పూర్తి చేయాలని కోరాం. అప్పుడు ఏ రాష్ట్రం ఎంత కృష్ణా నది నీటిని వాడుకుంటుందో స్పష్టంగా తెలుస్తుందని చెప్పాం. అంతర్రాష్ట్ర వివాదాలు తగ్గుతాయని కేంద్రమంత్రికి వివరించాం. వెంటనే స్పందించిన కేంద్రమంత్రి సిఆర్ పాటిల్ కెఆర్‌ఎంబికి, ఎపి ప్రభుత్వానికి ఆదేశాలు ఇస్తామని చెప్పారు' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితోపాటు ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయెల్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సర్‌పై ఇక వీధుల్లోకి..
(మొదటి పేజీ తరువాయి)

జరగలేదని అన్నారు. తాము వీధుల్లోకి వస్తామని, డిసెంబర్ మొదటి వారంలో రాంలీలా మైదానంలో లక్షలాది మందితో కాంగ్రెస్ పార్టీ భారీ ర్యాలీని నిర్వహిస్తోందన్నారు. ఓటరు జాబితాల శుద్ధి అనేది తిరస్కరించలేని అవసరమైన లక్ష్యం అయినప్పటికీ, దానిని నిజాయితీగా నిర్వహించాలని వేణుగోపాల్ అన్నారు. సంస్థల పక్షపాత దుర్వినియోగం ద్వారా ప్రజాస్వామ్య రక్షణలు దెబ్బతినడానికి కాంగ్రెస్ అనుమతించదన్నారు. మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, మన రాజ్యాంగ చట్రాన్ని బెదిరించే ప్రతి ప్రయత్నాన్నీ తాము ఎదుర్కొంటామని వేణుగోపాల్ నొక్కి చెప్పారు. ఎన్నికల కమిషన్ సమాజంలోని కొన్ని వర్గాల ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించడానికి ప్రయత్నిస్తోందని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీల సాధారణ భావనగా ఉందన్నారు. సర్ రూపకల్పననే లక్ష్యంగా చేసుకున్న ఓట్లను తొలగించడమేనని, బిహార్‌లో కూడా తాము దీనిని అనుభవించామని, ఇప్పుడు వారు దీనిని 12 రాష్ట్రాల్లో ప్రారంభించబోతున్నారని అని ఆయన అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి ఎన్నికల కమిషన్ చేసిన దుర్మార్గపు ప్రయత్నం ఇదని, ఇది పూర్తిగా అనైతికం, పూర్తిగా అప్రజాస్వామికమని వేణుగోపాల్ ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ సాధారణంగా ఎక్కువ కాలం ఎన్నికల సమయంలో జరుగుతుందని, కానీ ఇప్పుడు అది ఒక నెలలోనే జరుగుతుందని పేర్కొన్నారు. దీని కారణంగా, ఒత్తిడి కారణంగా బిఎల్‌ఓల అనేక ఆత్మహత్యలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియను ఒక నెలలోపు పూర్తి చేయాలని ఇసి అధికారులు వారిపై ఒత్తిడి తెస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ బిజెపి, నరేంద్ర మోదీ తరపున మాత్రమే పనిచేస్తున్నట్లు చాలా స్పష్టంగా తెలుస్తోందన్నారు. కాగా, సమావేశానికి అధ్యక్షతన వహించిన ఖర్గే 'ఓటు చోరీ' కోసం ఓటర్ల జాబితా ప్రక్రియను బిజెపి 'ఆయుధంగా' ఉపయోగించుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు ఎన్నికల జాబితా సమగ్రతను కాపాడటానికి కాంగ్రెస్ పార్టీ నిస్సందేహంగా కట్టుబడి ఉందని ఖర్గే ఆ తర్వాత ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల విశ్వాసం ఇప్పటికే దెబ్బతిన్న సమయంలో సర్ ప్రక్రియ సమయంలో ఎన్నికల కమిషన్ ప్రవర్తన తీవ్ర నిరాశపరిచిందన్నారు. ఇది బిజెపి నీడలో పనిచేయడం లేదని నిరూపించుకోవాలన్నారు. ఏ పాలక పార్టీకి కాకుండా రాజ్యాంగ ప్రమాణం చేసిన సంస్థగా, ప్రజల పట్ల విధేయతను గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఓటు చోరీ కోసం సర్ ప్రక్రియను ఆయుధంగా మార్చడానికి బిజెపి ప్రయత్నిస్తోందని తాము దృఢంగా విశ్వస్తున్నామన్నారు.

## సహకరించండి
(మొదటి పేజీ తరువాయి)

వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిధిగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత వేగంగా భారతదేశం అభివృద్ధి చెందుతున్నదని, 'వికసిత్ భారత్ 2047'కు అనుగుణంగా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ పనిచేస్తున్నారన్నారు. 'తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్'ను డిసెంబర్ 9వ తేదీన విడుదల చేయనున్నట్లు సిఎం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నామని సిఎం ప్రకటించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో 10 శాతం ఆర్థిక వ్యవస్థను తెలంగాణ నుంచి అందించాలని భావిస్తున్నామని సిఎం వెల్లడించారు. రానున్న ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్ నగరంలో తీసుకురావాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నగర అభివృద్ధితోపాటు కాంగ్రెస్ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నామని, తెలంగాణ రాష్ట్రాం పోటీ ఇతర రాష్ట్రాల నగరాలతో కాదని, తెలంగాణ పోటీ సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతోనని, ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని సిఎం అన్నారు.

## పలు పాలసీలు
(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ' బ్యాంకర్స్ 47వ త్రైమాసిక సమావేశం' భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంగా 13 శాతం జిడిపి పెరుగుదల టార్గెట్‌గా 2047 రోడ్ మ్యాప్‌ను విడుదల చేయబోతున్నామన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, రీజినల్ రింగ్‌రోడ్‌ను ఔటర్ రింగ్ రోడ్డును కలుపుతూ అనేక ఇండస్ట్రియల్ కారిడార్ల నిర్మాణం, మూసి పునర్జీవనం వంటి అంశాలను వివరించి ప్రపంచ వ్యాప్తంగా వస్తున్నపెట్టుబడిదారులను పెద్ద ఎత్తున ఆకర్షించబోతున్నామన్నారు. విద్య, ఆరోగ్యం అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన దృష్టి సారించిన క్రమంలో ఈ రంగాల్లో సిఎస్‌ఆర్ నిధులను ఖర్చు చేయాలన్నారు. విద్యను ప్రోత్సహించేందుకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, డిజిటలైజ్ ఎడ్యుకేషన్ అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు.
తెలంగాణలో వరి ఉత్పత్తి అద్భుతమని, కానీ ఇప్పుడు పరిమాణం నుంచి విలువ వైపు అడుగులు వేయాలని సూచించారు. భవిష్యత్ ఆదాయాలను భద్రపర్చే ఫామ్ ఆయిల్ తో పాటు ఇతర విభిన్న పంటలకు బ్యాంకులు ఎక్కువ మద్దతు ఇవ్వాలని కోరారు.కొన్ని జిల్లాల్లో ఇంకా ఎస్‌హెచ్‌జి రుణాలు తమ పూర్తి సామర్థ్యాన్ని చేరుకోవడం లేదని, మహిళలు తమ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించేందుకు ఎక్కువ పరిమితులు, వేగవంతమైన రీపీట్ ఫైనాన్స్ అందించాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ఒక శక్తివంతమైన వేదిక అని, దీనిని పూర్తిస్థాయిలో వినియోగించి మహిళా ఆధారిత ఆర్థిక మార్పును వేగవంతం చేయాలని బ్యాంకులను కోరారు. ఎంఎస్‌ఎంఈలు ఇప్పటి వరకు ఎపిసి లక్ష్యాలలో 50.23 శాతం సాధించినప్పటికీ, వర్కింగ్ క్యాపిటల్ కొరతలు, రుణాల ప్రక్రియలో ఆలస్యం అనేక సంస్థలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వివరించారు. 13,000 కిలోమీటర్ల అంతర్గత రహదారుల నిర్మాణం జరుగుతోందని, ఇది రాష్ట్ర ఆర్థిక పటాన్ని సమూలంగా మారుస్తుందని, దీనిని బ్యాంకులు ప్రాధాన్య రంగ రుణ అవకాశంగా చూడాలని చెప్పారు. డిజిటల్ పేమెంట్ వ్యవస్థల్లో ఆన్‌బోర్డింగ్‌ను వేగవంతం చేసి, చివరి మైలు డెలివరీని బలోపేతం చేయాలన్నారు. ఆత్మవిశ్వాసం, సమిష్టి కర్తవ్యంతో ఒక ఆధునిక, సమగ్ర, భవిష్యత్ సిద్ధ తెలంగాణను నిర్మిద్దామన్నారు.
**49.45 శాతం ప్రధాన్యత రంగ రుణాలను సాధించి బ్యాంకులు**
బ్యాంకులు ఈ ఏడాది తొలి అర్ధభాగంలో 49.45 శాతం ప్రాధాన్య రంగ రుణాలను సాధించాయని, క్రెడిట్‌డిపాజిట్ నిష్పత్తి 130.18 శాతంగా ఉండటం తెలంగాణ ఆర్థిక ప్రయాణంపై ఉన్న విశ్వాసాన్ని స్పష్టం చేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. వ్యవసాయ మౌలిక వసతుల నిధి అంశంలో మంచి పురోగతి సాధించామని, ఇది ప్రారంభం మాత్రమేనని, తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నిజంగా మార్పు చేయాలంటే పంటకోత, ఆ తర్వాత మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్ యూనిట్లు, సూక్ష్మ పంట నీరు, అనుబంధ రంగాల్లో బ్యాంకు రుణాలను మరింతగా పెంచాలని బ్యాంకర్లకు భట్టి సూచించారు. పంట రుణాలు సమర్థవంతంగా అందుతున్నప్పటికీ, వ్యవసాయ టర్మ్ లెండింగ్ అవసరానికి తగినట్టుగా లేదని, ఇది రైతుల ఆధునీకరించుకోవడం, వైవిధ్యం చేర్చుకోవడం, ఆత్మనిర్భర స్థాయి నుంచి సంపన్న స్థాయికి చేరడానికి సహాయపడదని డిప్యూటీ సిఎం అభిప్రాయపడ్డారు. ఈ లోటును బ్యాంకులు అత్యవసరంగా భర్తీ చేయాలని కోరారు. రూ.2 లక్షల వరకు పంట రుణ మాఫీ, రైతు భరోసా, సాగునీటి ప్రాజెక్టులు, 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, వీటికి బ్యాంకుల భాగస్వామ్యం కలిస్తే, మరింత ప్రతిఘటనశీలమైన, వాతావరణ మార్పులకు సిద్ధమైన వ్యవసాయ రంగాన్ని నిర్మించగలమని భట్టి విక్రమార్క విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## హిడ్మా ఎన్‌కౌంటర్
(మొదటి పేజీ తరువాయి)

జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతి చెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు.
**ఉలిక్కిపడ్డ ఏజెన్సీ...**
ప్రముఖ పర్యాటక ప్రాంతంగా పేరొందిన మారేడుమిల్లిలో భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో ఏజెన్సీ ఉలిక్కిపడింది. జిల్లా కేంద్రం పాడేరు సహా ఏజెన్సీ వ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించారు. ఏపీ ఇంటిలిజెన్స్ అధిపతి మహేష్ చంద్ర లడ్డా రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఎన్‌కౌంటర్ వివరాలు వెల్లడించారు. గత కొద్దినెలలుగా హిడ్మా ఏఓబీలో ప్రవేశించినట్లు నిఘావర్గాల నుంచి సమాచారం అందడంతో అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్నామని, ఈ రోజు మారేడుమిల్లి టైగర్ జోన్ అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలకు కొందరు మావోయిస్టులు తారసపడటంతో అరగంటకు పైగా జరిగిన ఎదురు కాల్పులు జరిగాయని తెలిపారు. ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని, అందులో మావోయిస్టు అగ్రినేత హిడ్మాతో పాటు అతని భార్య రాజే ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కాగా మరి కొందరు మావోయిస్టులు అటవీ ప్రాంతంలోకి పారిపోయారని, వారికోసం గాలింపు కొన సాగుతోందని వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి రెండు ఏకే 47లు, ఒక పిస్టల్, ఒక రివాల్వర్, ఒక సింగిల్ బార్ వెపన్‌తో పాటు మందుగుండు కిట్ బ్యాగ్‌లు, వైర్‌లు తదితర సామాగ్రి స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు.
**హిడ్మాపై కోటి రూపాయల రివార్డు**
చత్తీస్‌గఢ్‌లో గిరిజన తెగకు చెందిన హిడ్మా భద్రతా దళాలు, ప్రజా ప్రతినిధులుపై జరిగిన అనేక దాడుల్లో పాల్గొన్నాడు. 26 పైగా దాడులలో నిందితుడిగా ఉన్నాడు. ఇతడిపై కోటి రూపాయలు పైగా రివార్డు ఉంది. చాలా తక్కువ సమయం లో నే మావోయిస్టు పార్టీ లో కీలక నేతగా ఎదిగాడు.
**మరోఘటనలో :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో చోటు చేసుకున్న మరో ఎన్కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. సుక్మా జిల్లా ఎస్‌పి కిరణ్ చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం, సుక్మా జిల్లా బెజ్జి చింతగుపా పోలీస్ స్టేషన్ పరిధి తూమాల్‌పాడ్ అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు కూంబిగ్ చేస్తున్న బలగాలకు మావోయిస్టులు తారసపడంతో ఈ ఎదురు కాల్పులు జరిగాయి. ఇరు వర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో కుంట ఏరియా కమిటిమెంబర్ మాద్వి దేవా, కుంటా ఏరియా కమిట కమాండెంట్ పొడియం గంగి, కిష్టారం ఏరియా కమిటీ సభ్యుడు సోడి గంగి ఉన్నారు. వీరొక్కరికిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. ఘటనా స్థలం నుండి తుపాకులు, లాంచర్లు, డిటోనేటర్లు, మందుగుండు సామాగ్రి స్వాదీనం చేసుకున్నారు.
**5జిల్లాల్లో అక్టోపస్, ఇంటిలిజెన్స్ ముమ్మర గాలింపు : 50మందికిపైగా అరెస్టు**
ఆంధ్రప్రదేశ్‌లో చాలాకాలం తర్వాత మావోయిస్టుల అలజడి రేగింది. ఆపరేషన్ కగార్‌తో వరుస ఎన్‌కౌంటర్లు, అగ్రనేతల మతితో చత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చారన్న సమాచారంతో కొంతకాలంగా పోలీసులు నిఘా పెట్టారు. ఏకకాలంలో రాష్ట్రంలోని అల్లూరి, కాకినాడ, ఎన్టీఆర్, కష్ణా, ఏలూరు జిల్లాల్లో ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బందాలు ఆపరేషన్ చేపట్టాయి. ఇప్పటి వరకు విజయవాడనగర పరిసర ప్రాంతాల్లో 32, కాకినాడలో 2, ఏలూరులో 15 మందిని, మిగతా ప్రాంతాల్లో మరికొంతమందితో కలుపుకుని మొత్తంగా రాష్ట్రంలో 50 మందికి పైగా మావోయిస్టులను అరెస్టు చేశారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు డంప్‌ల కోసం గాలింపు కొనసాగుతోంది. హిడ్మా డైరీ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సోదాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాల్లో ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బందాలు ఆపరేషన్ చేపట్టాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కొన్ని నెలలుగా ఒడిశా, చత్తీస్‌గఢ్, ఆంధ్ర రాష్ట్ర సరిహద్దుల్లో మావోయిస్టుల కోసం కేంద్ర బలగాలు, గ్రేహౌండ్స్ జల్లెడ పట్టాయి. కొంతమంది మావోయిస్టు తలదాచుకునేందుకు కాకినాడ, ఏలూరు, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలకు తరలి వచ్చారనే సమాచారంతో ఆ జిల్లాల ఎస్పీలు నేతృత్వంలో విస్తత తనిఖీలు చేపట్టారు. ఎన్టీఆర్‌జిల్లా, కృష్ణా, అల్లూరి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో 60 నుంచి 70 మంది మావోయిస్టులు తలదాచుకోగా... ఇప్పటివరకు 50మందికి పైగా మావోయిస్టులు, సానుభూతి పరులను అధికారికంగా అరెస్టు చేసినట్లు తెలిసింది. వీరిలో నలుగురు కీలక వ్యక్తులు ఉన్నట్లు సమాచారం.



# జనరల్
STATE & REGIONAL NEWS

## డిసెంబర్ 1న బాపుఘాట్‌లో బిసి రిజర్వేషన్ల సాధనకై ప్రార్థనలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల సాకారం కావాలని కోరుతూ బాపు ఘాట్‌లో ప్రార్థనలు చేయాలని కమిషన్ నిర్ణయించింది. ఈ కార్యక్రమం డిసెంబర్ 1న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరగనుందని కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా టూరిజం శాఖ డైరెక్టర్, జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌తో పాటు పోలీస్ అధికారులను కోరడం జరిగిందన్నారు. బాపు ఘాట్‌లో బాపూజీ చితాభస్మం భద్రపరిచిన సమాధి వద్ద జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రార్థనలతో పాటు బాపూజీ భజనలు ఆలపించడం జరుగుతాయని పేర్కొన్నారు.

## మీ సేవ సర్వీసెస్ ఆన్ 'వాట్సాప్'

ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్: 'పీపుల్ సెంట్రిక్ డిజిటల్ గవర్నెన్స్'లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఏటా 10 లక్షల మంది తెలంగాణ యువతను 'ఐ' నిపుణులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన 'మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్'ను మంగళవారం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణాలో ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 'గవర్నెన్స్' అంటే కేవలం నాలుగు గోడల మధ్య పాలించడం కాదన్నారు. రాచరిక పోకడలతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసేలా వ్యవహరించిందన్నారు. ప్రజలను పాలనలో భాగస్వామ్యం చేస్తూ... టెక్నాలజీ సాయంతో పౌర సేవలను వారి ముంగిటకే చేరుస్తూ 'గుడ్ గవర్నెన్స్'వైపు అడుగులు వేస్తున్నామన్నారు. మా ప్రభు త్వం టెక్నాలజీని కేవలం సాఫ్ట్‌వేర్‌గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తున్నామన్నారు. టెక్నాలజీ ఫలాలను రాష్ట్రంలోని మారుమూల ప్రాంతంలో ఉన్న చివరి వ్యక్తి వరకూ చేర్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ ఛేంజ్, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, తెలంగాణ ఇన్నోవేషన్ హబ్‌తో 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్'లో తెలంగాణ ఒక బెంచ్ మార్క్‌ను సెట్ చేస్తోందన్నారు. తాజాగా ఇతర రాష్ట్రాలు తెలంగాణను అనుసరించేలా మీ సేవ ద్వారా అందించే 580కు పైగా 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన పౌర సేవలను ఫింగర్ టిప్స్‌పై వాట్సాప్‌లో ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ డిజిటల్ యుగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా జెన్ ఏఐ, మొబైల్ ఫస్ట్ అప్రోచ్ ద్వారా పౌర సేవల డెలివరీ ముఖ చిత్రాన్ని మార్చిన ఘనత 'తెలంగాణ'కే దక్కిందన్నారు. త్వరలోనే తెలుగు, ఉర్దూలోనూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఇతర ప్రభుత్వ విభాగాలకు ఈ వాట్సాప్ సేవలను విస్తరిస్తామన్నారు. టైప్ చేయాల్సిన అవసరం లేకుండా వాయిస్ కమాండ తోనే అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, మీ సేవ కమిషనర్ రవి కిరణ్, మెటా ప్రతినిధి నటాషా తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పోలీస్ 'రీస్కిల్లింగ్' కావాలి

పోలీసులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణను ప్రారంభించిన డిజిపి శివధర్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీసు వ్యవస్థలో రోజు రోజుకు వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి ఒక్క పోలీసు రీస్కిల్లింగ్ కావాల్సిన అవసరం ఉందని డిజిపి బి.శివధర్‌రెడ్డి అన్నారు. ఉద్యోగి జీవితంలో శిక్షణ కీలకపాత్ర పోషిస్తుందని, ట్రైనింగ్‌లో అనేక కొత్త విషయాలను నేర్చుకోవచ్చని ఆయన చెప్పారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రజల్లో చైతన్యం పెరిగిందని, అందుకు అనుగుణంగా పోలీసుల ప్రవర్తనలో మార్పు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. బంజారాహిల్స్‌లోని ఐసిసిసిలో హైదరాబాద్ పోలీసులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నగర పోలీసు కమిషనర్ విసి సజ్జనార్‌తో కలిసి డిజిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.. ఏ సంస్థ అయినా అభివృద్ధి చెందాలంటే సిబ్బందికి శిక్షణ అవసరం అన్నారు. ఈ శిక్షణ నైపుణ్యం పెంచడంతో పాటు అందరికీ ఒకే తాటిపైకి తీసుకువచ్చేందుకు దోహదం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఒక నెల నుంచి కసరత్తు చేసి.. మంచి ప్రణాళికతో ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరిని ఒక సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన పోలీస్ అధికారిగా తీర్చిదిద్దేలా రూపొందించామని తెలిపారు. గతాన్ని తెలుసుకుని.. భవిష్యత్తు దిశలో ముందుకు తీసుకెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రవర్తన, పనితీరే పోలీస్ ప్రతిష్టను ఇనుమడింపజేస్తోందనే విషయాన్ని సిబ్బంది గుర్తుంచుకోవాలని వివరించారు. సజ్జనార్ మాట్లాడుతూ పోలీసు సిబ్బందిలో నైపుణ్యాలను పెంపొందించి, ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించడమే ఈ శిక్షణా కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అన్నారు. కమిషనరేట్ పరిధిలోని 19,488 మందికి దశలవారిగా శిక్షణ ఇవ్వనున్నామని, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు గాను 178 మంది ప్రత్యేక శిక్షకులను ఎంపిక చేశామన్నారు. అందులో 74 మంది ఎసిపిలు, 98 మంది ఇన్‌స్పెక్టర్లు, 6 మంది ఎస్‌ఐలు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైమ్స్ అడిషనల్ సిపి ఎం.శ్రీనివాస్, అడ్మిన్ జాయింట్ సిపి పరిమళ హాన నూతన్, ఎఆర్ డిసిపి రక్షితా కృష్ణమూర్తి, ఎస్‌బి డిసిపి కె.అపూర్వరావు, సిసిఎస్ డిసిపి శ్వేత, డిసిపిలు స్నేహా మెహ్రా, బి.బాలస్వామిలు పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని సిఒఎల్ అధ్యక్షుడు పీటర్ స్కాట్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివరించారు. ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ (ఐడియా) ఏర్పాటు నిమ్మితం కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సిఒఎల్)తో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపర్చేందుకు 'ఐడియా' అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పని చేస్తుంది. ఈ సమావేశంలో కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్ (సిఒఎల్) అధ్యక్షుడు, సిఇఒ పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.


## ఐ బొమ్మ రవి కేసులో ఇడి దర్యాప్తు

మనీలాండరింగ్ జరిగినట్టు అనుమానం

ప్రజాపక్షం/హైదరాబాద్: ఐ బొమ్మ రవి అంశంలో డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) ఎంట్రీ ఇచ్చింది. ఈమేరకు కేసు వివరాలివ్వాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ విసి సజ్జనార్‌కు మంగళవారం ఇడి లేఖ రాసింది. ఐబొమ్మ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగినట్టు ఇడి అనుమానిస్తోంది. నిందితుడు ఇమ్మడి రవి బ్యాంకు ఖాతాల నుంచి పోలీసులు ఇప్పటికే రూ.3.5కోట్లు ఫ్రీజ్ చేసినట్లు సజ్జనార్ చెప్పిన విషయం తెలిసిందే. విడుదలైన భారీ చిత్రాలు కొద్ది గంటల్లోనే ఐ బొమ్మలో ప్రేక్షకులు ఉచితంగా చూసేవారు. అయితే రవికి మాత్రం బెట్టింగ్ యాప్స్ నుంచి భారీ ప్రకటనలు వచ్చేవి. ప్రకటనల రూపంలో రవికి నిధులు అందినట్టు దర్యాప్తులో తేలింది. క్రిప్టోవాలెట్ నుంచి రవి



ఎన్నారై ఖాతాకు నెలకు రూ.15 లక్షలు బదిలీ అయ్యాయి. నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణపై ఈడీ అధికారులు పూర్తి




స్థాయిలో దర్యాప్తు చేయనున్నారు.ఇడి రంగంలో దిగడంతో ఐ బొమ్మ రవి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఆయన బ్యాంకు ఖాతాలకు కోట్లాది రూపాయలు జమ కావడంతో మనీలాండరింగ్ జరిగినట్టు ఇడి గుర్తించింది. దీంతో ఇడి దర్యాప్తు వేగవంతమైంది.

## బిసిల రిజర్వేషన్లు పార్టీపరంగా వద్దు

క్యాబినెట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

సర్కార్‌కు ఎంపి ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పార్టీపరంగా ఇస్తామని క్యాబినెట్ తీసుకొన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం జాతీయ కార్యదర్శి బాణాల అజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కృష్ణయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి, మాట్లాడారు. జనాభా ప్రకారం బిసిలకు స్థానిక, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో శాశ్వత పరిష్కారానికి రాజ్యాంగ సవరణ జరగాలని, ఇందుకు రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలని కోరారు. ఏడాదికాలంగా బిసిలను నమ్మించి, మోసం చేయడం దుర్మార్గమైన చర్య అని, రాష్ట్ర ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మార్చిలోపు ఎన్నికలు పూర్తిచేయకపోతే రూ.3వేల కోట్లు వృథా అవుతాయని సిఎం చెప్తున్నారని, మరి, 2 కోట్ల మంది బిసిల ఆకాంక్షను నెరవేర్చక వంచించడం కరెక్టేనా? అని ప్రశ్నించారు. రెండు నెలల్లో న్యాయస్థానాల్లో ఉన్న బిసి కేసులు పరిష్కారమవుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈలోపు అఖిలపక్షాలను ఢిల్లీకి తీసుకెళ్లి, ప్రధానితో చర్చలు జరిపి సమస్య పరిష్కారం చూపాలని కోరారు. తర్వాత ఎలాంటి చిక్కుల్లేకుండా బిసిలకు 42 రిజర్వేషన్లు ఇచ్చి దేశ చరిత్రలో నిలిచిపోవాలని ఆయన సిఎంకు సూచించారు. సమావేశంలో సంఘం నేతలు నీలం వెంకటేశ్, అంజి, అనంతయ్య, సి.రాజేందర్, పగిళ్ల సతీశ్, మోదీ రాందేవ్, రాజ్‌కుమార్, భీంరావ్ తదితరులు పాల్గొన్నారు.

## 50 శాతం నిర్ణయించడం ఆత్మహత్యాసదృశ్యం

బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్

ప్రతిపక్షం/హైదరాబాద్: స్థానిక సంస్థలలో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఆశలు కల్పించి, చివరకు బిసిల ఆశలపై నీళ్ళు చల్లే విధంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం లోపు కల్పించే విధంగా నిర్ణయించడం ఆత్మహత్యాసదృశ్యమని బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతిలో జరిగిన ఒక సమావేశంలో మాట్లాడుతూ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగంలో మార్పులు జరిగాయని, 'భారత రాజ్యాంగం స్థిరంగా ఉండే పత్రం కాదు. పరిస్థితులకు, సహజ అవసరాలకు అనుగుణంగా రాజ్యాంగ సవరణకు అధికరణ 308 ద్వారా వెసులుబాటు కల్పించారు' అని వ్యాఖ్యానించినట్లు గుర్తుచేశారు. సాంఘిక, ఆర్థిక సవాళ్ళను ఎదుర్కొనే క్రమంలో పార్లమెంట్ రాజ్యాంగ సవరణలు చేస్తుందని, అంబేద్కర్ కోరుకున్నది కూడా అదే అని ఆయన పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టులో జరుగుతున్న వాద ప్రతివాదనలకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ వ్యాఖ్యలకు కనువిప్పు కలిగించాలన్నారు. కె.కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (11 మే 2010) కేసులో 5 గురు జడ్జిల బెంచ్ రిజర్వేషన్లు 50% కంటే ఎక్కువగా ఉండొద్దన్న తీర్పును ఆధారంగా చేసుకొని, బీసీలకు 42% రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఇది కాలానుగుణమైన మార్పులను పరిగణలోకి తీసుకోకుండా జరుగుతున్న వాదనలు, బీసీలకు గొడ్డలిపెట్టుగా మారుతున్న విషయం గమనించాలని కోరారు. ఇంటింటి సర్వే నిర్వహించి బిసిల వెనుకబాటుతనాన్ని గుర్తించిన విషయాన్ని ఏమాత్రం లెక్కచేయకుండా 5 గురు జడ్జిలతో కూడిన తీర్పునే ఉటంకిస్తూ అడ్డుకోవడం, రాజకీయ కారణాలతో బిసి బిల్లును 9వ షెడ్యూలులో పెట్టకపోవటం దురదృష్టకరమని విచారణ వ్యక్తం చేశారు. 5 గురు జడ్జిల బెంచ్ ఇచ్చిన తీర్పును వెంటనే ఛాలెంజ్ చేస్తూ ఏడుగురు జడ్జిల విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి విచారణ జరిపి, బీసీలకు న్యాయం చేయాలని సుప్రీంకోర్టును అభ్యర్థించాలని బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ ప్రభుత్వాన్ని కోరారు.



## శాసనమండలి మరమ్మతు పనులు సిఎం పరిశీలన

ప్రజాపక్షం/హైదరాబాద్ : శాసనసభ ప్రాంగణంలో శాసనమండలి మరమ్మతు పనులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి అసెంబ్లీ ఆవరణలోని శాసనమండలి మరమ్మతు పనుల గురించి లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. అసెంబ్లీ హాల్ నుంచి శాసనమండలిని ఏర్పాటు చేయనున్న పాత అసెంబ్లీ భవనం వరకు సిఎం కలియతిరిగి మరమ్మతు పనులను పరిశీలించారు. శాసనమండలి సభ్యులకు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా సిఎం పలు సూచనలు చేశారు.

## ఇంటర్‌బోర్డులో సంస్కరణల అమలుపై హర్షం

ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రైజింగ్ తెలంగాణ నినాదంతో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డికి ఇంటర్మీడియట్ బోర్డు ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి సిహెచ్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సిఎం దిశానిర్దేశాల మేరకు ఇంటర్ బోర్డులో పలు పరిపాలనా సంస్కరణలు అమలు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఫైళ్లన్నీ డిజిటల్ విధానంలోనే నడుస్తుండటంతో పారదర్శకత, వేగం పెరిగినట్టు తెలిపారు. ఫిబ్రవరి పరీక్షల దృష్ట్యా జిహెచ్‌ఎంసి సూచనలతో పాటు ఉన్నతాధికారుల కమిటీ సిఫార్సుల మేరకు టిజిఈడబ్ల్యుఐడిసి ద్వారా మరమ్మతులు చేయించారని వారు తెలిపారు. 2 నెలల ముందే పరీక్షలు నిర్వహణ కార్యక్రమాలను నిర్వహించి 70,000 మంది విద్యార్థులకు జీవిత నైపుణ్యాలు, మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు శిక్షణను అందిస్తున్నారన్నారు. 2026 ఇంటర్మీడియట్ పరీక్షలను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అధికారులు వెల్లడించారు. సంఘం ఉపాధ్యక్షులు మురళీధర్, కోశాధికారి వంశీ కృష్ణ, కల్చరల్ సెక్రటరీ సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# హిడ్మా శకం ముగిసింది

ఆరు రాష్ట్రాలకు మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు

ప్రజాపక్షం/ఖమ్మం : ఆరు రాష్ట్రాల పోలీసులకు, కేంద్ర బలగాలకు మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుగా పేరొందిన హిడ్మా శకం ముగిసింది. దండ కారుణ్యంలో దాదాపు రెండు దశాబ్దాల పాటు పోలీసులకు కంటిపై కునుకు లేకుండా చేసిన మడివి హిడ్మా మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు పోలీసులు ధృవీకరించారు. ఆదివాసీ కుటుంబంలో 1981లో ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పువార్తి గ్రామంలో జన్మించాడు. పదవ తరగతి వరకు చదివిన హిడ్మా మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితుడయ్యాడు. గెరిల్లా యుద్ధ తంత్రంలో ప్రధాన వ్యూహకర్తగా పేరొందాడు. చదివింది పదవ తరగతి అయినా హిందీ, ఇంగ్లీష్, గోండి, కోయ, బెంగాలీ భాష సహా పలు భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడు. ఆదివాసీగా మావోయిస్టు కేంద్ర కమిటీకి ఎదిగిన అతి కొద్ది మందిలో హిడ్మా ఒకరు కాగా అతిపిన్న వయస్సులో కేంద్ర కమిటీలో స్థానం పొందిన వాడు హిడ్మానే. హిడ్మా ప్లాన్ వేశాడంటే తిరుగుండదన్న భావన అటు పోలీసుల్లోనూ ఇటు మావోయిస్టుల్లోనూ ఉంది. కమాండర్‌గా, కేంద్ర కమిటీ సభ్యునిగా పని చేస్తున్న హిడ్మా మావోయిస్టు ఉద్యమంలో అత్యంత కీలక నేతగా ఎదిగారు.



ప్రభుత్వం అతనిపై కోటి రూపాయలు రివార్డు ప్రకటించిందంటే హిడ్మా స్థాయి ఏమిటో, హిడ్మా చర్యలు ఏవిధంగా ఉంటాయో అవగతమవుతుంది. రెండు దశాబ్దాల పాటు పోలీస్ బలగాలకు హిడ్మా కొరకరాని కొయ్యగా మారాడు. అతి సునాయాసంగా దాడుల నుంచి తప్పించుకునే వాడు. ఆదివాసీలను మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షించడంలోనూ హిడ్మా దిట్టగా పేరొందాడు. మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మృతి చెందడంతో దాదాపు ఓ శకం ముగిసిందని చెప్పవచ్చు. అయితే హిడ్మా లొంగిపోతాడని కొందరు ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి కూడా పారారయ్యాడని మరి కొందరు ఇలా ఎవరు ప్రచారం చేసినా చివరకు సాయుధుడిగానే ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మృతి చెందాడు. హిడ్మా ఎన్‌కౌంటర్‌కు సంబంధించి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హిడ్మాను పట్టుకుని కాల్చి చంపారని పౌర హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికే మావోయిస్టు ఉద్యమం బలహీనపడి కొందరు హతమవుతుండగా మరి కొందరు లొంగిపోతున్న దశలో మావోయిస్టుల్లోనే చురుకైన నేతగా ఉన్న హిడ్మా మృతి చెందడం ఉద్యమానికి తీరిని లోటుగా భావిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ దండకారుణ్యంలో మావోయిస్టు ఉద్యమం తిరిగి పుంజుకోవడం చాలా కష్టం. మావోయిస్టుగా ఆయన పోరాట తీరుతో ఉద్యమాన్ని ముందుకు నడిపిన హిడ్మా మృతి సంచలనం సృష్టించింది.

## తెలుగు గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 'నైస్' కృషి




ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాలకు చెందిన గల్ఫ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి 'నైస్' యాప్ కృషిచేస్తుందని నైస్ అడ్వయిజరీ కమిటీ తెలంగాణ ఛైర్మన్ రిటైర్డ్ ఐఎఫ్ఎస్ ఎన్.రాజేందర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డి తెలిపారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ సభ్యులు ఎన్.రంగయ్య, మచ్చ శ్రీనివాస్ రియాద్‌తో కలిసి నైస్ వెబ్‌సైట్‌ను వారు ఆవిష్కరించి, మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన 35లక్షల మందికిపైగా గల్ఫ్‌దేశాల్లో ఉపాధి, ఉద్యోగం పొందుతున్నారని తెలిపారు. వీరి ఆరోగ్యం, వృత్తిరీత్యా, నైపుణ్యాభివృద్ధికి సంబంధించిన అన్ని సమస్యలకు నైస్ ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. తమ టోల్ ఫ్రీ నంబర్ 1800113090 సంప్రదించాలని సూచించారు.

## ప్రతి మహిళా సంఘానికీ ఒక్కో బస్సు

కోటి మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యం

మహిళలకు ఉచిత ప్రయాణం నుంచి బస్సు ఓనర్‌షిప్

'ఇది మా బస్సు' మహిళల్లో ఆత్మగౌరవం నింపే దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ కొలువు తీరిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలకు శ్రీకారం చుట్టింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సహాయం పరిమితి పెంపు ఒకటి కాగా, రెండవది మహిళలకు మహాలక్ష్మి (ఉచిత బస్సు ప్రయాణం)పథకం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో మహిళల భాగస్వామ్యం పెంచడానికి అనేక కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా పలు పథకాలను అమలు చేస్తున్నది. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరురాలను చేయాలనే సంకల్పంతో స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలను అందిస్తోంది. క్రమశిక్షణకు, నమ్మకానికి ప్రతీకలుగా నిలిచిన మహిళా సంఘాలకు ఒకపక్క రుణాలను అందిస్తూ వారి ఆర్థిక స్వావలంబన కోసం పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ యూనిట్ల ఏర్పాటుతోపాటు మండల మహిళా సమాఖ్యల ఆదాయం పెంపు కోసం ఎస్ఇఆర్‌పి ద్వారా దేశంలోనే మొదటి సారిగా 600 బస్సులు కొనుగోలు చేసి టిజిఎస్ఆర్‌టిసికి అద్దెకి ఇచ్చేలా పథకాన్ని రూపొందించింది. మహిళా సంఘాలు తీసుకునే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీని అందిస్తుంది. ఈ పథకం అమలుకు టిజిఎస్ఆర్‌టిసి, సెర్ప్ (ఎస్ఇఆర్‌పి)ల మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజా రవాణాలో స్వయం సహాయక సంఘాలు కీలకపాత్ర పోషించడంలో ముందడుగు పడింది. మొదటి దశలో సెర్ప్ ఐడెంటిఫై చేసిన 17 జిల్లాలలోని 151 మండల మహిళా సమాఖ్యలను ఒక్కొక్కటి చొప్పున 151 బస్సులు కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించింది. రెండవ దశలో 449 బస్సులను కొనుగోలు చేస్తారు. ఒక్కొక్క బస్సుకు రూ. 36 లక్షల వ్యయం కాగా, అందులో రూ.6లక్షలను మండల మహిళా సమాఖ్య తన సొంత నిధులను ఖర్చు చేస్తుంది. మిగతా రూ.30 లక్షలను కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌గా అందించారు. టిజిఎస్ఆర్‌టిసి ప్రతి బస్సుకు నెలకు రూ.69,648 అద్దెని చెల్లిస్తుంది. ఇందులో రూ.19,648 ఆపరేషన్ ఎక్స్‌పెండీచర్‌గా ఖర్చు చేసుకొంటున్నారు. మిగతా రూ.50 వేలను రుణ వాయిదాగా చెల్లిస్తుంది. ఇప్పటివరకు టిజిఎస్ఆర్‌టిసి అయిదు వాయిదాలు విడుదల చేసింది. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ పథకంతో మహిళా సంఘాలు లాభాలు గడిస్తున్నాయి. టిజిఎస్ఆర్‌టిసి ఇప్పటివరకు 151 మహిళా సమాఖ్యలకు అయిదు కోట్లకు పైగా నిధులను విడుదల చేసింది. మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. టిజిఎస్ఆర్‌టిసికి మహిళా సంఘాలు బస్సులను అద్దెకిచ్చే పథకంతో గ్రామీణ ప్రాంతాలకు మరిన్ని బస్సులు అందుబాటులోకి వచ్చాయి. గతంలో ప్రైవేటు వ్యక్తుల బస్సులను ఆర్‌టిసి అద్దెకు తీసుకొని నిర్వహించేది. నేడు మహిళా సంఘాలు ఆర్‌టిసికి అద్దె బస్సులను అందజేస్తున్నాయి. ఈ పథకం మహిళా సాధికారతకు, సామాజిక భద్రతకు అండగా నిలుస్తుంది. వారికి స్థిరమైన ఆదాయాన్ని అందిస్తుంది. ప్రజా ప్రభుత్వ అమలు చేస్తున్న వినూత్న పథకాలతో రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం అవుతున్నారు. వివిధ రంగాలలో రాణించి తమ ప్రతిభను చాటుకుంటున్నారు. ప్రభుత్వం అందించిన సహకారంతో ముందడుగు వేస్తున్నారు.

**పి.పద్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు (ములుగు జిల్లా)..**

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడమే కాకుండా ఆ బస్సులకు ఓనర్లను చేయడం చాలా సంతోషకరమైన విషయం. బస్సుల పైన ఇందిరా మహిళా శక్తి మండల సమైక్య పేరు చూసినప్పుడల్లా అది మా బస్సు, ఆ బస్సుకు మేము ఓనర్లము అనే భావన మాకు చాలా గౌరవంగా అనిపిస్తుంది. దీనికిగాను మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మండల సమైక్య మహిళలందరి తరపున కృతజ్ఞతలు.


**నగరపాలక సంస్థ కొత్తగూడెం కార్యాలయము**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా.

బహిరంగ వేలంపాట — తేదీ: 18.11.2025

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ! కొత్తగూడెం నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తగూడెం/ పాల్వంచ/ సుజాతనగర్ ప్రాంతములలోని చికెన్ /చాపల దుకాణముల నుండి వెలువడే వ్యర్థాలను తేది: 24-11-2025 నుండి తేది.31-03-2026 వరకు సేకరించి రవాణా చేయుటకు ఆసక్తి గల ఎజెన్సీలు పాల్గొనుటకు అనుభవము కలిగిన ఎజెన్సీల నుండి ఈ క్రింద తెలిపిన షరతులతో కొత్తగూడెం నగరపాలక సంస్థ కార్యాలయము నందు **తేది: 22-11-2025 (శనివారము)** నాడు సాయంత్రం గం.04:00కు "**బహిరంగ వేలంపాట**" నిర్వహించబడును.

షరతులు:
1. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ధ్రువీకరణ పత్రము.
2. చికెన్/చాపల నుండి వెలువడే వ్యర్థాలను ఎందు నిమిత్తం వినియోగిస్తారు. ధృవీకరణ పత్రాలు సమర్పించవలెను.
3. అనుమతించబడిన లేక అధీకృత ఎజెన్సీలు మాత్రమే అర్హులు.
4. వాహనము ఖాళీ భరువు మరియు వ్యర్థాలు వేసుకొన్న తరువాత బరువు, వారమునకు ఒక పర్యాయం రిపోర్టులు సమర్పించుట.
5. వ్యర్థాలు స్వీకరించిన వివరములు ప్రతి వారం నివేదిక కార్యాలయములో సమర్పించుట.
6. రూ.10,000/- లు తిరిగి చెల్లించబడని రుసుము, శ్రీయుత కమిషనర్, కొత్తగూడెం నగరపాలక సంస్థ వారి పేరున తీయబడిన డిమాండ్ డ్రాఫ్ట్ (డి.డి) జతపరచవలెను.
7. ప్రకటనకు సంభందించిన ఎలాంటి తదుపరి నిర్ణయమైన ఈ క్రింద సంతకం దారునికి అధికారము కలదు.

సం/- కమిషనర్
కొత్తగూడెం నగరపాలక సంస్థ.
DIPR R.O. No. : 10870-PP/CL/ADVT/1/2025-26, Date: 18-11-2025

**నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
కార్పొరేట్ గుర్తింపు సంఖ్య: U40109TG2000SGC034119

Open Tender Notice No.04/25-26 of CE /P & MM/SE/Civil/NPDCL/WGL/D.No. /25-26. తేదీ: .11.2025.

పని పేరు : CE/P&MM/NPDCL/ SE/ Civil. యొక్క స్పెసిఫికేషన్ నెం.21 నుండి 32/2025-26 వరకు ఉన్న పూర్వపు వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నిర్మల్ మరియు మంచిర్యాల సర్కిల్‌లకు 8.50M/200KG మరియు 9.50 M/400 Kg PSCC స్తంభాల తయారీ మరియు సరఫరా. వివరణాత్మక టెండర్ నోటీసుకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం దయచేసి www.tgnpdcl.in. మరియు www.tender, telangana.gov.in. వెబ్‌సైట్లను సందర్శించగలరు.
సం/- చీఫ్ ఇంజనీర్ /P&MM TGNPDCL/Warangal.

TENDER NOTICE No. 14/2025-26 OF సూపరింటెండింగ్ ఇంజనీర్ / ఆపరేషన్ / ఖమ్మం విత్ స్పెసిఫికేషన్ నెం.51 /25-26

ఖమ్మం సర్కిల్ సత్తుపల్లి డివిజన్‌లోని సత్తుపల్లి సబ్ డివిజన్ యొక్క సత్తుపల్లి టౌన్ సెక్షన్ (D-2301-01-02-01-01-023)లోని రైల్వే ట్రాక్ మీదుగా OHT లైన్లు వెళుతున్నందున, కిష్టారం మరియు లంకపల్లి గ్రామాలలోని రైల్వే లైన్ మీదుగా వెళుతున్న 33KV SCCL & 33 KV లంకపల్లి లైన్‌లను లంకపల్లి వంతెన వద్ద UG కేబుల్‌తో భర్తీ చేయడానికి మరియు కిష్టారం గ్రామంలో లంకపల్లి 33KV ఫీడర్‌ను మళ్లించడానికి అంచనా ప్రతిపాదన కోసం TG NPDCL రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. పనుల వివరాలు మరియు ఇతర సమాచారాన్ని మా వెబ్‌సైట్ www.tgnpdcl.in నుండి పొందగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆపరేషన్ సర్కిల్, ఖమ్మం.

DE/OPN/KOTHAGUDEM యొక్క టెండర్ నోటీస్ నెం. 12/25-26 విత్ స్పెసిఫికేషన్ నెం. 31, 32, 33, 34 & 35 / 2025-26.

కొత్తగూడెం డివిజన్‌లోని గుండాల ఎ.ఆర్.పల్లి & చంద్రుగొండ సెక్షన్లలో వివిధ పనులకు ఏజెన్సీ ఫిక్సింగ్ కోసం భద్రాద్రి కొత్తగూడెం సర్కిల్‌కు చెందిన TGNPDCL రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి. టెండర్ వివరాలను మా వెబ్‌సైట్ www.tgnpdcl.com నుండి పొందగలరు.
సం/- డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్ : : TGNPDCL, కొత్తగూడెం.
DIPR R.O. No. : 10856-PP/CL/ADVT/1/2025-26, Date: 18-11-2025




# జనరల్
STATE & REGIONAL NEWS

## రేపటి నుంచి 25వ తేదీ వరకు యుఐటిబిబిబి కాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** యూనియన్ ఇంటర్‌నేషనల్ ఆఫ్ వర్కర్స్ ఇన్ ది బిల్డింగ్ వుడ్ బిల్డింగ్ మెటీరియల్స్ అండ్ ఇండస్ట్రీస్ (యుఐటిబిబిబి) కాన్ఫరెన్స్‌ను ఈనెల 20 తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్నట్లు ఆల్ ఇండియా కాన్‌ఫెడరేషన్ ఆఫ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ జాతీయ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్ తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాల ప్రతినిధులు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొంటారని, భారతదేశం నుంచి తనతో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి విజయం కునుసురి, జాతీయ కోశాధికారి ఎన్.సెల్వరాజ్ హాజరుకానున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ దేశాల్లో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆయా దేశాల్లో అమలవుతున్న చట్టాలు, సంక్షేమ పథకాల అమలు, ఆయా దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న చట్టాలు, సంక్షేమ పథకాలు, సామాజిక భద్రత వంటి అనేక అంశాలపై ఇంటర్‌నేషనల్ కాన్ఫరెన్స్‌లో చర్చించనున్నట్లు ప్రవీణ్ కుమార్ గౌడ్ తెలిపారు.

## ముగిసిన 'పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్-2025' పోటీలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 25వ జాతీయ 'పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ 2025' పోటీల ముగింపు వేడుకలు మంగళవారం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో పారా క్రీడల అభివృద్ధి వైపు జరుగుతున్న పురోగతికి ఈ ఛాంపియన్‌షిప్ ఒక బలమైన నిదర్శనంగా నిలిచిందని అన్నారు. దేశవ్యాప్తంగా నుండి వచ్చిన పారా క్రీడాకారులు చూపిన అసాధారణ ప్రతిభ, క్రీడాస్ఫూర్తి మరియు అంకితభావం ఈ కార్యక్రమాన్ని విశేషంగా నిలబెట్టాయని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు ప్రాతినిధ్యం వహించిన వ్యక్తిగత విజేత శ్రీనికేష్ కిరణ్ కశట్వార్‌ను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో పారా సిమ్మింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (పిఎస్ఎటి) అధ్యక్షురాలు అలివెలు మంగమ్మ, చైర్మన్ డా. పి. చంద్రశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ సమంత రెడ్డి పాల్గొన్నారు. పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పిసిఐ) ఛైర్మన్ డా.వి.కే. దబాస్, కోశాదికారి సునీల్ ప్రధాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం' దరఖాస్తుల ఆహ్వానం



సింగరేణి సిఎండి ఎన్.బలరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన తెలంగాణ ప్రాంత అభ్యర్థులకు సింగరేణి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకంలో భాగంగా సివిల్స్ ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష ప్రోత్సాహకం కో సం అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి సిఎండి ఎన్.బలరామ్ తెలిపారు. సంబంధిత అభ్యర్థులు తమ దరఖాస్తుతో పాటు పూర్తి వివరాలను ఈ నెల 21వ తేదీ లోపు హైదరాబాద్ సింగరేణి భవన్‌లో అందజేయాలని పేర్కొన్నారు. గత ఏడాది ప్రారంభించిన రాజీవ్ గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం ద్వారా మొదటగా మెయిన్స్ కు ఎంపికైన 140 మందికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందజేయగా, వారిలో 20 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్వ్యూలకు ఎంపికైన 20 మందికి మరో విడతగా రూ.లక్ష చొ ప్పున సాయం అందించగా వారిలో ఎడుగురు విజేతలుగా నిలిచారన్నారు. ఈ పథకంలో భాగంగా గతంలో మెయిన్స్‌కు ఎంపికై ఇప్పటికే లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందుకున్న వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోనవసరం లే దని, తెలంగాణకు చెందిన ఇతర అభ్యర్థులు ఎవరైనా ఇంటర్వ్యూలకు ఎం పికైతే వారికి కూడా ఈ ప్రోత్సాహకాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రిలిమ్స్ పాసైన 202 మందికి ఆర్థిక చేయూత అందించగా 43 మంది ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారని సిఎండి ఎన్.బలరామ్ వెల్లడించారు.

## వెంటనే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగిసి 21 నెలలు దాటుతున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడంతో రూ. 4,000 కోట్ల మేర 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాజ్యాంగంలోని 73, 74వ సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు తప్పనిసరిగా పాలకవర్గాలు ఉండాలన్నారు. పాలకవర్గాలు ఉండి, సమావేశాలు నిర్వహిస్తేనే కేంద్రం నుండి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయని తెలిపారు. బిసి రిజర్వేషన్‌లపై కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో 'కామారెడ్డి బిసి డిక్లరేషన్' పేరుతో స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చాక ఆ దిశగా ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు కేబినెట్ నిర్ణయం పేరుతో, రిజర్వేషన్‌లను చట్టబద్ధం చేయకుండా కేవలం పార్టీ స్థాయిలోనే ఇస్తామనడం బిసిలను మోసం చేయడమేనని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు బిజెపి పెద్ద పీట వేస్తుందన్నారు. తమ పార్టీ తరఫున పోటీ చేసే కార్యకర్తలు, నాయకులకు పార్టీ పరంగానే రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కొందరి మాటలు నమ్మి ప్రాణాలు కోల్పోవద్దని, తక్షణమే ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు ఆయన సూచించారు.

## 'జల్ సంచయ్ జన్ భాగీదారీ' విభాగంలో తెలంగాణ టాప్

6వ జాతీయ జల అవార్డుల్లో 'తెలంగాణకు అవార్డుల పంట'

పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం టాప్‌లో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు2024 లో తెలంగాణ జాతీయ స్థాయిలో తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద తెలంగాణ మొత్తం 5,20,362 పనులు పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కా ర్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రా ష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ1 కింద ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. జిహెచ్‌ఎంసి ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. ఈ విభాగంలో కేటగిరీ 2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి బహుమతి గెలుచుకున్నాయి. కెటగిరీ3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1,3 ర్యాంకుల్లో నిలిచాయి.

## మహిళలకు కోటి చీరలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం 'ఇందిరమ్మ చీరల' పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న ట్టు వెల్లడించారు. డిసెంబరు 9వ తేదీ తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ చేస్తామన్నారు. రెండవ దశలో మార్చి 1నుంచి మార్చి 8న అంతర్జాతీయ మ హిళా దినోత్సవం వరకు పట్టణ ప్రాంతాల్లో మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి 'ఇందిరమ్మ చీరలకు' సంబంధించి మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ అనసూయ సీతక్కతో కలిసి మంగళవారం సమీక్షా సమావే శం నిర్వహించారు. హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్ లో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభించనున్నారు. మ న్నారు. అనంతరం సచివాలయంలో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలతో సిఎం ముఖాముఖి కానున్నారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని, చీరల ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. చీరల నా ణ్యత విషయంలో రాజీపడకుండా పారదర్శకంగా పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో డిసెంబరు 9 వరకు , రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. సాంకేతిక ను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారుల ను ఆదేశించారు. సిఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హ్యాండ్లూమ్స్ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌తో పాటు ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్, సెర్ప్ సిఇఒ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి భాగస్వామ్యంలో మెట్రో రైల్

కేంద్ర మంత్రి మనోహరల్ లాల్ ఖట్టర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే రోజుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మెట్రో రైల్ నడుపుతామని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ వెల్లడించారు. దేశంలోని నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ మీడియాతో మాట్లాడుతూ కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు తెలంగాణ ప్రభుత్వం, ఎల్ అండ్ టి సంస్థ సంయుక్తంగా నడుపుతున్న హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టును, రాబోయే రోజుల్లో భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా 50:50 ఉమ్మ డి భాగస్వామ్యం (జెవి) నమూనాలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో నిర్వహిస్తాయని ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో సుమారు 162 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాల కోసం ప్రతిపాదనలు ఉన్నాయని ఖట్టర్ చెప్పారు. అన్ని అవకాశాలను పరిశీలించిన తర్వాత, ఎక్క డ ఎంతవరకు మెట్రో ప్రాజెక్టును ఆమోదించాలి, ఎక్కడ సాధ్యమవుతుంది అనే దానిపై మార్చి నా టికి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా, కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి కలిసి తెలంగాణ రాష్ట్ర పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు చెందిన వివిధ విభాగాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. హెచ్‌ఎంఆర్‌ఎల్, హెచ్‌ఎండిఎ, ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద ఆ రెండు సంస్థలు చేపట్టిన వివిధ ప్రాజెక్టుల తాజా స్థితి గురించి వారికి వివరించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎండిఎ కమిషనర్, హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎం.డి. సర్ఫరాజ్ అహ్మద్ కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు వివిధ ప్రాజెక్టుల పురోగతి, కేంద్ర ప్రభుత్వంతో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల గురించి వివరించారు. హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశకు ఫాస్ట్ ట్రాక్ మంజూరు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

## దేశ ప్రగతికి, పేద ప్రజల సంక్షేమానికి.. ఇందిరా గాంధీ విప్లవాత్మక నిర్ణయాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ ప్రగతి, పేదల అభ్యున్నతి కోసం తన ప్రాణాలు అర్పించిన మహనీయురాలు ఇందిరా గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమెను ముఖ్యమంత్రి స్మరించుకున్నారు. తన ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినప్పటికీ దేశ సమగ్రత, సమైక్యత, పటిష్టత కోసం కఠిన నిర్ణయాలు తీసుకొని ఆమె ముందుకు సాగారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయీకరణ, 20 సూత్రాల కార్యక్రమం, అణు శక్తి అభివృద్ధి, గ్రీన్ రివల్యూషన్, మహిళా సాధికారత, భూ సంస్కరణలు వంటి ఎన్నో విప్లవాత్మక నిర్ణయాలతో దేశ ప్రగతికి, పేదల అభ్యున్నతికి ఇందిరా గాంధీ ఎంతగానో కృషి చేశారని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ పాలనను ఆదర్శంగా తీసుకుని, ఆ మహనీయురాలి స్ఫూర్తితోనే పేదల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ పేరిట అనేక సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని సిఎం చెప్పారు.

## సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాలి :చిన్నారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుత శాస్త్ర సాంకేతిక ఆధునిక కాలంలోనూ దళితులు, గిరిజనులు, మహిళల పట్ల వివక్షత కొనసాగడం బాధాకరమని, సాంఘిక దురాచారాలపై సంఘటితంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉన్నదని సిఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో 'సిఎం ప్రజావాణి, దళిత స్త్రీ శక్తి సంస్థ' సంయుక్తంగా నిర్వహించిన లీగల్ క్లినిక్ ప్రత్యేక కార్యక్రమంలో చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి వర్గాలు, మహిళల పట్ల జరుగుతున్న వివక్షత, అత్యాచారాలకు గురైన మహిళల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తానని, పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అనంతరం సిఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ఎస్‌సి,ఎస్‌టి వర్గాలు, మహిళల పట్ల జరిగిన దాడులు, అన్యాయాలను మానవతా దృక్పథంతో పరిష్కరించి, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు చేపడుతామన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా 55 మంది బాధితులు వచ్చి తమ సమస్యలు చెప్పి పునరావాసం కల్పించాలని, పరిహారం ఇప్పించాలని, నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సమావేశంలో కోరారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఎన్‌ఆర్‌ఐ అడ్వైజర్ కమిటీ చైర్మన్ అంబాసిడర్ వినోద్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ క్షితిజ, గిరిజన సంక్షేమ శాఖ అడిషనల్ కమిషనర్ సర్వేశ్వర్ రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల అదనపు కలెక్టర్లు చంద్రారెడ్డి, విజయేందర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సత్యనారాయణ, మూడు పోలీస్ కమిషనరేట్స్ నుంచి సీనియర్ పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పథకం ప్రకారమే మహిళా జర్నలిస్టులపై అసభ్యకర పోస్టులు

మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన ప్రతినిధి బృందం

కఠిన చర్యలు తప్పవు : మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదా హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మహిళా జర్నలిస్టులపై సోషల్ మీడియాలో జరుగుతున్న బెదిరింపులు, అసభ్యకర పోస్టులు, దుర్భాషలను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదా తీవ్రంగా పరిగణించారు. వీటిపై చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని ఆమె హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ నేతృత్వంలో మంగళవారం మహిళా జర్నలిస్టుల ప్రతినిధి బృందం కమిషన్ చైర్‌పర్సన్‌ను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. 'మహిళా జర్నలిస్టులపై నిరంతర ట్రోలింగ్, వేధింపులు, బెదిరింపులు, అసభ్య దాడులు జరుగుతున్నాయి. పలు సోషల్ మీడియా హ్యాండిల్స్ ఉద్దేశపూర్వకంగా అసభ్యకరమైన వ్యాఖ్యలు, ప్రాణహానికర బెదిరింపులు, అవహేళనాత్మక పోస్టులు, వీడియోలు షేర్ చేస్తున్నాయి. తమపై 'క్రమబద్ధమైన ఆన్‌లైన్ వేధింపుల ధోరణి' కొనసాగుతోందని వారు చైర్‌పర్సన్‌కు వివరించారు. 'ఈ ట్రోలింగ్ భయం కలిగించడం, తమ వృత్తిపరమైన పనిని అడ్డుకోవడమే లక్ష్యంగా కనిపిస్తోంది. కొన్ని హ్యాండిల్స్ విద్వేషపూరిత, మతపరమైన ఉద్రిక్తత కలిగించే కంటెంట్‌ను కూడా విస్తృతంగా పోస్ట్ చేస్తున్నాయి' అని మహిళా జర్నలిస్టులు తెలిపా రు. జర్నలిస్టుల ప్రతినిధి బృందం ట్రోలింగ్ స్వరూపాన్ని చూపించే అనేక వీడియోలను చైర్‌పర్సన్‌కు ప్లే చేసి చూపించారు. ప్రతినిధి బృందం సంబంధిత హ్యాండి ల్స్, వ్యక్తులపై దర్యాప్తు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆన్‌లైన్, భౌతిక రక్షణ కల్పించాలని కోరింది. ఈ వేధింపులు మీడియా స్వేచ్ఛపై దాడి మాత్రమే కాకుండా, మహిళా జర్నలిస్టుల గౌరవాన్ని దెబ్బతీస్తున్నాయని వారు అన్నారు. ఫిర్యాదు స్వీకరించిన అనంతరం చైర్‌పర్సన్ నేరెళ్ల శారదా, మహిళా జర్నలిస్టులపై జరుగుతున్న ఈ అసభ్యకరమైన దాడులను తీవ్రంగా పరిగణిస్తున్నామని, నిందితులపై కఠిన చర్యలు తప్పవని వారికి హామీ ఇచ్చారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ.. లక్ష్యాలకు దగ్గరగా ఉండాలి



మత్తు రహిత తెలంగాణ కోసం సిఎం రేవంత్ రెడ్డి కృషి

నషాముక్త్ భారత్ అభియాన్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** డ్రగ్స్‌కు దూరంగా.. కెరీర్, విజయాలకు దగ్గరగా అనే నినాదాన్ని ప్రతి విద్యార్థి జీవన సూత్రంగా తీసుకోవాలని రాష్ట్ర దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. గాంధీ మెడికల్ కళాశాలలోని స్వామి వివేకానంద ఆడిటోరియంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర దివ్యాంగులు వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధకారిత శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నషాముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువు, ఉద్యోగ అవకాశాలు, వ్యక్తిత్వ వికాసంలో నిలబెట్టడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని అన్నారు. 'డ్రగ్స్‌కు దూరం జీవిత లక్ష్యాలకు దగ్గర'గా అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి, యువకుడి వద్దకు చేరేలా సమగ్రమైన అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో డ్రగ్ సరఫరా మార్గాలను పూర్తిగా నిర్మిలించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈగల్ స్పెషల్ యూనిట్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. మత్తు వ్యసనం వ్యక్తిగత అలవాటు కాదు..ఇది కుటుంబాలను కూల్చివేసే ఒక అగ్నికీల అని మంత్రి పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి వర్గం భాగస్వామ్యం అవసరమని అన్నారు. ఇప్పటి వరకు 15,891 విద్యాసంస్థల్లో 7,018 కార్యక్రమాల ద్వారా 1.45 కోట్ల మందికి అవగాహన కల్పించామని, ఇది దేశంలోనే అతిపెద్ద డ్రగ్స్ అవగాహన కార్యక్రమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాకారులు ప్రదర్శించిన నాటక ప్రదర్శన, ఆటలు, పాటలు యువతలో మత్తు వ్యసనంపై అవగాహన కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉమెన్ అండ్ చైల్డ్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శి అనితా రామచంద్రన్, టీజీ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి, సీనియర్ సిటిజన్ అండ్ ట్రాన్స్‌జెండర్ విభాగం డైరెక్టర్ శైలజ, హైదరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్, గాంధీ హాస్పిటల్ సూపరిండెంటెంట్ డాక్టర్ వాణి, గాంధీ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఇందిరా, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సీతారాం, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సరుకుల నాణ్యతపై.. జాప్యాన్ని సహించం..

ఇదే చివరి అవకాశం : మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అంగన్వాడి సరుకుల సరఫరాలో జరుగుతున్న జాప్యం పై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క కఠినంగా తప్పుబట్టారు. మాకు కారణాలు చెప్పకండి. అంగన్వాడి చిన్నారుల కోసం కోడి గుడ్లు పది రోజులకు ఒకసారి తప్పనిసరిగా సరఫరా కావాలి. సాకులు చెప్పి జాప్యం చేస్తే కాంట్రాక్టులు రద్దు చేస్తాం అని సీతక్క హెచ్చరించారు. వెంకలరావు నగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనరేట్‌లో అంగన్వాడి కేంద్రాలకు సరఫరా అవుతున్న కోడిగుడ్లు, పప్పు, మంచి నూనె, పాలు, ఇతర అవసరమైన సరుకులపై సీతక్క జిల్లాల వారీగా మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారులు, సరఫరాదారులు, మిల్క్ సప్లయర్లు పాల్గొన్నారు. కోడి గుడ్లు, సరుకుల సరఫరా పరిస్థితులు, జాప్యాలు, నాణ్యత సమస్యలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. చిన్నారుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన, నిర్దిష్ట సైజు గుడ్లను సరఫరా చేయడం తప్పనిసరి అని కూడా అన్నారు. చిన్న గుడ్లు, నాసిరకం గుడ్ల సరఫరా మహా పాపం, అని మంత్రి స్పష్టం చేశారు.

### నాణ్యమైన ఫుడ్ సప్లై ప్రభుత్వ లక్ష్యం

మారుతున్న వాతావరణంలో గుడ్లు త్వరగా పాడవుతుండటంతో పది రోజులకు ఒకసారి సప్లై వ్యవస్థ తప్పనిసరి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంగన్వాడి సిబ్బంది గుడ్ల నిల్వపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లల బరువు, ఎత్తు పెరగడానికి నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. సరుకుల నాణ్యతలో లోపాలు కనిపిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు. సమావేశంలో గుడ్ల సప్లై దారులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. సంక్షేమ హాస్టల్స్‌తో కలిపి సరఫరా చేయడం వల్ల సమన్వయం కుదరక ఇబ్బందులు వస్తున్నాయని, కొన్ని సందర్భాల్లో అంగన్వాడి కేంద్రాలకు కేటాయించిన గుడ్లను హాస్టల్ నిర్వాహకులు ఒత్తిడి చేసి తీసుకుంటున్నారని వివరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపిస్తానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

## జలమండలిలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జలమండలిలో 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా మాదకద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బోర్డు ఉన్నతాధికారులు, సిబ్బంది విస్తృతంగా పాల్గొన్నారు. పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ ఉద్యోగులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం వ్యక్తి సామాజిక, మానసిక, శారీరక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని తెలిపారు. యువతను మత్తు పదార్థాల ప్రమాదాల నుంచి దూరంగా ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ను ప్రారంభించిందని చెప్పారు. ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia దక్షిణమధ్య రైల్వే

టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/1454

**నోటీసు నెం. సి/సి/565/ఎటివిఎం/2025, తేదీ : 17.11.2025**

భారత రాష్ట్రపతి తరపున దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్, ఈ క్రింద పేర్కొన్న 19(పంతొమ్మిది) ప్రాంతాలలో రెండు సంవత్సరాల కాలానికిగాను **ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ (ఎటివిఎం) ఏర్పాటు చేయడానికి సీల్డ్ దరఖాస్తులకు ఆహ్వానం.** రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు మరియు సాధారణ ప్రజలకోసం ఉద్దేశించిన నిర్దేశిత దరఖాస్తు - 2 & అనుబంధ పత్రం - 3లో వరుసగా జతపరచడమైనది. **ఉద్యోగ విరమణ చేసిన రైల్వే ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును.**
ఆసక్తిగల రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు / సాధారణ ప్రజలు తమ తమ సీల్డు దరఖాస్తులను వారి నిర్దేశిత కేటగిరీల మేరకు ఈ క్రింద పేర్కొన్న షెడ్యూల్డు పట్టిక ప్రకారం సమర్పించవలెను.

| కేటగిరీలు | ప్రదేశాలు (19) | సమర్పణ / ప్రారంభ తేది |
|---|---|---|
| NSG-1, 2 & 3 | SC, HYB, CHZ, LPI, BMT, KMT (6) | 11-12-2025 (గురువారం) |
| ఇతర కేటగిరీలు | MABD, RDM, SKZR, DKJ, KDM, MDR, JMKT, CT, HTCY, CDNR, BTNR, HFZ, BRBD (13) | 12-12-2025 (శుక్రవారం) |

**గమనిక : దరఖాస్తులను ఎంపిక చేసిన తేదీలలో మాత్రమే ఆయా రైల్వే స్టేషన్లలో సమర్పించవలెను. ఎంపిక చేసిన తేదీలకంటే ముందుగానో, ఆ తర్వాత తేదీలలోనో/ఎంపిక చేసిన ప్రాంతాలలో సమర్పించే దరఖాస్తులు వెంటనే తిరస్కరించబడును.**

ఒకవేళ దరఖాస్తులు సమర్పించే చివరితేదీ ప్రభుత్వ సెలవుదినముగా పరిగణింపబడినచో, టెండర్లు ఆ మరునాడు పనిదినమున తెరవబడును. ఇతర వివరములకు, ఈ క్రింద పేర్కొన్న కార్యాలయంలో పని దినములలో ఏరోజైనా సంప్రదించవచ్చును.
దరఖాస్తులు, అర్హత వర్గముతోపాటు ప్రదేశం వారీగా ఉన్న **ఎటివిఎం నెంబరు వివరాలతో మరియు ఈ నిర్దేశిత పనులు పూర్తిచేయడానికి మార్గదర్శకత్వం** చేయడానికి ఉద్దేశించిన సభ్యుల నుండి ఖాళీల వివరాలు తెలుసుకోవడానికి మరియు ఇతర వివరాలకోసం మీరు మా వెబ్‌సైటు **www.scr.indianrailways.gov.in**ను డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా పొందగలరు.
దరఖాస్తులను నిర్దేశిత తేదీలలో ఆనాటి **మధ్యాహ్నం 3.00 గంటల లోపు** సమర్పించవలెను. సికింద్రాబాద్ (అనురాగ్ క్రెచ్ పక్కన) హైదరాబాద్ డివిజన్ కాంపౌండ్‌లో ఉన్న టెండరు హాలులో పెట్టిన సీల్డు బాక్సులో టెండర్లు వేయగలరు. నిర్దేశిత తేదీనాడు టెండర్ల సమయం మధ్యాహ్నం 3.00 గంటలు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులు అంగీకరించబడవు లేదా పరిశీలించబడవు. దరఖాస్తులు **అదే రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు** తెరచి చూడబడును.

A1849 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్.

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఢిల్లీ స్కూళ్లు, కోర్టులకు బాంబు బెదిరింపు : అధికారులు హై అలర్ట్

**న్యూఢిల్లీ :** ఢిల్లీ పేలుడు ఘటన తర్వాత మరోసారి బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపాయి. కోర్టులు, విద్యాసంస్థలే లక్ష్యంగా కొందరు ఇ-మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. వాటిలో రెండు సిఆర్‌పిఎఫ్ స్కూల్స్ ఉన్నాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు తనిఖీలు చేపట్టారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో బాంబు బెదిరింపుల మెసేజ్‌లు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. తీస్ హజారీ, సాకేత్ కోర్టులు లక్ష్యంగా ఢిల్లీ పోలీసులకు మెయిల్స్ వచ్చినట్లు చెప్పారు. అంతేకాకుండా ద్వారక, ప్రశాంత్ విహార్‌లోని రెండు సిఆర్‌పిఎఫ్ పాఠశాలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయన్నారు. అది కూడా జైషే మహ్మద్ పేరుతో వచ్చినట్లు పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ముమ్మర సోదాలు నిర్వహిస్తున్నారు. కోర్టు ప్రాంగణాలతో పాటు సిఆర్‌పిఎఫ్ పాఠశాలనను ఖాళీ చేయించారు. బాంబ్, డాగ్ స్క్వాడతో తనిఖీలు చేపట్టారు. ద్వారక, సాకేత్, పాటియాలా హౌస్ రోహిణి కోర్టుల్లో కూడా తనిఖీలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఎలాంటి అనుమనాస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు.

- రూ.2 లక్షల హామీ ఇవ్వకపోతే జెడియు 25 సీట్లకే పరిమితమయ్యేది..
- 1.5 కోట మంది మహిళలకు ఈ హామీ నెరవేరిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా : ప్రశాంత్ కిషోర్

## మహిళలకు నగదు బదిలీ వల్లే బిహార్‌లో ఎన్‌డిఎ విజయం




**పాట్నా :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై జన సూరజ్ పార్టీ నేత ప్రశాంత్ కిషోర్ తొలిసారి స్పందించారు. నితీశ్ కుమార్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. మహిళలకు నగదు బదిలీ పథకం వల్లే జెడియు మరిన్ని సీట్లు సాధించిందన్నారు. బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతి నియోజకవర్గంలోని 60,000 మందికి పైగా లబ్ధిదారులకు రూ.10,000 చొప్పున ఇవ్వకపోతే, స్వయం ఉపాధి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1.5 కోట్ల మంది మహిళలకు రూ. 2లక్షలు ఇస్తామని హామీ ఇవ్వకపోతే కేవలం 25 సీట్లకే పరిమితం అయ్యేదని పేర్కొన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం రూ. 40,000 కోట్ల ప్రజల డబ్బును వాగ్దానం చేసి, అందులో పెద్ద మొత్తంలో ఎన్నికలకు ముందు విడుదల చేసిందని ఆయన ఆరోపించారు. మంగళవారం ప్రశాంత్ కిషోర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకోవడానికి తమ పార్టీ నిజాయితీగా ప్రయత్నించిందని, కానీ ఎన్నికల్లో గుర్తింపును సాధించలేకపోయిందని, ఓటమికి పూర్తి బాధ్యత తనదేనన్నారు. తమ పార్టీ అభ్యర్థులు ఎవరూ అసెంబ్లీలో అడుగు పెట్టడం లేదని, ప్రజలే తమకు ముఖ్యమని, వారి మధ్యకు వెళ్లి ప్రజా సమస్యలపై పోరాడడమే లక్ష్యమని ఆయన తెలిపారు. రాజీనామా చేసే వరకూ ఓటమి అనేది లేదని ఓ ఆంగ్ల పదబంధాన్ని ఉటంకిస్తూ ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. తాము తప్పులు చేసి ఉండవచ్చు, కానీ విభజన రాజకీయాలు చేయడం, అమాయక ప్రజల ఓట్లను కొనుగోలు చేయడం అనే నేరం చేయలేదన్నారు. 'ఓటు చోరీ' (ఓట్ల దొంగతనం) అనేది భారతదేశవ్యాప్త సమస్య అని కిషోర్ ఆరోపించారు. ఈ విషయంపై చర్చలు జరపాలని, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని జాతీయ ప్రతిపక్ష పార్టీలను కోరారు. తమకు ఎన్నికల్లో ఎదురు దెబ్బ తగిలిందని, అయితే తప్పులు సరిదిద్దుకుంటామని, మరింత బలంగా తయారవుతామనిన్నారు. వెనక్కి తగ్గే అవకాశమే లేదని ఆయన స్పష్టం చేశారు. బిహార్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యారా అనే ప్రశ్నకు.... బదులిస్తూ 'అవును, నితీష్ కుమార్, బిజెపి నాయకుడు సామ్రాట్ చౌదరి, ఇతరుల మాదిరిగా ప్రజలను కుల, మత ప్రాతిపదికన విభజించి డబ్బు ఉపయోగించి ప్రజల ఓట్లను కొనుగోలు చేయడం వలే కాకుండా బిహార్‌ను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాను అని అన్నారు. కాగా, ఎన్‌డిఎ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చి, స్వయం ఉపాధి కార్యక్రమాల కింద 1.5 కోట్ల మంది మహిళలకు రూ.2 లక్షలు ఇస్తే తాను రాజకీయాలను కచ్చితంగా వదులుకుంటానని సవాల్ విసిరారు. జెడియు 25 కంటే ఎక్కువ సీట్లు సాధిస్తే రాజకీయాలను వదిలివేస్తానని ఎన్నికల ముందు చేసిన వాదనను జన్ సురాజ్ నాయకుడు ప్రస్తావించారు. నితీష్ కుమార్, ఆయన విజయం మధ్య ఒకే ఒక విషయం ఉందని, అదే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.10,000 చెల్లించి 60,000 ఓట్లను కొనుగోలు చేయడమేనన్నారు. ఇది ఓటు కొనుగోలా లేక స్వయం ఉపాధి కార్యక్రమంలో భాగమా అనేది స్పష్టం చేయాలని చురకలంటించారు. ప్రభుత్వం ఏర్పడినప్పుడు అవినీతిపరులు, నేరస్థులను ప్రభుత్వం నుండి దూరంగా ఉంచాలని ఆయన మోదీ, నితీశ్‌ను కోరారు.

## చిన్నారుల అదృశ్యంపై 'సుప్రీం' ఆందోళన



- నోడల్ ఆఫీసర్‌ను నియమించేందుకు 6 వారాల గడువు అడిగిన అదనపు సొలిసిటర్ జనరల్
- నిరాకరించిన 'సుప్రీం'
- డిసెంబరు 9 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** దేశంలో ప్రతీ 8 నిమిషాలకు ఒక చిన్నారి అదృశ్యం అవుతున్నట్లు వచ్చిన వార్తలపై మంగళవారం సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అత్యున్నత న్యాయస్థానం దీనిని తీవ్ర సమస్య'గా వ్యాఖ్యానించింది. దేశంలో దత్తత ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, యం త్రాంగాన్ని క్రమబద్ధీకరించాలని న్యాయమూర్తులు జస్టిస్ బి.వి.నాగరత్న, ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం కేంద్రాన్ని కోరింది. 'దేశంలో ప్రతీ 8 నిమిషాలకు ఒక చిన్నారి అదృశ్యం అవుతున్నారని నేను ఒక వార్తాపత్రికలో చదివాను. ఇది నిజమో కాదో నాకు తెలియదు' అని జస్టిస్ బి.వి.నాగరత్న మౌఖికంగా వ్యాఖ్యానించారు. దత్తత ప్రక్రియ కఠినంగా ఉండటం వల్ల దానిని ఉల్లంఘించడం ఖాయమని, పిల్లలను కనడానికి ప్రజలు చట్ట విరుద్ధమైన పద్ధతులను ఆశ్రయిస్తారని సుప్రీంకోర్టు చెప్పింది. విచారణ సందర్భం గా కేంద్రం తరపున విచారణకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి)ఐశ్వర్యా భాటి తప్పిపోయిన పిల్లల కేసులను పరిష్కరించేందుకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించడానికి ఆరువారాల సమయం కావాలని ధర్మాసనాన్ని ఎఎస్‌జి కోరారు.అయితే సుప్రీంకోర్టు ఆరు వారాల గడువును ఇవ్వడానికి నిరాకరించింది. డిసెంబరు 9నాటికి ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఎఎస్‌జిని ఆదేశించింది. తప్పిపోయిన పిల్లల కేసులను పరిశీలించడానికి ఒక నోడల్ అధికారిని నియమించాలని, వారి పేర్లు, సంప్రదింపు వివరాలను మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న మిషన్ వాత్సల్య పోర్టల్‌లో ప్రచురించేలా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించాలని అక్టోబరు 14న ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పోర్టల్‌లో మిస్సింగ్ చైల్డ్‌కు సంబంధించిన ఫిర్యాదు వచ్చినప్పుడల్లా ఆ సమాచారాన్ని సంబంధిత నోడల్ ఆఫీసర్లతో ఏకకాలంలో పంచుకోవాలని ఆదేశించింది. తప్పి పోయిన పిల్లలను వెతకడానికి, అటువంటి కేసులను దర్యాప్తు చేయడానికి హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డెడికేటెడ్ ఆన్‌లైన్‌పోర్టల్‌ను రూపొందించాలని సుప్రీం కోర్టు గతంలో కేంద్రాన్ని కోరింది. దేశంలోని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలలో తప్పిపోయిన పిల్లలను గుర్తించే పనిని అ ప్పగించిన పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని ఇది ఎత్తి చూపింది. పోర్టల్‌కు ఒక డెడికేటెడ్ ఆఫీసర్ ఉండవచ్చని కోర్టు తెలియజేసింది. ప్రతీ రాష్ట్రం నుంచి మిస్సింగ్ ఫిర్యాదులకు బాధ్యత వ హించే వారిని సంప్రదించడంతో పాటు సమాచారాన్ని ఇవ్యాప్తి చేయవచ్చు. భారత ప్రభుత్వం పర్యవేక్షించే ఖోయా/ పాయా పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా తీసుకోవలసిన చర్య ల కోసం పిల్లల కిడ్నాప్ లేదా మిస్సింగ్ కు సంబంధించి అపరిష్కృత కేసులను హైలెట్ చేసేందుకు ఎన్‌జిఒ గురియా స్వయం సేవీ సంస్థా న్ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. గత ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లో నమోదైన ఐదు కేసులను పరిగణనలోనికి తీసుకుని పిటిషన్ తన వాదనను వినిపించింది. ఇందులో మైనర్ బాలురు మరియు బాలికలను కిడ్నాప్ చేసి మధ్యవర్తుల నెట్‌వర్క్ ద్వారా జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు ట్రాఫికింగ్ చేశారు.

## 'మరాఠ్వాడా'లో 899 మంది రైతులు ఆత్మహత్య



**ఛత్రపతి శివాజీనగర్ :** మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలు ఏ మాత్రం ఆగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో విఫలం చెందడంతో మరఠ్వాడా ప్రాంతంలో ఈ ఏడాది జనవరి-అక్టోబరు మధ్య కాలంలో దాదాపు 899 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆరు నెలల్లో వరదలు పంటలకు భారీ నష్టం కలిగించగా, తీవ్ర మనస్తాపం చెంది 537 మంది అన్నదాతలు ప్రాణాలు కోల్పోయారని అధికారిక గణాంకాల ద్వారా వెల్లడైంది. వ్యవసాయ శాఖ సహాయ మంత్రి ఆశిష్ జైస్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ సమస్యను తీవ్రంగా పరిష్కరిస్తోందని, ప్రత్యేక పథకాలు, ప్రోత్సాహకాలపై ఖర్చును లక్ష కోట్లకు పెంచిందని చెప్పుకొచ్చారు. కాఆగ, ఛత్రపతి శంభాజీనగర్ డివిజనల్ కమిషనర్ కార్యాలయం అందించిన గణాంకాల ప్రకారం..,. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు పది నెలల్లో మరాఠ్వాడాలో 899 మంది రైతు ఆత్మహత్యలు నమోదయ్యాయి, వీటిలో వర్షాలు, వరదలు విధ్వంసం సృష్టించిన ఆరు నెలల్లో (మే 1 నుండి అక్టోబర్ 31 వరకు) 537 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బీడ్, ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాల్లో అత్యధికంగా వ్యవసాయదారులు ఆత్మహత్యలు చేసుకున్నారు. జి ల్లాల వారీగా చూస్తే ఈ ఆరు నెలల్లో ఛత్రపతి శంభాజీనగర్‌లో 112 ఆత్మహత్యలకు పాల్పడగా, జల్నా 32, పర్భానీ 45, హింగోలి 33, నాందేడ్ 90, బీడ్ 108, లాతూర్ 47, ధరాశివ్ 70 ఆత్మహత్యలు న మోదయ్యాయి. మరాఠ్వాడాలో ఛత్రపతి శంభాజీనగర్, జల్నా, నాందేడ్ పర్భానీ, హింగోలి, లాతూర్, బీడ్, ధరాశివ్ జిల్లాలతో సహా బాధిత రైతులకు పరిహారంగా రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ. 32,000 కోట్ల ప్యాకేజీని ప్రకటించింది. అతి వర్షపాతం, వరదల కారణంగా సెప్టెంబర్ 20 వరకు నమోదైన సమాచారం ప్రకారం 12 మంది మరణించారు. దాదాపు 1,300 ఇళ్లు దెబ్బతిన్నాయి. 357 జంతువులు మృత్యువాత పడ్డాయి. రైతు నాయకుడు, మాజీ ఎంపి రాజు శెట్టి ఆత్మహత్యలపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, అకాల వర్షానికి వరదలు పోటెత్తడం, ఆ తరువాత రుతుపవనాలు మరింతగా విరుచుకుపడడం వల్ల, పండ్ల తోటలు, పంటలను తీవ్రంగా దెబ్బ తీశాయని అన్నారు. పంటలకు జరిగిన నష్టానికి వ్యవసాయదారులకు చాలా తక్కువ పరిహారం లభించిందని శెట్టి ఆరోపించారు. అరటి తోట ఉన్న ఒక రైతు టన్నుకు రూ. 25,000 చొప్పున దాదాపు 100 టన్నుల పంటకు ఒక వ్యాపారవేత్తతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే సినా నదిలో వరదలు అతని మొత్తం పంటను ముంచెత్తాయి. దీంతో అతనికి రూ. 25,000 మాత్రమే పరిహారం లభించింది. ఇలాంటి కేసులు చాలా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. మరాఠ్వాడాలో ప్రకృతి వైపరీత్యాలు పునరావృతం కావచ్చని, కాబట్టి దీర్ఘకాలిక పరిష్కారాలు అవసరమని మంత్రి జైస్వాల్ పేర్కొన్నారు. రుణ మాఫీ ప్రకటించినప్పుడు, దాని ప్రయోజనాలు అవసరమైన వారికి చేరేలా చూసేందుకు ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు.



## అల్ ఫలాహ్ వర్సిటీ సహా 25 చోట్ల ఇడి సోదాలు

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనపై అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. ఎర్రకోట కారు పేలుడు కేసు దర్యాప్తు ముఖ్యంగా అల్ ఫలాహ్ యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నది. అందులో పనిచేస్తున్న పలువురు వైద్యులు ఢిల్లీ పేలుడు కేసులో అరెస్టైన విషయం తెలిసిందే. దాడి ప్లాన్ వెనుక వారి హస్తం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో దర్యాప్తు అధికారులు వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఇక అరెస్టైన వైద్యులంతా హర్యానాలోని అల్‌ఫలాహ్ విశ్వవిద్యాలయానికి చెందిన వారు కావడంతో.. ఈ కేసు దర్యాప్తు వర్సిటీ చుట్టే తిరుగుతోంది. ఈ వర్సిటీ ఉగ్రకార్యకలాపాలకు అడ్డా అంటూ ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇక దర్యాప్తులో భాగంగా అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయ నిధులపై అధికారులు దర్యాప్తు ముమ్మురం చేశారు. ఇందులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు మంగళవారం ఉదయం ఢిల్లీ సహా దాదాపు 25 ప్రదేశాల్లో దాడులు చేశారు. ఓఖ్లాలోని అల్ ఫలాహ్ వర్సిటీ ఆఫీస్, యూనివర్సిటీ ట్రస్టీలు, సంబంధిత వ్యక్తులు, వర్సిటీకి సంబంధం ఉన్న సంస్థల్లో సోదాలు చేపట్టారు. విశ్వవిద్యాలయం నిధులపై దర్యాప్తు చేయాలని ప్రభుత్వ ఆదేశాలతో ఇడి ఈ మేరకు సోదాలు చేపట్టింది.

## అంబులెన్స్‌లో మంటలు

### నవజాత శిశువు సహా నలుగురు మృతి

**గాంధీనగర్ :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి వెంటనే ఆసుపత్రికి తరలించే అంబులెన్స్‌కే అపాయం ఎదురైంది. మంటలు అంటుకుని అందులో ఉన్న నవజాత శిశువు సహా నలుగురు మృతి చెందారు. ఈ ఘటన గుజరాత్‌లోని అర్వల్లి జిల్లా మొదాసా పట్టణంలో జరిగింది. ఈ ప్రమాదంలో డాక్టర్, మరో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడే పుట్టిన శిశువు అస్వస్థతకు గురి కావడంతో మెరుగైన చికిత్స కోసం మొ



దాసా నుంచి అహ్మదాబాద్‌కు అంబులెన్సులో బయలుదేరారు. సోమవారం అర్ధరాత్రి తర్వాత దాదాపు ఒంటి గంట ప్రాంతంలో మొదాసా ధన్సుర రోడ్డులో ప్రయాణిస్తున్న అంబులెన్స్‌లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాద ఘటన రోడ్డుకు అవతల ఉన్న పెట్రోల్ బంకు సిసి కెమెరాలో నమోదైంది. ఈ ఘటనలో శిశువు, శిశువు తండ్రి జిగ్నేష్ మోచి, డాక్టర్ శాంతిలాల్ రెంటియా, నర్సు బూరిబెన్ మనత్ చనిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. మోచి ఇద్దరు బంధువులు, ఆంబులెన్సు డ్రైవరుకు కాలిన గాయాలైనట్లు చెప్పారు. వారిని సమీపంలోని ఆసుపత్రిలో చేర్చినట్లు వెల్లడించారు. మంటలు అంటుకున్న వెంటనే స్థానికులు సహాయ చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా ఆర్పివేశాయి. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ముందు సీట్లో కూర్చున్న డ్రైవరు, శిశువు బంధువులు గాయాలతో బయటపడ్డారు. కాగా వెనకసీట్లో ఉన్న చిన్నారి, తండ్రి, డాక్టరు, నర్సు సజీవ దహనమయ్యారు. ప్రమాదానికి కారణాలు తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ నిపుణులను రప్పించినట్లు అర్వల్లి జిల్లా ఎస్‌పి మనోహర్ సింహ్ జడేజా తెలిపారు.

## ఎర్రకోట బాంబు పేలుడు... సహకుట్రదారు జసీర్‌కు 10 రోజుల ఎన్ఐఎ కస్టడీ



**న్యూఢిల్లీ :** ఎర్రకోట సమీపంలో కారు బాంబు పేలుడులో సహకుట్రదారు జసీర్ బిలాల్‌ను ఢిల్లీలో ని పటియాలా హౌస్ కోర్టు 10 రోజుల ఎన్ఐఎ కస్టడీకి అనుమతించింది. ఎన్ఐఎ అభ్యర్థన మేరకు న్యాయమూర్తి జస్టిస్ అంజూ బజాజ్ చంద్నా క స్టడీకి అనుమతి ఇచ్చారు. జసీర్ బిలాల్‌ను కోర్టు కు తీసుకెళ్లిన సమయంలో ఆ ప్రాంతంలో భారీగా పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలను మోహరించారు. అనంతనాగ్ జిల్లా కాజీగుండ్ నివాసి అయిన జసీర్‌ను సోమవారం శ్రీనగర్‌లో అరెస్టు చేశారు. కారు బాంబు ఘటనకు ముందు జసీర్ సాంకేతిక సహాయం అందించినట్టు ఎన్ఎఐ తెలిపింది. డ్రోన్లలో మార్పులు చేయడంతో పాటు, రాకెట్లను తయారీ చేసేందుకు ప్రయత్నించాడని పేర్కొంది. ఉగ్ర కుట్ర కేసులో అరెస్టైన నిందితుల సమాచారం ఆధారంగా శ్రీనగర్ పోలీసులు ఇప్పటికే జాసిర్‌ను అదుపులోకి తీసుకున్నారు. తాను గతేడాది అక్టోబర్‌లో కుల్గాంలో ఉగ్ర నెట్‌వర్క్ సభ్యులను కలిశానని, అక్కడి నుంచి తనను అల్ ఫలా విశ్వవిద్యాలయంలోని అద్దె వసతి గృహానికి తీసుకెళ్లారని జాసిర్ తెలిపాడు. 'నన్ను 'జైషే మహమ్మద్' ఉగ్రసంస్థకు సహాయకుడిగా (ఓవర్ గ్రౌండ్ వర్కర్) గా ఉంచాలని టెర్రర్ మాడ్యూల్‌లోని ఇతర సభ్యులు కోరుకున్నారు. కానీ, ఉమర్ మాత్రం న న్ను ఆత్మాహుతి బాంబర్‌గా మారేలా ఒప్పించేందుకు చాలా నెలలు ప్రయత్నించాడు' అని వివరించాడు. అయితే వివిధ కారణాలతో జాసిర్ వెనక్కి తగ్గడంతో ఆ ప్రణాళిక కార్యరూపం దాల్చలేదు.

**మరో కీలక నిందితుడు అమీర్ రషీద్ అలీకి 10 రోజుల కస్టడీ**

అంతకుముందు సోమవారం ఈ కేసులో మరో కీలక నిందితుడు అమీర్ రషీద్ అలీని కూడా 10 రోజుల ఎన్ఐఎ కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది. ప్రధాన నిందితుడు నబీకి ఆశ్రయం కల్పించడంతో పాటు, లాజిస్టిక్ సపోర్ట్ అందించినట్టు కోర్టుకు ఎన్ఐఎ తెలిపింది. డాక్టర్ ఉమర్ నబీతో చిట్టచివరిగా మాట్లాడిన వ్యక్తిగా భావిస్తున్న అమీర్ రషీద్ ను అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఢిల్లీ ప్ర ధాన జిల్లాసెషన్స్ న్యాయస్థానంలో సోమవారం హాజరుపరిచారు. నిందితుడిని పదిరోజుల విచారణ నిమిత్తం అప్పగించాలని ఎన్ఐఎ కోరగా న్యాయమూర్తి అంగీకరించారు. ఆత్మాహుతి బాంబర్‌గా మారిన నబీతో కలిసి అతడు కుట్ర చేసినట్లు ఆరోపిస్తూ ఎన్ఐఎ అధికారులు ఆదివారం అరెస్టు చేశారు. అలీని కశ్మీర్‌కు తీసుకువెళ్లి లోతుగా ప్రశ్నిస్తామని అధికారులు తెలిపారు.

## ఎఐ చెప్పింది గుడ్డిగా నమ్మొద్దు

### సుందర్ పిచాయ్ హితబోధ



**మౌంటెన్ వ్యూ:** ఇప్పుడు అందరూ ఆఫీసులలో, ఇళ్ళల్లో, ఇతరచోట్లా ప్రతి చిన్న విషయానికీ కృత్రిమ మేధ మీద ఆధారపడి బతుకున్నారు. బుర్రకు పదును పెట్టకుండా అదే సులభమార్గంగా భావిస్తున్నారు. కానీ గూగుల్ మాతృసంస్థ 'అల్ఫాబెట్' చీఫ్ ఎగ్జిక్యూటివ్ సుందర్ పిచాయ్ మాత్రం అలాంటి తెలివి తక్కువ పనులు చేయవద్దని హితబోధ చేస్తున్నారు. బిబిసికి ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో సుందర్ పిచాయ్ మాట్లాడుతూ, ప్రస్తుత దశలో ఎఐ మోడల్స్ ఇప్పుడు చాలా తప్పులు చేస్తున్నాయని, దీనికి తమ బాధ్యత లేదంటూ 'డిస్‌క్లైమర్స్' కూడా జారీ అవుతున్నాయని హెచ్చరించారు. తమ సొంత ఉత్పత్తుల నుండి కూడా తప్పులు జరగవచ్చుననీ, వాటిని దాచిపెట్టలేమని అన్నారు. ఛాట్‌బోట్ వంటివి తప్పుదారి పట్టించే సమాచారం ఇవ్వడంపట్ల నిపుణులలో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు. మనకు బాగా తెలిసిన రంగంలో ఉన్నవారు ఈ సహాయం తీసుకోవాలని, ఎఐ చెప్పింది గుడ్డిగా నమ్మవద్దన్నారు. 'మీరు ఏదైనా సృష్టించాలనుకుంటే అన్ని టూల్సు ఉపయోగిస్తాయి, కానీ వాటిని గుడ్డిగా నమ్మకూడదు, కేవలం కృత్రిమ మేధ టూల్‌ను మాత్రమే నమ్ముకోవద్దనీ, ఇతర టూల్స్ కూడా దానికి అనుబంధంగా ఉపయోగించుకోవాలని, సొంత బుర్ర వాడుకోవాలని కోరారు. కేవలం కృత్రిమ మేధ టూల్స్‌పైన మాత్రమే ఆధారపడవద్దని, మన చుట్టూ ప్రకృతి పద్ధతులలో లభ్యమయ్యే విజ్ఞాన వనరులను వీలైనంత వరకూ ఉపయోగించుకోవాలని కోరారు. మన చుట్టూ గొప్ప సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కేవలం ఎఐ మాత్రమే కాకుండా ప్రజలు గూగుల్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని, దీనికి సంబంధించి ఖచ్చితమైన సమాచారాన్ని అందించడంలో ఇతర ఉత్పత్తులు కూడా తమ వద్ద ఉన్నాయని ఆయన అన్నారు. ఐతే కొంతమంది నిపుణులు మాత్రం, గూగుల్‌వంటి సంస్థలు వినియోగదారులను నిజ నిర్ధారణలు చేయమని అడగకూడదనీ, ఈ సంస్థలే ఖచ్చితమైన సమాచారాన్ని సమకూర్చేందుకు వీలైన విధంగా తమ సంస్థలను పటిష్టం చేసుకోవాలని అంటున్నారు. ఇదిలా ఉండగా ఇప్పుడు కొత్తగా మార్కెట్‌లోకి ఎఐ న్యూ మోడల్ జెమిని 3.0 రాకకోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. ఛాట్ జిపిటి నుండి మార్కెట్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి గూగుల్ కూడా ఎదురుచూస్తోంది.

**ఎఐ బుడగ పగిలితే తీవ్ర ప్రభావం!!**

ఇటీవలికాలంలో ఎఐ టెక్ కంపెనీల విలువ భారీగా పెరిగిందనీ, ఎఐ పెద్ద బుడగలాగా పెరిగిపోయిందని, ఈ బుడగ గనుక పేలిపోతే ప్రతి కంపెనీపైనా తీవ్ర ప్రభావం పడుతుందని సుందర్ పిచాయ్ హెచ్చరించారు. కృత్రిమ మేధ పెట్టుబడి పెరుగుదల బుద్బుద ప్రాయమని, అది క్షణభంగురం కావచ్చునని అన్నారు. ఎఐ బూమ్‌లో కొంత అహేతుకత ఉందని అన్నారు. ఇటీవలికాలంలో ఎఐ విలువ భారీగా పెరిగిందని, కంపెనీలు కూడా ఈ విషయంలో భారీగా ఖర్చు చేయడంవల్ల పరిశ్రమ బాగా విస్తరించిందని, కానీ ఈ బుడత పేలుతుందని సిలికాన్ వ్యాలో భయాలు ఉన్నాయన్నారు. దీనికి మించినదేదో వచ్చి ప్రభావం చూపిస్తుందన్న ఆలోచనలు ఉన్నాయన్నారు. 'మరి ఈ బుడగ పేలుడు నుండి మీ కంపెనీకి రక్షణ ఉందా?' అని ప్రశ్నించగా, ఈ పరిస్థితిని ఎదుర్కొన్ని గూగుల్ నిలబడగలదని, ఐనప్పటికీ కూడా ఇప్పటికే తాము హెచ్చరికలు జారీ చేశామని సుందర్ పిచాయ్ సమాధానం చెప్పారు. ఛాట్‌జిపిటి ఓపెన్ ఎఐ ద్వారా వచ్చే ముప్పును తట్టుకుని నిలబడగల శోధనలు ఉన్నాయన్న విశ్వాసం ఉండబట్టే మార్కెట్‌లో అల్ఫాబెట్ విలువ గడచిన ఏడు నెలలకాలంలో 3.5 ట్రిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. అమెరికా కంపెనీలకు చైనా స్టార్టప్ ఎవిడియా అతి తక్కువ ఖర్చుతో ఎఐని అందించింది. దీనితో పోటీపడేవిధంగా కొత్త శోధనలు, చిప్‌లు తయారు చేసేందుకు అల్ఫాబెట్ కృషి చేస్తోంది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణ మధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

టెండరు నం. C_SG_36_577 తేది: 17-11-2025 PUB/1449

భారత రాష్ట్రపతి తరుపున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, సికింద్రాబాద్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ వారు దిగువ పనుల కొరకు టెండర్ల ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా బహిరంగ టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం.01, టెండరు నం & తేది: C_SG_36_577, తేది:17.11.2025, ముగింపు తేది: 08.12.2025, పని పేరు: సికింద్రాబాద్ డివిజన్‌పై BPQ-KZJ-KI (A రూట్) సెక్షన్‌లో స్టేషన్ / ప్రదేశం యొక్క 149 నం వద్ద రిలే రూమ్‌ల కొరకు ఫైర్ ఆస్పిరేషన్ సిస్టమ్ ఏర్పాటు. సుమారు విలువ: రూ.8,76,57,228.60 బిడ్ సెక్యూరిటీ /బయానా: రూ.5,88,300/-

తదుపరి వివరాల కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించగలరు.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, (Co-ord), సికింద్రాబాద్

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. DRM/Works/BZA/36/2025 తేది: 14-11-2025 PUB/1450

భారత రాష్ట్రపతి తరపున, దిగువ సంతకం దారు దిగువ పనుల కొరకు ఒక్కోదానికి ఎదురుగా తెలిపిన తేదీన 15.00 గం.వరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం.01, టెండరు నం: E-35-CENTRAL-BZA-2025. పని వివరాలు: పని పేరు: విజయవాడ డివిజన్: BZA-VSKP సెక్షన్: 2025-2026 సంవత్సరానికి DEN/Central/BZA అధికార పరిధి యొక్క ADEN/ఏలూరు సబ్-డివిజన్ క్రింద SSE/P.Way/NZD & SSE/P.Way/EE సెక్షన్లలో ప్రతిపాదిత భద్రతా సంబంధిత ట్రాక్ నిర్వహణ పనులు మరియు ఇతర సకల విధ పనులు. పూర్తి చేయాల్సిన కాలం: 12 (పన్నెండు నెలలు), టెండరు విలువ: రూ.1,85,92,649/-, బయానా: రూ.2,43,000/-, ముగింపు తేది: 09.12.2025.

క్ర.సం.02 టెండరు నం: E-34-Central-BZA-2025. పని వివరాలు: పని పేరు: SW I: BZA డివిజన్ : GDR-BZA సెక్షన్: DEN/Central/BZA అధికార పరిధిలోని ADEN/BPP సబ్-డివిజన్‌లోని SSE/Works/TEL సెక్షన్‌లోని TEL స్టేషన్ వద్ద PF 2&3 మరియు 4&5 పై యుటిలిటీ కేబుల్ డక్టులు మరియు PF 1 పై జనరల్ వెయిటింగ్ హాల్ భవనం ఏర్పాటు. SW II: BZA డివిజన్: BZA-GDR సెక్షన్: DEN/Central/BZA అధికార పరిధిలోని ADEN/BPP సబ్-డివిజన్‌లో SSE/Works/BPP సెక్షన్ లోని BPP స్టేషన్ వద్ద ప్రస్తుత సదుపాయాల మెరుగుదల మరియు PF 2&3 పై జనరల్ వెయిటింగ్ హాల్ భవనం మరియు దివ్యాంగుల టాయిలెట్ ఏర్పాటు. SW III: BZA డివిజన్ : BZA-GDR సెక్షన్: DEN/Central/BZA అధికార పరిధిలోని ADEN/BPP సబ్-డివిజన్‌లో SSE/Works/BPP సెక్షన్‌లోని CLX స్టేషన్ వద్ద ప్రస్తుత సదుపాయాల మెరుగుదల మరియు PF 1, 2&3, 4&5 పై దివ్యాంగుల టాయిలెట్ ఏర్పాటు. పూర్తి చేయాల్సిన కాలం: 12 (పన్నెండు నెలలు), టెండరు విలువ: రూ.8,18,08,501/-, బయానా: రూ.5,59,100/-, ముగింపు తేది: 09.12.2025.

క్ర.సం.03 టెండరు నం: E-46-North-BZA-2025. పని వివరాలు: పని పేరు: SW I: విజయవాడ- విశాఖపట్నం సెక్షన్: (UP & DN): (i) TBR: 63.629 కి.మీ మొత్తం పొడవు కొరకు BCM ద్వారా డీప్ స్క్రీనింగ్‌తో పాటు ట్రాక్ యొక్క త్రూ బల్లాస్ట్ రీకూపింగ్. (ii) TBR (లూప్ లైన్లు): 11.716 కి.మీ మొత్తం పొడవు కొరకు మ్యాన్యువల్ డీప్ స్క్రీనింగ్‌తో పాటు ట్రాక్ యొక్క త్రూ బల్లాస్ట్ రీకూపింగ్. (iii) TBR(T/O) : Sr.DEN/North/BZA అధికార పరిధిలోని పుల్లా-దువ్వాడ స్టేషన్ల మధ్య వివిధ ప్రదేశాల వద్ద 46 సెట్ల కొరకు BCM ద్వారా డీప్ స్క్రీనింగ్‌తో పాటు P&C's త్రూ బల్లాస్ట్ రీకూపింగ్. SW-II: విజయవాడ - విశాఖపట్నం సెక్షన్ (UP & DN): (i) TFR(A/F): 14.250 కి.మీ పొడవు కొరకు PSC స్లీపర్ ట్రాక్‌పై త్రూ ఫిట్టింగ్‌ల రెన్యువల్, (ii) TFR (ప్యాడ్): 2.419 కి.మీ పొడవు కొరకు PSC స్లీపర్ ట్రాక్‌పై త్రూ రబ్బర్ ప్యాడ్ రెన్యువల్. (iii) TWSEJ- 30 సెట్‌లు, (iv) గ్లూడ్ జాయింట్‌లు- 302 నం.లు, (v) Sr.DEN/North/BZA అధికార పరిధిలోని పుల్లా-దువ్వాడ స్టేషన్ల మధ్య వివిధ ప్రదేశాల వద్ద TTR (FS+TWS+WCMSC) 29 సెట్లు, TTR (FS+ CS+CMSC)- 3 సెట్లు, TTRR (WCMSC)- 137 సెట్లు, TTR (FS+TWS) 8 సెట్లు, TTR(DS)- 10 సెట్లు. SW-III: విజయవాడ- విశాఖపట్నం సెక్షన్: Sr.DEN/North/BZA అధికార పరిధిలోని SSE/P.Way/SLO, PAP & AKP సెక్షన్లలో 4.716 కి.మీ BCM తో లూప్ లైన్ల డీప్ స్క్రీనింగ్. SW-IV: విజయవాడ- విశాఖపట్నం సెక్షన్: Sr.DEN/North/BZA అధికార పరిధిలోని SSE/P.Way/TDD & RJY సెక్షన్లలో 3.411 కి.మీ BCM తో లూప్ లైన్ల డీప్ స్క్రీనింగ్. పూర్తి చేయాల్సిన కాలం: 12 (పన్నెండు నెలలు), టెండరు విలువ: రూ.8,55,24,017/-, బయానా: రూ.5,77,600/-, ముగింపు తేది: 09.12.2025.

1) ఏదేని టెండరు కోసం ఏవేని మార్పులను/ సవరణలను గమనించడానికి టెండరు ముగింపు తేదీలోగా www.ireps.gov.in వెబ్‌సైట్‌ను దర్శించవలసిందిగా కాగోరు టెండరుదారులకు సూచించడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ
A1843

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి



**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా, వేలేరు మండలంలోని పీచర గ్రామానికి చెందిన **ఓర్సు ఐలమ్మ, భర్త మల్లయ్య**కు సంబంధించిన పట్టా భూమి పాస్ బుక్ గత సెప్టెంబర్ నెలలో వేలేరు నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా పట్టా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఖాతా నెంబర్ : **1246**, పట్టా పాసు బుక్ నెం. **T21100030960** భూమి డాక్యుమెంట్స్ పోయినవి. సంబంధిత డాక్యుమెంట్స్ దొరికినవారు ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు
**ఓర్సు ఐలమ్మ, భర్త : మల్లయ్య,**
ఇంటి నెంబర్: 4-14/24
గ్రామం:పీచర,మండలం:వేలేరు,
జిల్లా: హనుమకొండ,పిన్: 506145.
**ఫోన్ నెంబర్: +919959083877**

ప్రజాపక్షం
బుధవారం, 19 నవంబరు

## హసీనాకు ఉరిశిక్ష; భారత్ సంకటం

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం నియమించిన ట్రిబ్యునల్ మాజీ ప్రధాని షేక్ హసీనా వాజెద్‌కు ఆమె పరోక్షంలో ఉరిశిక్ష విధించి దేశంలో ఎన్నికలకు ముందు కల్లోలానికి తెరతీసింది. 15 సంవత్సరాలపాటు బంగ్లాదేశ్‌ను పరిపాలించిన హసీనా, గత సంవత్సరం ఆగస్టులో విద్యార్థుల తిరుగుబాటు, హింసతో ఆగస్టు 5న రాజీనామా చేసి సొంత విమానంలో భారత్ చేరుకుని ఆశ్రయం పొందారు. ఆ ఉద్యమ సందర్భంలో కాల్పులు జరుపమని ఆదేశించి అనేకమంది విద్యార్థుల మరణానికి కారణమైనారన్నది ఆమెపై చీఫ్ అడ్వయిజర్ డాక్టర్ ముహమ్మద్ యూనస్ ప్రభుత్వ ప్రధాన నేరారోపణ. 1971లో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా స్వాతంత్ర్య యుద్ధంలో పాల్గొన్న వెటరన్స్ వారసులకు అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో 30శాతం రిజర్వు చేసిన 'సివిల్ సర్వీసు కోటా సిస్టం'ను రాజకీయ అభిమానంతో సమానంగా పరిగణించిన యువజన జన్‌జెడ్ ఉద్యమంతో ఢాకాను అగ్నిగుండంగా మార్చారు. దీన్ని అవామీలీగ్ వ్యతిరేక రాజకీయ పార్టీలు, మత ఛాందసులు ప్రోత్సహించారు. నిరుద్యోగ పీడితులైన నవతరం బంగ్లాదేశీయులకు ఈ రిజర్వేషన్ రాజకీయ అవినీతిగా కనిపించగా, ప్రతిపక్షాల యువత ఆగ్రహంలో హసీనా అధికారాన్ని అంతంచేసే అవకాశాన్ని చూశాయి. సైన్యం ఆమెకు అండగా నిలబడని పరిస్థితిలో హసీనా ఢాకా విడిచిపెట్టటం అనివార్యమైంది. ఏ విధంగా హసీనా తండ్రి, దేశోద్ధారకుడు ముజిబుర్ రెహ్మాన్‌ను ఆయన కుటుంబాన్ని 50ఏళ్ల క్రితం అంతం చేశారో గుర్తుచేసుకుంటే హసీనా ఢాకాలోనే ఉండివుంటే ఆమెపై కూడా అటువంటి ప్రతీకారం జరిగి ఉండేదేమో! ఆమె ప్రభుత్వం లౌకిక విధానాలు అమలు జరిపింది. ఆమె ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్స్ పలువురు ఇస్లామిక్ మత ఛాందస నేతలకు ఉరిశిక్షలు విధించింది. పాకిస్థాన్ శతృత్వం, ఏ మాత్రం అవకాశం లభించినా ఆమె ప్రభుత్వాన్ని కూలద్రోసే కుట్రలను అధిగమించటానికి భారత ప్రభుత్వం ఎప్పుడూ ఆమెకు అండగా నిలిచింది, బంగ్లాదేశ్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు సహాయం అందించింది. భారత్‌కు ఈశాన్యాన అతిపొడవైన సరిహద్దు కలిగి ఉన్న దేశం బంగ్లాదేశ్‌లో శాంతి–సుస్థిరత, లౌకికతలోనే భారత్ ఈశాన్య ప్రయోజనాలున్నాయి. కౌంటర్ టెర్రరిజం, సరిహద్దు భద్రత, రవాణా హక్కుల్లో ఆమె సహకరించారు. దురదృష్టవశాత్తు, ఐదు దశాబ్దాలకు మత ఛాందసం, భారత వ్యతిరేక శక్తులు మళ్లీ పైచేయి సాధించాయి. దీనివెనుక విదేశీ శక్తుల హస్తం కూడా లేకపోలేదు. అందువల్ల ఇది భారత్‌కు పరీక్షా సమయం. హసీనాను అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం ఢిల్లీని కోరింది. భారత్ జవాబు ఇవ్వలేదు.

యూనస్ ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్ (ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్) తనపై చేసిన ఆరోపణలను హసీనా తిరస్కరించారు. ''ప్రజాస్వామిక ఆదేశంలేని ప్రభుత్వానికి చెందిన తీవ్రవాదులు బరితెగింపును, హత్యోన్మాద తలంపును'' ఆ తీర్పు వెల్లడించిందని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాత్కాలిక ప్రభుత్వం తన కేసును అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు తీసుకెళ్లాలని కోరిన హసీనా 'నేను దాచేందుకు ఏమీ లేదు', 'నేను ప్రపంచంలో ఎక్కడైనా న్యాయబద్ధంగా పనిచేసే ట్రిబ్యునల్ ముందు హాజరవుతానని' సవాలు విసిరారు.

ఫిబ్రవరిలో సార్వత్రిక ఎన్నికలు జరుపుతామని ప్రకటించిన తాత్కాలిక ప్రభుత్వం ఛాందసశక్తుల ఒత్తిడికి లోబడి అవామీలీగ్‌పై నిషేధం విధించింది. సార్వత్రిక ఎన్నికలతోపాటే జులై ఛార్టర్‌పై రెఫరెండం కూడా జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించింది. జమాతే ఇస్లామీపై హసీనా ప్రభుత్వం విధించిన నిషేధాన్ని యూనస్ ప్రభుత్వం ఎత్తివేసి రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు అనుమతించింది. ప్రధాన ప్రతిపక్షం మాజీ ప్రధాని షేక్ ఖలీదా జియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బిఎన్‌పి). హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసిన విద్యార్థి సంఘాలు ఒక్కటై నేషనల్ సిటిజన్స్ పార్టీ (ఎన్‌సిపి) పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటు చేసుకున్నాయి. అయితే దాని ఆశలు సన్నగిల్లుతున్నాయి. యూనివర్శిటీల్లో విద్యార్థి యూనియన్‌లకు ఇటీవల జరిగిన ఎన్నికల్లో జమాత్ విద్యార్థి విభాగం బిఎన్‌పి, ఎన్‌సిపి సంఘాలను చిత్తుగా ఓడించింది.

భారత్ నుంచి హసీనా రాజకీయ కార్యక్రమాలను అనుమతించరాదని బంగ్లా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని భారత ప్రభుత్వం పట్టించుకోలేదు. సోమవారం తనకు ఉరిశిక్ష విధించిన అనంతరం హసీనా విడుదల చేసిన ప్రకటనను భారత ప్రభుత్వం అడ్డుకోలేదు. లౌకిక బంగ్లాదేశ్ కోసం పాటుపడిన అవామీలీగ్‌తోనే భారత్ ఉన్నట్లు ఇదొక సూచన. ఏమైనా మోదీ ప్రభుత్వం దేశ రాజకీయ ప్రయోజనాలను, బంగ్లాదేశ్‌లోని హిందువుల భద్రతను సమతౌల్యం చేసుకుంటూ అక్కడి పరిణామాలపట్ల ఓర్పు, నేర్పుతో వ్యవహరించాలి. బంగ్లా ఎన్నికలు ముగిసి ప్రజా ప్రభుత్వం ఏర్పడేవరకు వేచిచూడటమే ఉత్తమం.

# బిహార్ ఎన్నికల నుండి గుణపాఠాలు మేలు


నిత్యా చక్రవర్తి

బిహార్ ఎన్నికల్లో బిజెపి–జెడి(యు) నాయకత్వంలోని ఎన్‌డిఎ 243 స్థానాలుగల అసెంబ్లీలో 202 గెలుచుకుని ప్రత్యర్థి మహాగట్బంధన్‌లోని ఆర్‌జెడి, ఇతర పక్షాలను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఎన్‌డిఎ 202, మహాగట్బంధన్ 35, ఇతరులు 6 గెలుపొందారు. 2020 ఎన్నికల్లో అధికారానికి దగ్గరగా వచ్చిన ఎంజెబికి 2025 ఫలితాలు అశనిపాతంలాంటివి. నాడు ఎన్‌డిఎకి 122, ఎంజిబికి 114 సీట్లు, ఇతరులకు 7 సీట్లు వచ్చాయి. 2020లో 75సీట్లతో ఆర్‌జెడి పెద్దపార్టీగా ఆవిర్భవించగా, బిజెపి 74 సీట్లతో రెండవ స్థానం పొందింది. జెడియు మూడవపార్టీగా దూరంలో ఉండిపోయింది. ఎంజిబి ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వి యాదవ్‌ను ప్రకటించాక ఆ కూటమిలో పెద్ద ఉత్సాహం కలిగింది. అంతకుముందు రాహుల్‌గాంధి నాయకత్వంలో ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితాల ప్రక్షాళన)కు వ్యతిరేక ఉద్యమం ఇసిఐకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఉద్యమంగా సాగిన నేపథ్యంలో ఎంజిబి వ్యూహం, ప్రచారంలో ఏమి తప్పు జరిగిందీ ఇండి కూటమి నాయకులు ఫలితాలను లోతుగా విశ్లేషించాలి. కనిపిస్తున్న కొన్ని సూచనలను ఎంజిబి నాయకులు జాగ్రత్తగా అధ్యయనం చేయాలి.

ఒకటి, నితీశ్‌కుమార్‌ను తక్కువ అంచనా వేయరాదు. ఈ 2025 ఎన్నికలు ముఖ్యమంత్రిని మళ్లీ ఆ కుర్చీలో కూర్చోబెట్టాయి. జెడియు (85 సీట్లు) కన్నా బిజెపికి (89 సీట్లు) నాలుగు సీట్లు ఎక్కువ దక్కినప్పటికీ నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. జెడి(యు) అధినేత శారీరకంగా ఫిట్‌గా ఉన్నంత కాలం బిహార్ నాయకత్వం ఆ కుర్చీవైపు చూస్తూ కూర్చోవలసిందే.

రెండు, మహిళా ఓటర్లు, నితీశ్‌కుమార్ కారణంగా అత్యధికంగా ఎన్‌డిఎకి ఓటు చేశారు. ఎన్నికలకు కొద్ది రోజులముందు మహిళలకు బదిలీచేసిన అదనపు నిధులు అతిపెద్ద ప్రభావం చూపాయి. అటువంటి ఉచిత సహాయాలనుండి తొలి మేలును నితీశ్‌కుమార్ అధికారంలో ఉండగానే పొందారు. మహిళలు పెద్దసంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనటం, ఓటు హక్కును వినియోగించుకోవటం మహిళలకు నగదు బదిలీ సహా వారికి ఉద్దేశించి ఆయన అమలు చేసిన పథకాల ఫలితమే. అటువంటి వాటిని సమర్థవంతంగా అమలు జరిపితే రాజకీయ లబ్ది ఎలా పొందవచ్చో మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో రుజువు చేశారు.

మూడు, ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా రాహుల్‌గాంధి ఉద్యమం ఓటర్లపై ఆశించిన ప్రభావం చూపలేదు. దళితులు, పేద వ్యవసాయ కార్మికులున్న ప్రాంతాల్లో కూడా ఎన్‌డిఎ అభ్యర్థులు గత ఎన్నికల కన్నా మెరుగైన ఫలితాలు సాధించారు. అందువల్ల ఎస్ఐఆర్‌పై వ్యూహాన్ని ఇండి కూటమి మొత్తంగా సవ్యంగా మదింపు చేయాలి. రాహుల్‌గాంధి సీనియర్ నాయకుడే, కాని ఇండి కూటమి ఎజండాను తన సొంత అభిప్రాయాల ప్రకారం హైజాక్ చేయటాన్ని అనుమతించరాదు. ఎక్కువ సీట్ల కోసం ఆర్‌జెడితో ఎప్పుడూ పోట్లాడుతున్న కాంగ్రెస్‌కు ఈ పర్యాయం ఐదు సీట్లే దక్కాయంటే బిహార్‌లో దాని సంస్థాగత నిర్మాణ స్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఆర్‌జెడి మహాగట్బంధన్ నాయకురాలు. కాబట్టి ఎన్‌డిఎ గాలిలో అది ఎక్కువగా దెబ్బతిన్నది. అయితే ఓటింగ్ సంఖ్యలు చూస్తే దానికి బిజెపి, జెడియుల కన్నా ఎక్కువ ఓట్లు వచ్చాయి. 2025 ఎన్నికల ప్రచారంలో లోపాలను సరిదిద్దుకున్న తదుపరి తిరిగి పుంజుకునే అవకాశం దానికి ఉంది. అలాగే సిపిఐ(ఎంఎల్) గత ఎన్నికల నాటి ప్రజాపునాదిని కొంతమేరకు కోల్పోయింది. అందువల్ల తమ పార్టీ, మొత్తంగా ఎంజిబి తీవ్రంగా దెబ్బతినటానికి కారణాలను దీపాంకర్ భట్టాచార్య లోతుగా అధ్యయనం చేయాలి.

ప్రశాంత కిషోర్ జన సురాజ్ పార్టీ, ఒవైసి ఎంఐఎం ఎంజిబి ఓట్లకు, ముఖ్యంగా ఆర్‌జెడి ఓట్లకు కోత పెట్టాయి. ఎన్నికల్లో ఇటువంటివి జరుగుతుంటాయి. కాని చిరాగ్ పాశ్వాన్ (ఎల్ జెపి–ఆర్‌వి) దళిత ఓట్లను ఎన్‌డిఎకు బదలాయించగలిగారు. చిరాగ్ పార్టీతో అలయెన్స్ బిజెపి, జెడియు రెండింటికీ ఉపకరించింది. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో చిరాగ్ శక్తిమంతుడైనాడు. ఎంజిబి తమ అభ్యర్థులు అనేక మంది తమకు బలమైన నియోజక వర్గాల్లో ఓటమి పొందటానికి గల ఇటువంటి కారణాలన్నిటినీ పరిశీలించి పాఠాలు తీసుకోవాలి.

బిజెపికిది సంబురం సందర్భం. బిహార్‌లో గెలుపు ఖాయమని కేంద్ర నాయకత్వం చెబుతున్నప్పటికీ, ప్రైవేటు సంభాషణల్లో వారిలో ఆందోళన కనిపిస్తుండింది. ఎస్ఐఆర్ వ్యతిరేక ఆందోళన నరేంద్ర మోదీ, అమిత్ షాలను భయపెట్టింది. అయితే వారు మహా వ్యూహకర్తలు, కష్టకాలంలో ఎలా గట్టెక్కాలో వారికి తెలుసు. వారు అదే చేశారు. తన వ్యూహం విజయవంతం అయినందుకు అమిత్ షాకు తప్పక ఖ్యాతి దక్కుతుంది. ఆయన తదుపరి దృష్టి వచ్చే ఏప్రిల్/మే మాసాల్లో ఎన్నికలు జరిగే కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం , పుదుచ్చేరిపై ఉంది. కాబట్టి ఇండి కూటమి బిహార్ ఓటమి నుంచి సరైన పాఠాలు తీసుకుని రానున్న ఎన్నికలకు సకాలంలో సిద్ధం కావాలి.

తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లోని ప్రతిపక్ష ప్రభుత్వాలను కూలద్రోయటానికి బిజెపి నాయకత్వం శాయశక్తులా ప్రయత్నిస్తుంది. కేరళలో పోరాటం ఎప్పటివలె ఎల్‌డిఎఫ్–యుడిఎఫ్ మధ్యనే ఉంటుంది. రెండు మూడు సీట్లకోసం బిజెపి పోరాడుతుంది. పశ్చిమ బెంగాల్‌లో హోంమంత్రి అమిత్ షా ఏమి ప్రయత్నాలు చేసినా టిఎంసిని ఓడించగల సంస్థాగత నిర్మాణం బిజెపికి లేదు. అయినా బిజెపి కేంద్ర నాయకత్వం భూమి తలక్రిందులయ్యేంత హడావుడి చేస్తారు. మమతా బెనర్జీ అందుకు సిద్ధంగా ఉన్నారు.

> ఇండియా కూటమి నాయకులు త్వరలో సమావేశమై ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులపై రాజకీయ వ్యూహాలు రచించాలి. 2025లో ఢిల్లీ తర్వాత మరో ఎన్నికల పోరాటంలో బిజెపి గెలిచింది. 2026 ఎన్నికల పోరాటాల్లో ఇండి కూటమి మరో నష్టానికి గురికాకూడదు.

తమిళనాడులోని ఇటీవలి పరణామాలు ఇండి కూటమికి 2026 ఎన్నికల్లో కొంత ఆందోళనకరంగా ఉంటాయి. సినిమాస్టార్ విజయ్ రాజకీయ పార్టీ జనాలను , ముఖ్యంగా యువత, మహిళలను ఆకర్షిస్తోంది. అతను ఇప్పటివరకు అలయెన్స్‌ల గురించి మాట్లాడలేదు. ఒకవేళ ఎఐఎడిఎంకె–బిజెపి కూటమితో పొత్తు పెట్టుకుంటే (బిజెపి ప్రయత్నాలు చేస్తోంది) డిఎంకె నాయకత్వంలోని కూటమిలో బెంబేలు సృష్టిస్తాడు. అయినా స్టాలిన్ నాయకత్వంలోని డిఎంకె సంస్థాగత నిర్మాణం, ప్రజాదరణతో బలమైన శక్తిగా ఉంది. ఎఐఎడిఎంకె గ్రూపుల పునరైక్యతకు జరుగుతున్న ప్రయత్నాలు సఫలమైతే డిఎంకె కూటమికి నిజమైన సవాలు ఎదురవుతుంది. అందువల్ల డిఎంకె దాని భాగస్వాములు ముందుగానే రంగంలో దిగాలి.

అస్సాంలో అధికారం నిలుపుకుంటామని బిజెపి ఆత్మవిశ్వాసంతో ఉంది. బెంగాలీ మాట్లాడే ముస్లింలను అస్సామీస్ మాట్లాడే ముస్లింలనుంచి వేరుపరచటానికీ, అస్సామీస్ హిందువుల ప్రాపకం కోసం హిందూమత మార్గాల్లో ప్రచారం చేయటానికి ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ అనుసరిస్తున్న వ్యూహంతో కేంద్ర నాయకత్వం సంతృప్తిగా ఉంది. అస్సాంలో ఇండి కూటమి పార్టీలు ఎట్టకేలకు ఒక అవగాహనకు వచ్చాయి. అస్సాంలో మైనారిటీలు 35 శాతం, వారు ప్రధానంగా ముస్లింలు. ఎఐయుడిఎఫ్ చాలా కాలంగా బెంగాలీ మాట్లాడే ముస్లింల ప్రయోజనాలు చూస్తున్నది. ఈ పార్టీతో అవగాహనకు, కాంగ్రెస్‌కు సమస్యలున్నాయి. అది కాంగ్రెస్ ఓట్లు చీల్చుతుంది. బిహార్‌లో చిరాగ్ పాశ్వాన్‌తో ఎన్‌డిఎ పొత్తు ఆ కూటమికి ఎలా తోడ్పడిందో గ్రహించి, బిజెపి వ్యతిరేక ఓటు చీలకుండా చూడటమనే సూత్రం ప్రకారం ఇండి కూటమి ఎఐయుడిఎఫ్‌తో సర్దుబాటు చేసుకుంటే మేలు జరుగుతుంది.

ఇండి కూటమి నాయకులు త్వరలో సమావేశమై ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులకు రాజకీయ వ్యూహాలు రచించాలి. 2025లో ఢిల్లీ తర్వాత మరో ఎన్నికల పోరాటంలో బిజెపి గెలిచింది. 2026 ఎన్నికల పోరాటాల్లో ఇండి కూటమి మరో నష్టానికి గురికాకూడదు.






# ప్రపంచ సమస్యల పరిష్కారంలో పురుషుల పాత్రను కొనియాడలేదా !

పురుషాధిక్య సమాజంలో మనం ఉన్నాం. పురుషుల నాయకత్వంలో స్త్రీలోకం వంటింటి కుందేలుగానే ఇంటికి మాత్రమే పరిమితం అవుతున్నది. అన్ని రంగాల్లో పురుషులు మాత్ర మే అత్యధిక సంఖ్యలో ముందంజలో ఉంటున్నారు. వార్డు మెంబర్ నుంచి దేశ ప్రధానులు, అధ్యక్షుల వరకు పురుషులే ఉంటున్నారు. ఉద్యోగాలు, ఉపాధుల్లో కూడా పురుషులదే సింహభాగం ఉంటున్నది. పురుషులే కుటుంబం నుంచి పౌర సమాజం వరకు అంతటా మగ మహారాజులే కనిపిస్తున్నారు. సమాజం ఎదుర్కొంటున్న లింగ అసమానతలు, మహిళకు స్వేచ్ఛ ఇవ్వకపోవడం లాంటి కొన్ని సమస్యలకు ప్రధాన కారణం పురుష సమాజమే అవుతున్నపుడు వారి కోసం ఒక దినోత్సవం జరపడం సోచనీయమంటూ వాపోతున్న వారు కూడా ఉన్నారు.

ఈ విచిత్ర పరిస్థితుల్లో పురుషులకంటూ ఒక దినోత్సవం కేటాయించడం కొంత ఆశ్చర్యకరంగా ఉన్నది. ప్రకృతిలో సగమైన, మన జన్మలకు కారణమైన మహిళాలోకం అసమానతల విషవలయంలో చిక్కి కొట్టుమిట్టాడుతున్న వేళ అంతర్జాతీయ పురుషుల దినం పాటించడం అసమంజసంగా ఉందని అభిప్రాయపడేవారు ఉన్నారు.

ఏది ఏమయినా నవంబర్ 19న ప్రతి ఏట ప్రపంచ దేశాలు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం లేదా ఇంటర్నేషనల్ మెన్ డే పాటించడం 1999 నుంచి ఆనవాయితీగా మారింది.

**అంతర్జాతీయ పురుషుల దినం–2025 థీమ్:**

అంతర్జాతీయ పురుషుల దినం వేదికగా ప్రపంచ పురుష/బాలుర సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించడం, సమాజాభివృద్ధిలో వారి పాత్రను కొనియాడడం, వారు కుటుంబ/సమాజ/వృత్తి సంబంధ బాధ్యతలను భుజాన ఎత్తుకున్న ఎదుర్కొంటున్న కష్టనష్టాలను గుర్తు చేసుకోవడం, పలు రంగాల్లో రాణించిన పురుషులను అభినందించడం, పురుషుల ఆరోగ్య సమస్యలు, మానసిక రుగ్మతలు, అసమానతలను/వివక్షలను రూపుమాపడం, సానుకూల మేల్ రోల్ మాడల్స్‌ను సన్మానించడం, లింగఆధార హింసలు లాంటి అంశాలను వివరించడం జరుగుతున్నది. ఒక తండ్రి, భర్త, ఉద్యోగి, అన్న, గురువు, మెంటర్, సైనికుడు, పైలెట్, వ్యాపారి, వినియోగదారుడు, శ్రామికుడు లాంటి అనేక పాత్రల్లో పురుష సమాజం నాయకత్వం వహించడం చూస్తున్నాం. అంతర్జాతీయ పురుష దినోత్సవం2025 థీమ్గా సెలబ్రేటింగ్ మెన్ అండ్ బాయ్స్ అనబడే అంశాన్ని తీసుకున్నారు.

**సిక్స్ పిల్లర్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ మెన్ డే:**

అంతర్జాత పురుష దినం వేదికగా ఆరు ప్రధాన అంశాలను తీసుకొని చర్చించడం జరుగుతున్నది. పురుష ఆదర్శ మూర్తులను ప్రోత్సహించడం, సమాజాభివృద్ధిలో పురుషుల పాత్రను గుర్తించడం, పురుషుల ఆరోగ్యం/శ్రేయస్సుపై దృష్టి పెట్టడం, పురుషుల/బాలుర పట్ల వివక్ష లేదా అసమానతలను రూపుమాపడం, లింగ సమానత్వాన్ని సాధించడం, ప్రపంచం ఒక సురక్షిత ప్రదేశంగా మార్చడం అనబడే ఆరు మూల స్తంభాలను ఈ వేదికగా తీసుకోవడం జరుగుతోంది. ఈ రోజున పురుషులు, మగతనం, పురుషత్వం లాంటి అంశా ల గూర్చి సానుకూల సంభాషణలు ప్రచారం చేయడంతో పాటు మనకు ఇష్టమైన నాన్న, భర్త లేదా సోదరుడికి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనవాయితీగా వస్తున్నది. 1999లో ట్రినిడాడ్‌కు చెందిన జెరోమ్ తీలుక్సింగ్ ప్రారంభించిన ఒక చిన్న కార్యక్రమం నేడు ప్రపంచ దేశాలు పాటించే స్థాయికి చేరడం హర్షదాయకం, అభినంద నీయం. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పురుషులు కుటుంబ పెద్దలుగా అనేక బాధ్యతను మోస్తూ, కష్టనష్టాలను భరిస్తూ, మానసికంగా కుంగిపోతూ, చివరకు ఆత్మహత్యలకు సహితం పూనుకోవడం చూస్తున్నాం. ఇలాంటి సంసార, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, వృత్తి, పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయడం లాంటి అనేక బాధ్యతను తన భుజాన వేసుకొని శ్రమిస్తున్న మగ మహారాజులను అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలియజేద్దాం.

(19 నవంబర్ అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా)

## శౌచ సదుపాయం ప్రతీ మనిషి హక్కేనా?

ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో పరిశుభ్రమైన నీరు, శౌచ సదుపాయం(మరుగుదొడ్డి), వ్యక్తిగత పరిశుభ్రత వంటి ప్రాథమిక అవసరాలు ఇప్పటికీ కోట్లాది మందికి అందడం లేదు. ఇవి లేకపోవడం ఆరోగ్యం మాత్రమే కాదు, కుటుంబాల జీవన ప్రమాణాలు, మహిళల భద్రత, పిల్లల భవిష్యత్తు, సమాజ అభివృద్ధిని ప్రభావితం చేస్తోంది. పరిశుభ్రత లేమి చిన్నపిల్లల ప్రాణాలను అత్యంత ప్రమాదంలోకి నెడుతోంది.

నీరు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత అనే మూడు రంగాలలో లోపాలు విరేచనాలు, పేగు పురుగులు, నేత్ర వ్యాధులు, పోషకాహార లోపం వంటి సమస్యలను పెంచుతున్నాయి. 2022 అంచనాల ప్రకారం ప్రపంచ జనాభా సగానికి కొద్దిగా పైగానే సురక్షిత శౌచ సదుపాయం అందుబాటులో ఉంది. గ్రామీణ ప్రాంతాలు, పేదరికంలో ఉన్న కుటుంబాలు, దూర ప్రాంతాలు ఈ సేవలకు చేరలేదు. బహిరంగ శౌచ విసర్జన జరుగుతున్న ప్రాంతాల్లో పిల్లల మరణాలు, పోషకాహార లోపం, పేదరికం తీవ్రంగా కనిపిస్తున్నాయి.

శౌచ సదుపాయం మెరుగుపడితే ఆరోగ్యం మాత్రమే కాదు సామాజిక ప్రయోజనాలు కూడా అధికంగా లభిస్తాయి. మహిళలు, బాలికలకు భద్రత పెరుగుతుంది. పాఠశాలలో విడిగా శౌచాలయాలు ఉండటం వల్ల బాలికల హాజరు పెరుగుతుంది. పరిశుభ్రత పెరిగితే పేగు, నేత్ర, చర్మ వ్యాధులు తగ్గుతాయి. కుటుంబాల వైద్య ఖర్చులు తగ్గి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. మురుగునీటిని సురక్షితంగా పారబోయడం నీటి కొరత సమస్యను తగ్గిస్తుంది.

ఆర్థికంగా కూడా శౌచ సదుపాయం అత్యంత కీలకం. కుటుంబాల ఆరోగ్యం మెరుగైతే పని సామర్థ్యం పెరుగుతుంది, సమాజం ఉత్పాదకత పెరుగుతుంది, దేశానికి వైద్య వ్యయం తగ్గుతుంది. ఇది భవిష్యత్తు తరాల శ్రేయస్సుకు పెట్టుబడి పెట్టినట్లే.


అయితే ఇంకా అనేక అడ్డంకులు ఉన్నాయి. పాతబడ్డ నిర్మాణాలు, తగిన నిధుల కొరత, వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, వాతావరణ మార్పుల ప్రభావం వంటి అంశాలు ముందడుగును నెమ్మదింప చేస్తున్నాయి. శుభ్రత పనివారికి సరైన రక్షణ, గౌరవం, భద్రత కల్పించకపోవడం కూడా ఒక ప్రధాన సమస్య. ఈ అవరోధాలు తొలగించకుం డా శౌచ సదుపాయం అందరికీ చేరడం సాధ్యం కాదు.ఇలాంటి సమయంలో అందరికీ పారిశుద్ధ్యం, భద్రత, గౌరవం అనే ఈ సంవత్సరపు పిలుపు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.

శౌచ సదుపాయం ఒక వసతి మాత్రమే కాదు అది ప్రతి మనిషి ఆరోగ్యం, గౌరవం, భద్రత, సమానత్వాన్ని కాపాడే హక్కు. ప్రతి కుటుంబం భయంలేకుండా, గౌరవంగా, ఆరోగ్యంగా జీవించాలంటే శౌచ సదుపాయం ప్రతి ఇంటికి చేరాలి. సమాజాలు అభివృద్ధి చెందాలంటే, పిల్లలు ఆరోగ్యంగా పెరగాలంటే, భవిష్యత్తు తరాలు సురక్షితంగా ఉండాలంటే పారిశుద్ధ్యం అందరికీ అందాల్సిందే.

(ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి శౌచ సదుపాయాలు లేనందుపై దృష్టిని నిలిపేందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 19న ప్రపంచ శౌచ దినోత్సవం నిర్వహిస్తారు)

డాక్టర్ కృష్ణ కుమార్ వేపకొమ్మ
vepakrish1956@gmail.com

# జ్ఞానం గ్రంథాల్లో.. స్వార్థం మస్తిష్కాల్లో...


సుంకవల్లి సత్తిరాజు
(సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)
9704903463

ఒక్క అడుగు ఎన్నో అడుగులకు ప్రేరణ నిచ్చి గమ్యానికి చేరుస్తుంది. ఒక్క అక్షరం జ్ఞాన సౌధానికి పునాది వేసి, ప్రపంచాన్ని మారుస్తుంది. మేధస్సుకు పదును పెట్టి, మనసును స్పృశింప చేస్తే అక్షరం ఆయుధమవుతుంది. ఒక అక్షరంతో మొదలైన ప్రయత్నం పుస్తకంగా పరివర్తన చెందుతుంది. అజ్ఞాన గాడాంధకారాన్ని తొలగించే అక్షర హారం పుస్తకం. అక్షరజ్ఞానం, పుస్తక జ్ఞానం లేని మానవ జన్మ నిరర్థకం. దైవం కొలువున్న ప్రదేశం దేవాలయమైతే, జ్ఞాన జ్యోతిని వెలిగించే గ్రంథాలకు ఇలలో నెలవైన నిజమైన దేవాలయం గ్రంథాలయం. దేశ స్వాతంత్ర్యోద్యమం లోను, సాంఘిక దురాచారాల నుండి మేల్కొలపడం లోను, తెలంగాణలో ఒకప్పటి నిజాం నిరంకుశ పాలన వలన నెలకొన్న అస్థవ్యస్థ పరిస్థితులనుండి కాపాడి, ప్రజలను జాగృత పరచడంలోను గ్రంథాలయోద్యమం పాత్ర అనిర్వచనీయం.ఎంతో మంది అభ్యుదయ వాదులు, సంఘ సంస్కర్తలు గ్రంథాలయోద్యమంలో పాల్గొని గ్రంథాలయాల స్థాపనకు విశేష కృషి చేసారు. అయ్యంకి వెంకట రమణయ్య తెలుగు వారికి సుపరిచితం. గ్రంథాలయాల ద్వారా ప్రజల్లో సామాజిక స్పృహ కలిగించాలనే ఉద్దేశ్యంతో అవిశ్రాంత కృషి చేసి, గ్రంథాలయోద్యమ పితామహుడిగా పేరొంది, ఆచంద్రతారార్కమైన ఖ్యాతి నార్జించిన 'అయ్యంకి' జనహృదయాల్లో పెల్లుబికిన చైతన్య స్రవంతి.ఆంధ్ర ప్రదేశ్ లో 1886 వ సంవత్సరంలో విశాఖ పట్టణంలో స్థాపించిన పౌర గ్రంథాలయం తొలి గ్రంథాలయంగా పిలవబడుతున్నది. అయితే అంతకు ముందు కూడా అనేక గ్రంథాలయాలు స్థాపించబడినట్టు గ్రంథాలయ చరిత్ర విశదీకరిస్తున్నది. గ్రంథాలయం అయ్యంకి మానస పుత్రిక. విజయవాడ కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ అసోసియేషన్ 1914 లో ఏర్పడింది.

వేటపాలెంలో ఏర్పడిన సారస్వత నికేతనం గ్రంథాలయం ప్రాచీన గ్రంథాలయాల్లో ఒకటి. కేరళలోని 'త్రివేండ్రం పబ్లిక్ లైబ్రరీ' ని ఇండియాలో మొదటి లైబ్రరీగా పిలుస్తారు. తెలుగు రాష్ట్రాల్లో 1872లో సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయం ప్రాచీన గ్రంథాలయంగా పేరుగాంచింది. కొమర్రాజు లక్ష్మణరావు కూడా గ్రంథాలయ ఉద్యమానికి విశేషమైన కృషి చేసాడు. తెలంగాణాలో సురవరం ప్రతాపరెడ్డి, తెలంగాణ గొంతు 'కాళోజీ' గ్రంథాలయోద్యమంలో ప్రశంసనీయమైన పాత్ర నిర్వహించాడు. అనేక ఉద్యమాల ప్రభావంతో అప్పటి నల్గొండలో ఆంధ్ర సరస్వతీ గ్రంథ నిలయం, వరంగల్‌లో ఆంధ్ర భాషా నిలయం ఏర్పడ్డాయి. తెలంగాణలో గ్రంథాలయ ఉద్యమం ఆలస్యంగా ప్రారంభమైన తర్వాత క్రమంలో అత్యంత క్రియాశీలకంగా మారింది. హైదరాబాద్ లోని కృష్ణదేవరాయ ఆంధ్ర భాషా నిలయం ఒక పురాతన గ్రంథాలయం. గ్రంథాలలోనే నిజమైన విజ్ఞానం నిగూఢమై ఉన్నది. మన ఆలోచనా సామర్థ్యం పెరగడానికి పుస్తకపఠనమే నిజమైన మిత్రుడు. వర్తమానంలో జరుగుతున్న ప్రాపంచిక సంఘటనలు, గతంలో జరిగిన వాస్తవ సంఘటనలను గ్రంథస్థం చేసి, రాబోయే తరాలకు అందించడమే చరిత్ర. చరిత్ర అనేది బ్రహ్మపదార్థమేమీ కాదు. చరిత్ర అంటే వాస్తవ పరిస్థితులను కళ్ళకు కట్టినట్టుగా విశదీకరిస్తూ అక్షరరూపమిస్తూ గ్రంథస్థం చేయడమే. గతంలో చాలామంది కవులు తమ మస్తిష్కంలో మెదిలే ఆలోచనలకు, కల్పనలకు అలంకారాలను జోడిస్తూ హృదయానికి హత్తుకునేటట్టు వివిధ రూపాల్లో తమ కున్న ప్రతిభావ్యుత్పత్తులతో జన రంజకమైన రచనలు చేసేవారు.

మన ప్రాచీనకాలానికి చెందిన గ్రంథాలు ఈనాటికీ పండిత పామరుల చేత కొనియాడబడుతూ, విశేష జనాదరణ పొందుతున్నాయి. బహుళ ప్రాచుర్యంలో ఉన్నాయి.కాలాను గుణంగా మార్పులు రావడం సహజం. మారిన పరిస్థితులకనుగుణంగా సమాజం కూడా అదే నిష్పత్తిలో పరివర్తన చెందుతున్నది. కాలానుగుణంగా వస్తున్న మార్పుల ఫలితంగా పుస్తకాల స్థానాన్ని కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు ఆక్రమిస్తున్నాయి.చదువుకోకుండా ఆటపాటలతో అల్లరి చేసే విద్యార్థులను ఉద్దేశించి మన పెద్దలు 'పుస్తకం హస్తభూషణం'కారాదు అనేవారు. ఇది గత కాలపు మాట.చరవాణి నేటి తరానికి హస్తభూషణమై వర్ధిల్లుతున్నది.అసలు పుస్తకమే కనుమరుగై పోయే రోజులు దాపురించాయి.సాంకేతిక విజ్ఞానం క్రొత్త పుంతలు తొక్కిన నేపథ్యంలో


గ్రంథ పఠనం ప్రాధాన్యత కోల్పోయింది. ప్రతీ ఒక్కరూ పుస్తకాలను చదవాలని, విజ్ఞాన సముపార్జన ద్వారానే మానసిక వికాసం కలుగుతుందని,సమాజ పురోభివృద్ధి పుస్తకపఠనం ద్వారానే సాధ్యమవుతుందని ఎంతో మంది విజ్ఞులు ఒక అవగాహనకు వచ్చి, అందరికీ పుస్తకాలు అందుబాటులో ఉండాలని, అందుకోసం స్వాతంత్ర్య పోరాటం తరహాలో ఉద్యమించారు. వారి పోరాటఫలితమే గ్రంథాలయాల ఆవిర్భావం. ఇండియన్ లైబ్రరీ అసోషియేషన్ ఆవిర్భవించడానికి, జాతీయస్థాయి సమావేశాలకు అది వేదిక కావడానికి ఆద్యుడు అయ్యంకి వెంకట రమణయ్య, కొమర్రాజు లక్ష్మణ రావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, వెలగా వెంకటప్పయ్య, పాతూరి నాగభూషణం, బెల్లంకొండ నాగేశ్వరరావు వంటి మహనీయులెందరో గ్రంథాలయోద్యమానికి నాయకత్వం వహించారు. ఆ మహనీయుల కృషి ఫలితమే గ్రంథాలయాల ఏర్పాటుకు బీజం పడింది. **నవంబర్ 14 వతేదీ నుండి 20వ తేదీ వరకు జాతీయ 'గ్రంథాలయ వారోత్సవాలు' జరుగుతున్నాయి.** దేశం నలుమూలలా అనేక గ్రంథాలయాలను స్థాపించి సామాన్యులందరికీ విజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే సదుద్దేశ్యమే గ్రంథాలయ వారోత్సవాలకు నాంది పలికింది. అయితే విజ్ఞాన భాండాగారాలు గా విలసిల్లిన గ్రంథాలయాల్లో పాఠకుల సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. మరో గ్రంథాలయోద్యమం ప్రారంభం కావలసిన అవసరం ఏర్పడింది. చరవాణి పుస్తక స్థానాన్ని ఆక్రమించింది. పుస్తక పఠనంపై నేటి విద్యార్థికి ఆసక్తిని కలిగించాలి. మనోవికాసానికి గ్రంథాలయాలే ఆలవాలం.

గ్రంథాలయ వారోత్సవాల స్ఫూర్తి గ్రంథాలయాల ఆవశ్యకతకు దోహదం చేయాలి. ప్రతీ గ్రామంలో ప్రతీ పాఠశాలలో గ్రంథాలయాలుండాలి. ప్రభుత్వాలు గ్రంథాలయాలకు విలువైన పుస్తకాలను, అన్ని దిన,వార,పక్ష,మాస పత్రికలను అందుబాటులో ఉంచాలి. పుస్తకమే సమస్త విజ్ఞాన సంపదగా పాఠకులు భావించాలి.

(గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా)


అయ్యంకి వెంకట రమణయ్య


కొమర్రాజు లక్ష్మణరావు


సురవరం ప్రతాపరెడ్డి


కాళోజీ

## షాట్ సర్క్యూట్‌తో పత్తి పంట దగ్ధం



ప్రజాపక్షం/గుండాల: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధిలోని మరిపడిగ గ్రామానికి చెందిన రైతు బోయిని అంజయ్య ఇంట్లో నిల్వచేసిన 35 క్వింటాల్ల పత్తి షార్ట్ల సర్క్యూతో దగ్ధమైంది. బాదితుడు తెలపిన వివరాల ప్రకారం సోమవారం సాయంత్రం సమయంలో పత్తి నిల్వ చేసిన గదిలో నుండి పొగలు వచ్చాయని. ఇరుగుపొరుగువారిని పిలిచి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి పంట కాలిపోయిందని, ప్రభుత్వం నాకు తగు సాయ చేయాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

## ట్యాబ్‌లో నమోదు చేయాలి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : ధాన్యం కొనుగోలు వివరాలను సకాలంలో ట్యాబ్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించే ఐకెపి, పిఏసిఎస్, మెప్మా, ఎఫ్‌పిఓలకు చెందిన అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించిన వెంటనే బిల్లులను పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కార్యాలయంలో సమర్పిస్తే వేగవంతంగా రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎస్ఓ మోహన్‌బాబు, డిఎం రాము, డిసిఓ ప్రవీణ్ కుమార్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## త్వరగా ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని గృహ ప్రవేశాలు

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



ప్రజాపక్షం/యాదాద్రి : వివిధ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం రాజాపేట మండలం కాల్వపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలతో మాట్లాడుతూ ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టి ఎన్ని రోజులు అయ్యిందని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం విషయంలో ఎందుకు ఆలస్యం జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు నిర్మాణం పూర్తయినంత వరకు బిల్లులు వచ్చాయా అని అడిగారు. మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హోంగార్డుల సంక్షేమానికి కృషి



ప్రజాపక్షం/సూర్యాపేట : హోంగార్డుల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని ఎలాంటి సమస్యలు ఉన్న సిబ్బంది నేరుగా తెలుపవచ్చని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అకాల మరణం చెందిన హోంగార్డ్ సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాలను వదిలి ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోకుండా ప్రజల రక్షణకు అనుక్షణం కృషి చేస్తున్నారన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తూ మరణించిన హోంగార్డు సైదులు కుటుంబానికి, నడిగూడెం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన మహిళా హోంగార్డు కుటుంబానికి జిల్లా హోంగార్డు సంక్షేమ నిధి నుండి హోంగార్డు చేయుత ద్వారా ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, హోంగార్డ్స్ ఇంచార్జి ఆర్ఎస్ఐ అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయానికి తాళం





ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పట్టణంలోని మార్గదర్శి చిట్‌ఫండ్ కార్యాలయానికి మంగళవారం ఓ చిట్టిదారుడు చిట్టి ఎత్తుకున్న తరువాత డబ్బులు ఇవ్వకుండా నెలల తరబడి తిప్పుతున్నారంటూ ఆగ్రహంతో సిబ్బందిని అందులోనే ఉంచి ఆ కార్యాలయానికి తాళం వేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... కుడకుడకు చెందిన గుగులోతు రమేష్ 5 నెలల క్రితం మార్గదర్శి చిట్‌ఫండ్‌లో రూ.25లక్షల చిట్టీ 50 నెలలకు సంబంధించి రెండు చిట్టి గ్రుపులలో చేరారు. ప్రతినెలా రూ.32,500 చొప్పున చిట్‌ఫండ్ వారికి చెల్లిస్తూ వస్తున్నారు. మొత్తం రెండు చిట్టిల పేరుమీద రూ.2లక్షల 65వేలు చెల్లించినట్లు తెలిపారు. చిట్టీలో చేరిన రోజు మొదటి నెలలోనే తనకు చిట్టి ఎత్తుకోవచ్చని కమిట్‌మెంట్ ఇచ్చి ఉద్యోగులు ఇవ్వకపోవడంతో 5 నెలలో చిట్టి ఎత్తినట్లు చెప్పారు. కాగా చిట్టి ఎత్తు మూడు నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతోనే తాను ఆగ్రహానికి లోనై సిబ్బందిని కార్యాలయంలోనే ఉంచి తాళం వేశానని స్పష్టం చేశారు. దీనిపై చిట్‌ఫండ్ మేనేజర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

## భూపాల్ రెడ్డి మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు



ప్రజాపక్షం/చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో విద్యానగర్ సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతల భూపాల్ రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన నివాసంలో బాధపడుతూ కన్నుమూశారు. భూపాల్ రెడ్డి పార్థివ దేహం పై పూలమాలలు వేసి సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత వామ పక్ష, ప్రజా ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. భూపాల్ రెడ్డి ప్రజా ప్రతినిధిగా తనదైన శైలిలో ప్రజల పక్షాన నిలబడి అధికారులను నిలదీసి ప్రశ్నించే వారిని గుర్తు చేశారు. ఆయన చూపిన మార్గం పేదల హక్కుల కోసం పోరాటాలు చిరకాలం చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) కేంద్ర నాయకులు చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి, బచ్చన గొని గాలయ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బూరుగు కృష్ణారెడ్డి, సంస్థాన్ నారాయణపురం మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, చౌటుప్పల్ పట్టణ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం, పిల్లి శంకర్, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు తదితరులు పాల్గొన్నారు.

## భార్యను చంపిన వ్యక్తి రిమాండ్



ప్రజాపక్షం/మోతె : అనుమానంతో ఆదివారం రాత్రి కట్టుకున్న భార్యను రోకలిబండతో మోది కడతేర్చిన భర్త కారింగుల వెంకన్న పోలీసుల ముందు లొంగిపోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ టి అజయ్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

# ఆర్‌టిసి కార్మికుల హామీలు అమలు పరచాల్సిందే

### రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు పరచాలని ఆర్‌టిసిని ప్రభుత్వ సంస్థగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం బడ్జెట్ లో రూ.2వేలు కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి అప్పారావులు డిమాండ్ చేశారు. టిజిఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ రీజినల్ కమిటీ ఆధ్వర్యంలో రీజనల్ కౌన్సిల్ సమావేశం మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం మగ్ధూమ్ భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి పాండురంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ ఆర్‌టిసిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా ప్రభుత్వ సంస్థలో పనిచేసే కార్మికులకు సంబంధించిన వేతన సవరణలు చేయకుండా ఆర్‌టిసిలో ఉన్న కార్మిక చట్టాలను అమలు చేయకుండా పనిభారాలు పెంచుతూ తీవ్ర ఒత్తిడికి గురిచేసిందన్నారు.తెలంగాణాలోని ఆర్‌టిసికార్మిక వర్గం మొత్తం గత ఎన్నికల్లో బిఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ని అధికారంలోకి తేవడం జరిగిందని గుర్తు చేశారు.రాష్ట్ర కార్యదర్శులు కెవిఎస్ రెడ్డి, మంగ, బాసాని వెంకటయ్య,పాండురంగయ్య మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికులకు రావాల్సిన 2017 బకాయిలు వెంటనే చెల్లించాలని,2021 వేతన సవరణ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఇటీవలి కాలంలో ఎలక్ట్రికల్ బస్సుల పేరిట చేసే అక్రమ బదిలీలను రద్దు చేయాలని,ఇటీవలి కాలంలో పెంచిన పని భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, రీజినల్ అధ్యక్ష,కార్యదర్శులు కె జమాల్ గౌడ్,ఎన్ఆర్‌సి రాజు,రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నందం, వివిధ డిపో అధ్యక్ష,కార్యదర్శులు వివిఎస్‌రెడ్డి,ఏఎల్ స్వామి, బివైకోటయ్య, సేవియా,సోకం వెంకన్న, కె వెంకన్న, మంజుల, చంద్రకళ, కుమార్,బిమల్లయ్య, సర్దార్, సీతారాములు, నారాయణ పాల్గొన్నారు.

## దేశంలో సిపిఐ చరిత్ర వందేళ్ళ విప్లవ యాత్ర




### సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యల్లావుల రాములు

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : దేశంలో ఎన్నో మార్పులకు కారణమైన వందేళ్ళ విప్లవ చరిత్ర సిపిఐ పార్టీదని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ పట్టణ సమితి సమావేశం జక్కుల రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యల్లావుల రాములు మాట్లాడుతూ సిపిఐ 100 సంవత్సరాల ముగింపు ఉత్సవాలలో భాగంగా రాష్ట్రంలో మూడు ప్రచార జాతాలు జరుగుతున్నాయన్నారు. ఈనెల 15న గద్వాలలో ప్రారంభమైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలనరసింహ ఆధ్వర్యంలోని ప్రచార జాతా నవంబర్ 20న తిప్పర్తి నుండి హుజూర్‌నగర్‌కు చేరుకుంటుందన్నారు. డిసెంబర్ 26న సిపిఐ శతాబ్ధి ఉత్సవాల ముగింపులో భాగంగా ఖమ్మం పట్టణంలో 5లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జడ శ్రీనివాస్, దొంతగాని సత్యనారాయణ గౌడ్, మామిడి వెంకయ్య, జక్కుల రమేష్, జడ వెంకన్న, సుందరి పద్మ, యల్లావుల సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల బారిన పడి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: యువత మత్తుపదార్థాల బారిన పడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో పోలీస్,జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మత్తు మందులు, ఆల్కహాల్ వంటి చెడు వ్యాసనాలకు యువత బానిసలు కావద్దని, ఇవి స్లో పాయిజన్ లాంటివన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, అందువల్ల క్రమశిక్షణతో, ఓపికగా చదువుకోవాలని, మంచి పౌరులుగా ఎదగాలని, చదువుతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాల్సిన అవసరం ఉందని అన్నారు. అడిషనల్ ఎస్‌పి రమేష్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందని, భారత దేశంలో ఎక్కువగా మానవ వనరులు ఉన్నాయని, యువత చెడుగా అలవాటులకు బానిస కావద్దని పిలుపునిచ్చారు.జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపల్ తదితరులు మాట్లాడారు.జిల్లా ఉపవైద్యా ఆరోగ్యశాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, కళాశాల అధ్యాపక బృందం, తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

**జిల్లాలో చిత్తడి నేలల గుర్తించాలి**

సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలో చిత్తడి నేలల గుర్తింపు కార్యక్రమాన్ని శనివారం నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన జిల్లా చిత్తడి నేలల సంరక్షణ,నిర్వహణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల గుర్తింపును పూర్తి చేయాలని, అనంతరం జిల్లా స్థాయి కమిటీ సూచనల మేరకు చిత్తడి నేలల సర్వే, నిర్ధారణ, నోటిఫికేషన్ వంటివి పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపడం జరుగుతుందని ఆమె తెలిపారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్,జిల్లా ఇరిగేషన్ అధికారి నాగరాజు,జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు హాజరయ్యారు.

## నిర్వీర్యమౌతున్న గీత కార్మికుల సొసైటీలు



ప్రజాపక్షం/చిట్యాల: పాలక పక్షాలు గీత కార్మికుల పట్ల అవలంభిస్తున్న వైఖరి కారణంగా గీత కార్మికులకు చెందిన సొసైటీలు నిర్వీర్యమౌతున్నాయని గీత పనివారల సంఘం నల్లగొండ జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 22న జరుగనున్న సదస్సుకు సంభందించిన కరపత్రాలను మంగళవారం గీత కార్మికులతో కలిసి ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడుతూ సొసైటీలకు విడుదల చేయాల్సిన నిధులను ప్రభుత్వం విడుదల చేయడం లేదని అన్నారు. ప్రకృతి పానీయమైన కల్లు, నీరాలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు మద్యం, బెల్ట్ దుకాణాలకు ప్రాధాన్యత కల్పిస్తుందని విమర్శించారు. గీత కార్మికుల సమస్యలపై చర్చించేందుకు నిర్వహించే సదస్సుకు గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సైదులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిద్దెల రామలింగయ్య, బొడిగె బక్కశెట్టి, ఉయ్యాల చంద్రయ్య, మారగోని యాదయ్య, గోపగోని అచ్చాలు, కోయగూర యాదయ్య, నమ్ముల కృష్ణయ్య, గోపగోని శెట్టి, పాలెం జంగయ్య, చెదురుపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



ప్రజాపక్షం/హాలియా: గంజాయి విక్రయిస్తున్న ఒక ముఠాలోని నలుగురు సభ్యులను హాలియా పోలీసులు అరెస్టు చేసినట్లు మిర్యాలగూడ డి.ఎస్.పి రాజశేఖర్ రాజు, హాలియా సీఐ సతీష్ రెడ్డి తెలిపారు. మంగళవారం హాలియా పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి విక్రయిస్తున్న ముఠా వివరాలు వారి తెలిపారు. గంజాయికి అలవాటు పడిన హాలియాకు చెందిన కొందరు యువకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా మాచర్ల కు వెళ్లి అక్కడ గంజాయి సరఫరాదారుల నుండి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు తాము చేసిన విచారణలో తేలిందని వారు చెప్పారు. మాచర్ల కు చెందిన చల్లా చిన్న ఆంజనేయులు అలియాస్ బండ అంజి,చల్లా పెద్ద ఆంజనేయులు అలియాస్ మ్యాక్స్ గుంటూరు ప్రాంతాల నుండి గంజాయి తెచ్చి హాలియాకి చెందిన కొంతమంది యువకులకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రస్తునట్లు హాలియా పోలీసులకు ఖచ్చితమైన సమాచారం రావడంతో హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ సోమవారం పోలీస్ సిబ్బందితో కలిసి ఆల్వాల్ ఎక్స్ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్న వారిపై దాడి చేసి నలుగురు నిందితులను ప్రత్యక్షంగా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మహమ్మద్ రియాజ్ బాబా బైక్ మెకానిక్ గా హాలియాలో పనిచేస్తున్నాడు. సల్ల అజయ్ హాలియాలో సెల్‌ఫోన్ టెక్నీషియన్ గా, షేక్ జిశాన్ హుస్సేన్ హజారిగూడెం కు చెందిన విద్యార్థి కాగా, చల్ల చిన్న ఆంజనేయులు అలియాస్ బండ అంజి మాచర్లలో మేస్త్రగా పనిచేస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు గంజాయి విక్రయిస్తున్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న నిందితులు చల్లా పెద్ద ఆంజనేయులు అలియాస్ మ్యాక్స్, మాచర్ల, అమరవరపు జేమ్స్ పంపు ఆపరేటర్ అలీ నగర్ ( చెక్ పోస్ట్), కేశ మల్ల అంజి డీజే ఆపరేటర్ రెడ్డి కాలనీ హాలియా కు చెందిన వారు పరారీలో ఉన్నట్లు చెప్పారు. పట్టుబడిన వారి దగ్గర నుంచి రూ.30వేలు విలువచేసే 1200 గ్రాముల గంజాయి, పల్సర్ బైక్, నాలుగు మొబైల్ ఫోన్లు, 2000 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. యువత గంజాయి అలవాటు పడి జీవితాలను పాడు చేసుకోవద్దని డి.ఎస్.పి రాజశేఖర్ రాజు సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాలపై జీరో టాలరెన్స్, సేవించి వారి పైన అమ్మే వారి పైన చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆపరేషన్ ను జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తనలో భాగంగా హాలియా సీఐ దేశిడి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ లు దీనిని నిర్వహించినట్లు చెప్పారు. అరెస్ట్ అయిన నిందితులకు వైద్య పరీక్షలు చేయించి అనంతరం రిమాండ్ కు తరలించామని, పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డిఎస్పి తెలిపారు.

## అర్హులకు సంక్షేమ ఫలాలు



ప్రజాపక్షం/దేవరకొండ: అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.మంగళవారం దేవరకొండ నియోజకవర్గంలో ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పారదర్శకంగా, వేగవంతంగా చేరవేయడంలో భాగంగా వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో సీఎం రిలీఫ్ ఫండ్, షాది ముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే బాలు నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా 250 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ. 1 కోటి 18 లక్షల రూపాయల చెక్కులు,షాది ముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల కింద 75 లక్షల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ఎంఆర్వోలు హనుమంతు శ్రీనివాస్ గౌడ్, మధుసూదన్ రెడ్డి,జయశ్రీ,హర్షద్ మహమూద్,ప్రశాంత్, మండల పార్టీ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## కెజిబివిలో అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండ మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ (2)పోస్టుల నియామకానికి మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి (ఎంఈవో)మాత్రు నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుండి 21 వ, తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు.దరఖాస్తు చేసుకునే మహిళా అభ్యర్థులు 7వ, తరగతి ఉత్తీర్ణత పత్రము, మార్కుల మెమో తోపాటు వంటలో అనుభవం కలిగిన పత్రాలను దేవరకొండ ఎంఆర్సీ లో అందజేయాలనీ పేర్కొన్నారు.

## సూర్యాపేట జిల్లావాసికి అంతర్జాతీయ గుర్తింపు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం విద్యా విభాగానికి చెందిన డాక్టర్ రావుల కృష్ణయ్య పరిశోధక విద్యార్థిని సాక్షి సంయుక్తంగా చేసిన పరిశోధనకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. కృష్ణయ్య రూపొందించిన పరిశోధనా పత్రం, జర్మన్ కమీషన్ ఫర్ యునెస్కో, జర్మన్ రెక్టర్స్ కాన్ఫరెన్స్ సంయుక్తంగా జర్మనీలోని హానోవర్ నగరంలో నవంబర్ 1921 మధ్య నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో సమర్పణకు ఎంపికైంది. డాక్టర్ కృష్ణయ్య ఈ సదస్సులో హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి ప్రాతనిధ్యం వహించను న్నారు. పరిశోధన నాణ్యతను గుర్తిస్తూ నిర్వాహకులు 600 యూరోల గ్రాంట్ మంజూరు చేశారు. సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని యంవి సింగారం గ్రామంలో పుట్టిన ఆయన ఎన్నో కష్టనష్టాలను పేదరి కాన్ని అధిగమిస్తూ పశువుల కాపరిగా, సెక్యూరిటి గార్డుగా, విద్యావాలం టీర్‌గా పనిచేస్తూ డిగ్రీ, పిజి, పిహెచ్‌డి పూర్తి చేశారు. నేడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎదిగిన డాక్టర్ కృష్ణయ్య సాధించిన ఈ విజయం అనేక మందికి ప్రేరణగా నిలుస్తోంది. ఆయనకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల పలువురు ప్రముఖులు, జిల్లా ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

## గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి

### కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి

ప్రజాపక్షం/మునగాల: గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కృష్ణానగర్ గ్రామ నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో కృష్ణానగర్ గ్రామంలో ఇప్పటి వరకు 40 లక్షలకు పైగా అభివృద్ధి పనులు చేశామని, ఇంకా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయానికి స్థలం ఇచ్చిన దాత బేతం లక్ష్మారెడ్డి సుమారు 10 లక్షల రూపాయల విలువగల భూమిని విరాళంగా అందజేసినందుకు ఎమ్మెల్యే దాతను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్ సరిత, ఎంపిడివో రమేష్ దీన్‌దయాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పుల జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



## సుశీలమ్మ ఫౌండేషన్‌తో అధునాతన సౌకర్యాలు

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : మన సొంత ఇల్లు కట్టుకునే సమయంలో ఎంత శ్రద్ధగా జాగ్రత్తలు తీసుకుంటామో, విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే పాఠశాలల భవనాలు కట్టే సమయంలో అంతే శ్రద్ధగా జాగ్రత్తగా కట్టాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అధికారులతో మాట్లాడారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలకు వెంటనే ప్రత్యేకమైన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. సంస్థాన్ నారాయణపురం కస్తూరిబా బాలికల పాఠశాల నూతన బిల్డింగ్ ఆధునిక వసతుల కల్పనపై చౌటుప్పల్‌లోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారుల సమీక్షలో తరగతి గదిలో విద్యార్థులు ఏకాగ్రతతో శ్రద్ధగా చదవాలంటే మెరుగైన సదుపాయాలు ఉండాలనే ఆలోచనతో తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. దాంట్లో భాగంగానే మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో 1.50 కోట్ల రూపాయల సొంత నిధులతో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించారు. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలలో కూడా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నారు. ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) సత్యనారాయణ, చౌటుప్పల్ ఎంఈఓ గురువారెడ్డి, డిఈ శివ కుమార్, కాంట్రాక్టర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## పత్తి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం

జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల మార్కెట్ యార్డుకు వచ్చే పత్తి రైతులకు అన్ని విధాల న్యాయం జరిగే వరకు డిఆర్ఎస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య అన్నారు. మంగళవారం నాడు జడ్చర్ల కట్టర్ మార్కెట్లో ఆయన పత్తి రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కారానికి మీ వెంటే ఉంటామని హామీ ఇచ్చారు. గతంలో 12 క్వింటాలు కొనుగోలు చేసే పత్తిని కుదించడం సరైనది కాదని తేమశాతాన్ని ఇంకా తగ్గించడం అన్యాయమని ఆయన మండి పడ్డారు. రైతు ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అన్యాయాన్ని తిప్పి కొట్టేందుకు బిఆర్ఎస్ పార్టీ ముందుకొచ్చిందని రైతులందరూ ధైర్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ చందర్, శంకర్ నాయక్, శ్రీశైలం యాదవ్, కరాటే శ్రీను, ఇంతియాజ్, పరమటయ్య బికె రెడ్డి పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నిరోధానికి కృషి

అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**ప్రజాపక్షం/నారాయణపేట్:** మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణపేటలోని ఎస్.ఆర్.గార్డెన్‌లో జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్ సమక్షంలో అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు అందరూ కలిసి మాదకద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ ఏ ఒక్కరు కూడా డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వారు సూచించారు. గంజాయి తోపాటు ఇతర మత్తు పదార్థాల అమ్మిక కొనుగోలు చేసిన అక్రమ రవాణా చేసిన ఆ వ్యక్తుల సంబంధించిన సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్ డి.పి.ఆర్.ఓ. రషీద్ పలు విభాగాల ఉద్యోగులు టీచర్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 6వ జాతీయ జల అవార్డులలో మహబూబ్‌నగర్ జిల్లాకు అవార్డు



కేంద్ర జల శక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న కలెక్టర్ విజయేందిర బోయి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** జల్ సంచయ్ జన్ భాగీదారీ 1.0 విభాగంలో జాతీయ స్థాయిలో 3వ కేటగిరి నందు మహబూబ్‌నగర్ జిల్లా మూడవ స్థానంలో నిలిచింది. మంగళవారం న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరైన కార్యక్రమంలో కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ చేతుల మీదుగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి డిఆర్‌డిఓ నర్సింహులు పురస్కారంలు అందుకున్నారు. 25 లక్షల నగదు బహుమతి లభించింది. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్ కింద చేపట్టిన జల్ సంచయ్ జల్ భాగీదారీ జేఎస్పీ పథకం 2024–25 సంవత్సరంలో డీఆర్డీఓ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా జల సంరక్షణ పనులు చేపట్టారు. జల సంరక్షణ కోసం చేపట్టిన ఈ పనుల్లో అత్యధికంగా పనులు చేసినందుకు గాను మహబూబ్‌నగర్ జిల్లాకు కేంద్ర ప్రభుత్వం అవార్డు ప్రకటించింది. జిల్లాకు పురస్కారం రావడానికి కృషి చేసిన అధికారులు, ప్రజలు సహకారం, అందించిన ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాకు పురస్కారం లభించడం పట్ల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

## రైతుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్న లారీ డ్రైవర్లు




**ప్రజాపక్షం/మాగనూర్ :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వానికి అమ్ముకోని మిల్లులకి ధాన్యాన్ని తరలించాలన్న రైతుల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్న లారీ డ్రైవర్లు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీ డ్రైవర్లు రైతుల నుండి డబ్బులు భారీగా డిమాండ్ చేస్తు వసులు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోతే లారీలో లోడ్ చేసిన ధాన్యాన్ని తరిగి కింత వేసి వెళ్లిపోయిన ఘటన మంగళవారం మాగనూర్ మండల పరిధిలోని నల్ల గట్టు దగ్గర చోటుచేసుకుంది. మాగనూర్ గ్రామానికి చెందిన రాకేష్ రెడ్డి తన వడ్లను కొనుగోలు సెంటర్ నుండి మిల్లుకు తరలించడానికి లారీని తెప్పించుకున్నాడు. లారీ డ్రైవర్ రాకేష్ నుండి మూడు వేలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సదరు రైతు చూద్దాంలే అని, పిఎసిఎస్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. డబ్బులు ఇవ్వకపోతే నా లారీలో లోడ్ చేయొద్దని లారీలో లోడి చేసిన పది సంచల వడ్లను మళ్లీ కిందపడేసి కాలి లారీ సెంటర్ నుండి బయటకు వెళ్లినట్లు తెలిపారు. రైతుల నుండి డబ్బులు డిమాండ్ చేసి లారీ డ్రైవర్లు వసూళ్లకు పాల్పడుతున్న విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. రైతులతో డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తుల పై కఠినంగా వ్యవహరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. డబ్బులు ఇవ్వకపోతే లారీలో ఉన్న వడ్ల బస్తాలను ఖాళీ చేసి వెళ్లిన లారీ డ్రైవర్‌పై అధికారులు ఏ విధంగా చర్యలు తీసుకుంటారో చూడాలి.

## రెండు నెలలుగా పెండింగ్ వేతనాలు

వెంటనే చెల్లించాలని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్‌కి వినతి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ తక్షణమే రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ఆసుపత్రి బ్రాంచ్ గోపాల్ నాయక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ జీతాలు, ఇతర సమస్యలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరకి వినతిపత్రం ఇచ్చి చర్చించారు. ఈ సందర్భంగా గోపాల్ నాయక్ మాట్లాడుతూ ఆసుపత్రిలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సకాలంలో వేతనాలు అందక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దసరా, దీపావళి పండుగలకు కూడా వేతనాలు అందలేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగా అజ్మీర ఆదేశాల ప్రకారం దసరా పండుగకు ఏజెన్సీ యాజమాన్యం అడ్వాన్సు రూపేనా కొంత మేర చెల్లించిందని అన్నారు. వేతన బడ్జెట్ ఉన్న కార్మికులకు వేతనాలు రావడం లేదని అన్నారు. జీతాలు రాక పిల్లల ఫీజులు ఇంటి అద్దెలు నెలవారి ఈఎంఐలు చెల్లించలేక జీవనం దుర్భరమైపోతుందని అన్నారు. కనుక తక్షణమే పెండింగు జీతాలు చెల్లించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ నేతలు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కర్ణ, కామేష్, బుచ్చన్న, మురళి, శివ కుమార్, బాలకృష్ణ, యం.రఘు, రవి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీకి థర్డ్ వైర్ సమస్య తీరదా?

**ప్రజాపక్షం/ మక్తల్ :** విద్యుత్ ఆదా చేయాలని ప్రభుత్వాలు ఎంత మొత్తుకున్నా మక్తల్ మున్సిపాలిటీకి గత రెండేళ్లుగా వినపడడం లేదు. ఏం అని ఆశ్చర్యపోతున్నారా..! నిజమే మక్తల్ పట్టణంలో గత రెండేళ్లుగా కొన్ని.. కాదు చాలా కాలనీలో పట్టపగలు విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. దాంతో మున్సిపాలిటీకి నెలనెలా లక్షల్లో డబ్బు వృధా అవుతోంది. సమస్య పరిష్కారానికై అధికారులను సంప్రదిస్తే సమస్య నియంత్రించేందుకు త్రీఫేస్ లైటింగ్ అంటే థర్డ్ వైర్ లేదా టైమర్ లేదా సెన్సార్ ఆధారిత పరికరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. విద్యుత్ ఏఈ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ల మధ్య సమన్వయం లోపం థర్డ్ వైర్ గుత్తేదారును గట్టిగా అడగకపోవడం సమాస్య జటిలం కావడానికి కారణమని తెలుస్తోంది. ఎందుకు నీరు గుత్తేదారులకు భయపడుతున్నారో అర్థం కాని ప్రశ్న. ఏది ఏమైనా మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అసలు 24 నెలలుగా లైట్లు వెలుగుతుంటే విద్యుత్ కాంట్రాక్టర్, థర్డ్ వైర్ కాంట్రాక్టర్ ఏం చేస్తున్నారు..? అసలు వారు ఉన్నరా.? తమ కాంట్రాక్ట్ రద్దు చేసుకున్నారా..? అనేది మున్సిపల్, విద్యుత్ అధికారులు తెలపాల్సినా అవసరం ఉంది.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/వీపనగండ్ల/పానుగల్:** రైతులు పండించిన పంటలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రాత్రి బొల్లారం, వీపనగండ్ల, గోవర్ధనగిరిలో మహిళ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకూడదనే ఉద్దేశ్యంతో పండించిన పంటకు మద్దతు ధర అందిస్తూ గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఏ గ్రేడ్ వడ్లకు 2,389 రూపాయలు, కామన్ గ్రేడ్ రకానికి 2,369 రూపాయలు మద్దతు ధర ప్రకటించడం జరిగిందని, అంతేగాక సన్న రకం ధాన్యానికి క్వింటాలు 500 రూపాయలు బోనస్ కూడా అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సుబ్రహ్మణ్యం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోదల బీరయ్య, వనపర్తి జిల్లా ఎంపిటిసిల ఫోరం మాజీ అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, పార్టీ సీనియర్ నాయకులు రావుల నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, బాల్ రెడ్డి, గోపి, రవీందర్ రెడ్డి, మహిళా సమైక్య మండల అధ్యక్షురాలు ఎత్తం చిట్టెమ్మ, ఏపిఎం మద్దిలేటి ఉన్నారు.

**లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకోవాలి**

ప్రజా రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం పానుగల్ మండలం కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, మాధరావు పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి హాజరయ్యారు. పానుగల్ నుండి శాగాపూర్ మీదుగా కదిరేపాడు వరకు బీటీ రోడ్డు పనులకు మూడు కోట్ల పది లక్షల రూపాయలు నిధులు మంజూరు కావడంతో పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, ఆర్‌డిఓ సుబ్రమణ్యం, ఎంపిడీఓ గోవిందరావు, తహశీల్దార్ సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవి, విండో వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధు సూధన్ రెడ్డి, నాయకులు రాము యాదవ్, బ్రహ్మం, పుల్లారావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సురేఖ, రాము యాదవ్, ఎపిఎం వెంకటేష్, ఎఓ మణి చందర్, వివిధ శాఖల సిబ్బంది, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత దేశంగా రూపొందించాలి




జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** దేశ పౌరులంతా కలిసి కట్టుగా డ్రగ్స్‌కు దూరంగా ఉండటం ద్వారా డ్రగ్స్ రహిత దేశంగా రూపొందించడం సాధ్యమవుతుందని జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డి.ఇందిరా పిలుపునిచ్చారు. మంగళవారం జయప్రకాశ్ నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అనే ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసి ఆమె ప్రసంగించారు. డ్రగ్స్ రహిత సమాజానికి అందరం పూనుకోవాలని, డ్రగ్స్ వలన జరిగే అనర్థాలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. డ్రగ్స్ వినియోగం ద్వారా వచ్చే దుష్ఫలితాలు విద్యార్థుల జీవితాలు నాశనం చేయడంతో పాటు, వారి కుటుంబాలను సంక్షోభంలో నెట్టి వేస్తుందని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల చైర్మన్ కె.ఎస్.రవి కుమార్ మాట్లాడుతూ యువతకు ప్రధాన శత్రవు మాదక ద్రవ్యాలు అని వాటికి దూరంగా ఉంటూ తమ భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి జరీనా బేగం మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజానికి దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ డ్రగ్స్ రహిత సమాజానికి దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి నిఖిల, సిడిపిఓ సైలశ్రీ, ఎక్సయిజ్, సూపరిండెంట్ సుధాకర్, యన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ కెకెఎస్ మార్వెల్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, రూరల్ సిఐ గాంధీ నాయక్, ఎక్సైజ్ సిఐ వీరారెడ్డి, మహిళా పోలీసు స్టేషన్ సిఐ శ్రీనివాస్, సంకల్ప సంస్థకు చెందిన తిరుపతిరావ్, కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వి.ఈ చంద్రశేఖర్, కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశస్థాయిలో యువత రాణించాలి



కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** విద్యార్థులు, యువతీ యువకులు చదువుతో పాటు వివిధరకాల కళల్లోను రాణించాలని ప్రతి విద్యార్థి విద్యతోపాటు , జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో తమ కలలతోపాటు జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సాయిగార్డెన్స్‌లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జిల్లా యువజన క్రీడలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలను కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలోను ఏదో ఒకరకంగంలో ప్రతిభ దాగి ఉంటుందని, దానిని వెలికితీసి అభివృద్ధిచేస్తే భవిష్యత్తు మరింత బంగారుమయం అవుతుందన్నారు. అనంతరం నర్సింగ్ కళాశాల, పలు పాఠశాలలు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలను సందర్శించి విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలించారు. హిమోడయాలసిస్ విధానంపై విద్యార్థిని షాహిన్ ఇచ్చిన ప్రజెంటేషన్ ఆయనను ఆకట్టుకుంది. పల్లెటూరి పల్లకిలో గేయానికి విద్యార్థులు చేసిన నృత్యాలను తిలకించి వారిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సీతారాంనాయక్, జిల్లావిద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్, జిల్లా డిఎంహెచ్‌ఓ డాక్టర్ రవినాయక్, జిల్లాసైన్స్ అధికారి రాజశేఖర్‌రావు, తహసీల్దార్ తబితారాణి, వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

**మాదకద్రవ్యాల వినియోగంతో సమాజానికి, కుటుంబ గౌరవానికి చేటు :** మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి , కుటుంబానికి వ్యక్తిగత జీవితానికి ఎంతోచేటని, డ్రగ్స్‌రహిత సమాజంకోసం యువత పూర్తిస్థాయిలో అవగాహనతో ఉండాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. నషాముక్తిభారత్ అభియాన్ ముగింపు కార్యక్రమం సందర్భంగా మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లాప్రభుత్వ మెడికల్ కళాశాలలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నషాముక్త్‌భారత్ అభియాన్ ప్రారంభమై 5సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో గంజాయిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలన్నారు. జిల్లాకేంద్రంలో డిఅడిక్షన్‌సెంటర్ ద్వారా అవగాహన కల్పిస్తూ మత్తు విముక్తికి వైద్యం అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, జిల్లామహిళా శిశుసంక్షేమశాఖ అధికారిణి రాజేశ్వరి, డిఇఓ రమేష్‌కుమార్, పిడి డిఆర్‌డిఎ చిన్న ఓబులేసు, బిసివెల్ఫేర్ ఆఫీసర్ యాదగిరి, ట్రైబల్‌వెల్ఫేర్ అధికారి ఫిరంగి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి ఉమాపతి, వివిధశాఖల అధికారులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జలమండలికి ప్రతిష్టాత్మక కేంద్ర ప్రభుత్వ పురస్కారం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఎం.డి.అశోక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జల సంరక్షణలో విశేష కృషి చేస్తున్న జలమండలికి మరో అరుదైన గౌరవం దక్కింది. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో, 'టాప్ మున్సిపల్ కార్పొరేషన్' కేటగిరీలో హైదరాబాద్ జలమండలి దేశంలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 'జల్ సంచయ్ జన భాగిదారి (జెఎస్‌జెబి) 1.0' అవార్డును సొంతం చేసుకుంది. న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు కింద ప్రశంసా పత్రంతో పాటు రూ. 2 కోట్ల నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. నీటి పట్ల గౌరవాన్ని పెంచిన జలమండలి కేవలం నీటిని పొదుపు చేయడమే కాకుండా, ప్రజల ప్రవర్తనలో మార్పు తీసుకురావడంలో జలమండలి కీలక పాత్ర పోషించిందని కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రశంసించింది. జెఎస్‌జెబి పరిధిలో కమ్యూనిటీ ఆధారిత నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించడం ద్వారా 'వాటర్ పాజిటివ్ యాక్షన్'ను ప్రేరేపించి, నీటి పట్ల ప్రజల్లో ఉన్న గౌరవాన్ని తిరిగి పెంపొందించిందని కొనియాడింది.

**సమిష్టి కృషితోనే విజయం : ఎం.డి. అశోక్ రెడ్డి**

అవార్డు స్వీకరించిన అనంతరం ఎం.డి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విజయం బోర్డు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితమేనని అన్నారు. జలమండలిపై నమ్మకం ఉంచి ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకారం అందిస్తున్న హైదరాబాద్ ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో నీటి ఎద్దడి గండం తప్పించేందుకే 'ఇంకుడు గుంతల' ఉద్యమం హైదరాబాద్ మహానగరం శరవేగంగా విస్తరిస్తోందని చెప్పారు. లాతూర్ తరహా నీటి ఎద్దడి హైదరాబాద్‌లో రాకుండా ఉండేందుకు, సరిగ్గా ఏడాది క్రితం అక్టోబర్ 2న సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు 'ప్రతి ఇంటా ఇంకుడు గుంత 90 డేస్ స్పెషల్ డ్రైవ్' కార్యక్రమాన్ని ప్రారంభించి ఒక యజ్ఞంలా కొనసాగిస్తున్నట్లు వివరించారు.

# పార్టీపరంగా ఇచ్చే 42 శాతం మాకొద్దు

బిసిలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం

బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పార్టీపరంగా ఇచ్చే బిసి రిజర్వేషన్ల భిక్షను బిసి సమాజం అంగీకరించబోదని బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో బిసి జెఎసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేసిన తర్వాతనే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలను ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామని హెచ్చరించారు. సోమవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని, బిసి రిజర్వేషన్లు చట్టబద్ధంగా కాకుండా పార్టీ పరంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రకటనను తెలంగాణ రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసిలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకొని అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడాకపోతే రాష్ట్రంలో అగ్గి పుట్టిస్తామని హెచ్చరించారు. బిసి రిజర్వేషన్ల అంశంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్ పార్టీ అయితే, రెండవ ముద్దాయి బిజెపి పార్టీ అని, ఈ రెండు పార్టీలను బిసి ద్రోహులుగా ప్రకటించి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసిల ఆకాంక్షల కంటే రాష్ట్ర ప్రభుత్వానికి 3000 కోట్లే ప్రాధాన్యతనుకుంటే, రాష్ట్రంలోని మూడు కోట్ల మంది బిసిలను ఒక్కొక్క రూపాయి బిక్షం అడిగి అయినా రూ. 3000 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తామని, కానీ సర్పంచ్ ఎన్నికలు మాత్రం నిర్వహించి బిసిలకు ద్రోహం తలపెట్టవద్దని ఆయన సూచించారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటే తెలంగాణలో జరిగిన కులగనన ఆధారంగా 60 శాతం అయినా ఇస్తామని ప్రకటించాలి కదా? అని ఆయన ప్రశ్నించారు. బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిసి జెఎసి చీఫ్ కో ఆర్డినేటర్ గుజ్జ కృష్ణ, కోఆర్డినేటర్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయుల కోసం పాఠశాలకు తాళం వేసిన గ్రామస్తులు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా తాము ప్రభుత్వ పాఠశాలలు నడుపుతామని ప్రభుత్వం ఒకవైపు ప్రచారంచేస్తుంటే ఉపాధ్యాయులులేక విద్యార్థులు వీధుల్లో తిరుగుతుంటే గ్రామస్తులు పాఠశాలకు తాళం వేసి ధర్నా చేస్తున్న సంఘటన పదర మండలం ఇప్పలపల్లిలో జరిగింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. ఇప్పలపల్లి, గానుగుపెంట ఈరెండు గ్రామాలకుకలిపి మండలస్థాయి ప్రాథమికోన్నత పాఠశాలకలదు. ఈపాఠశాలలో 110మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో ముగ్గురు స్కూల్ అసిస్టెంట్లు, నలుగురు ఎస్‌జిటిలు మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు ఉండేవారు. ఇందులో ఒకరు విద్యాసంబంధిత సెలవు అనివెళ్లారు. మండల ఎంఈఓ రెండునెలల క్రితం పని సర్దుబాటు అనేనెపంతో మద్దిమడుగు సమీపంలోని మద్దిమడుగు గ్రామానికి ఇద్దరు ఉపాధ్యాయులను పంపించారు. మరో ఉపాధ్యాయురాలిని మారడుగు గ్రామానికి పంపించగా ఒక ఉపాధ్యాయుడు అనారోగ్యకారణాల వలన సెలవులో వెళ్లారు. ప్రస్తుతం 110మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండటంతో విద్యార్థులకు చదువు చెప్పడంలేదు. దీంతో విద్యార్థులు వీధిన తిరుగుతుండటంతో విధిలేక పాఠశాలకు తాళంవేసినట్లు గ్రామస్తులుతెలిపారు. ఈవిషయంపై గతంలో ఎంఈఓ, డిఇఓకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు.

## వరి కోత యంత్రంలో పడి వ్యక్తి మృతి

పరామర్శించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్/పెబ్బేరు:** వనపర్తి మండలం అంకుర్ గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రమాదవశాత్తు వరి కోత యంత్రంలో పడి మృతి చెందారు. మంగళవారం ఉదయం వనపర్తి శాసనసభ్యులు మేఘారెడ్డి మార్చ్యురీ వద్ద కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో సాగుచేసిన వరి పంటను కోస్తుండగా ట్రాక్టర్‌పై కూర్చున్న శ్రీనివాస్ రెడ్డి కిందకు దిగే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు జారి వరి కోత యంత్రంలో పడి మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ప్రభుత్వ పరమైన ఆర్థిక సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పరామర్శలో వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, నారాయణరెడ్డి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యంకొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి**



ఉమ్మడి పెబ్బేరు మండలంలో పలు గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను, నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశాలను, నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని, ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఉమ్మడి పెబ్బేరు మండలంలో కంచిరావుపల్లి తాటిపాముల కంబలాపురం నాగసానిపల్లి, పాతపల్లి, గుమ్మడం తండాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి తమ ధాన్యాన్ని అమ్ముకోవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం తాలు లేకుండా 17 శాతం తేమతో తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో మాత్రమే అమ్ముకోవాలని సన్న ధాన్యానికి 500 రూపాయల బోనస్ కూడా రైతులకు లభిస్తుందని ఎమ్మెల్యే రైతులకు విజ్ఞప్తి చేశారు. పాతపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని, పెబ్బేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు గదుల ప్రారంభోత్సవాన్ని, స్వయం ఉపాధితో ప్రారంభించిన చిన్న తరహా పరిశ్రమను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని, వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రాథమిక సహకార సంఘ అధ్యక్షుడు కోదండరామిరెడ్డి, జగన్నాథం నాయుడు తో పాటు ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## బండా సురేందర్ రెడ్డి మృతి పట్ల సిపిఐ, సిపిఐ(ఎం) సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సీనియర్ నాయకులు బండా సురేందర్ రెడ్డి మృతి పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఆయన మృతి తీవ్రంగా కలిచి వేసిందన్నారు. తక్కువ వయసులోనే అనారోగ్యానికి గురై మరణించడం బాధాకరమని, ఆయన కుటుంబ సభ్యులకు కూనంనేని సాంబశివరావు సానుభూతిని తెలియజేశారు.

ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్ రెడ్డి మరణం బాధాకరమని, వామపక్ష శ్రేణులకు, కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు అని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సురేందర్ రెడ్డి జాతీయ కార్యదర్శిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని, వామపక్షాలు చేపట్టిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు జాన్‌వెస్లీ తన ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

# క్రీడ



## ఒమన్‌తో మ్యాచ్
### టీమిండియా–ఎ లక్ష్యం 136

ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో రెండో విజయంపై కన్నేసిన భారత్–ఎ జట్టు ఒమన్‌ను తక్కువకే కట్టడి చేసింది. ఆరంభంలో ఓపెనర్ హమ్మద్ మిర్జా(32) మెరుపులు విజయకుమార్(1–34) చెక్ పెట్టగా.. మిడిల్ ఓవర్లలో సుయాష్ శర్మ (2–12) పొదుపుగా బౌలింగ్ చేశాడు. అయితే.. ఓవైపు వికెట్లు పడుతున్నా వసీం అలీ(54 నాటౌట్) కెరీర్లో తొలి టీ20 అర్ధ శతకంతో జట్టును ఆదుకున్నాడు. ఫలితంగా ఒమన్ నిర్ణీత ఓవర్లో 135 పరుగులు చేసింది. పాక్ చేతిలో కంగుతిన్న టీమిండియా స్వల్ప లక్ష్యాన్ని ఊదిపడేయాలంటే టాపార్డర్ చెలరేగాల్సిందే. దోహాలో టాస్ ఓడిన ఒమన్–ఎ పోరాడగలిగే స్కోర్ చేసింది. ఓపెనర్లు హమ్మద్ మిర్జా (32), కరన్ సోనవాలే(12)లు పవర్ ప్లేలో భారత ఏ బౌలర్లను ఉతికేస్తూ శుభారంభమిచ్చారు. నాలుగో ఓవర్లో హమ్మద్ వికెట్ తీసిన విజయ్ కుమార్ (1–34)భారత్‌కు తొలి బ్రేకిచ్చాడు. కాసేపటికే కరన్‌ను సుయాష్ శర్మ(2–12) బౌల్డ్ చేశాడు. రెండు వికెట్లు పడినా సరే నారాయణ్ సాయిశివ(16) సాయంతో వసీం అలీ(54 నాటౌట్) స్కోర్ బోర్డును నడిపించాడు. భారత ఫీల్డర్ల వైఫల్యం కూడా ఒమన్ బ్యాటర్లకు కలిసొచ్చింది. సాయిశివ, ఆర్యన్ బిష్ట్(4) అండతో వసీం స్కోర్ 120 దాటించాడు. 19వ ఓవర్లో సింగిల్ తీసి టీ20ల్లో మొట్టమొదటి హాఫ్ సెంచరీ సాధించాడు. గుర్జప్‌నీత్ సింగ్ చివరి ఓవర్లో రెండు వికెట్లు తీయడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది.

## టెస్టు క్రికెట్ చరిత్రలో తొలిసారి!

సాధారణంగా టెస్టు మ్యాచ్‌లోనైనా లంచ్ బ్రేక్ తర్వాత టీ విరామం ఉంటుంది. కానీ, నవంబర్ 22 నుంచి గువాహటిలో భారత్, సౌతాఫ్రికామధ్య జరగనున్న రెండో టెస్టులో ఇది ఇంకాస్త విభిన్నంగా ఉండబోతోంది. ఇక్కడ తొలుత టీ బ్రేక్ ఇచ్చిన తర్వాత భోజన విరామం ఉంటుంది. పగటిపూట జరిగే టెస్టుల్లో ఇలా జరగడం ఇదే తొలిసారి. గువాహటిలోని వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ మార్పులు చేశారు. ఈశాన్య భారతదేశంలోని గువాహటిలో శీతాకాలంలో సూర్యోదయం, సూర్యాస్తమయం చాలా తొందరగా జరుగుతాయి. అక్కడ సాయంత్రం నాలుగు గంటలకే వెలుతురు తగ్గిపోతుంది. అందుకని అరగంట ముందుగానే మ్యాచ్ ప్రారంభించనున్నారు. ఉదయం 8.30 గంటలకు టాస్ వేస్తారు. 9 గంటల నుంచి 11 గంటల వరకు తొలి సెషన్ తర్వాత 20 నిమిషాల టీ బ్రేక్ ఉంటుంది. తర్వాత రెండో సెషన్ మధ్యాహ్నం 1.20 వరకు కొనసాగుతుంది. 40 నిమిషాల లంచ్ బ్రేక్ తర్వాత చివరి సెషన్ మొదలై సాయంత్రం 4 గంటలకు వరకు జరుగుతుంది. అంతేకాదు, గువాహటి స్టేడియం టెస్టు మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక, కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టులో భారత్ ఓటమిపాలైంది. గువాహటి టెస్టులో గెలిచి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 11 ముగించాలనే పట్టుదలతో ఉంది.

## ప్రతిరోజూ విజయం సాధించలేం..
### టీమ్‌లో ఎవరికి పతకం వచ్చినా సంతోషమే : మను భాకర్



పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలతో వార్తల్లో నిలిచిన మను భాకర్ మళ్లీ ఆ స్థాయిలో రాణించలేకపోతోంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో పతకాల వేట కొనసాగిస్తుందనుకుంటే అనూహ్యంగా ఖాళీ చేతులతో నిష్క్రమిస్తోంది. తాజాగా ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భాకర్ నిరాశపరిచింది. కైరో వేదికగా జరిగిన టోర్నీలో విఫలమైన మను ఓటమిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఎవరైనా ప్రతి రోజూ విజయం సాధించలేరు, ఈ పరాజయం నుంచి చాలా నేర్చుకున్నాను అని అంటోంది విశ్వ విజేత. ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో పతకం సాధించేలా కనిపించిన మను భాకర్ ఫైనల్లో తేలిపోయింది. ర్యాపిడ్ ఫైరింగ్ క్వాలిఫికేషన్‌లో 586 పాయింట్లు సాధించి టాప్‌లో నిలిచిన ఆమె.. ఫైనల్లో గురి తప్పింది. కేవలం రెండు సార్లు మాత్రమే లక్ష్యాన్ని ఛేదించి నిరాశపరిచింది. తన ఓటమిపై స్పందించిన ఆమె.. 'వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో పతకంతో లక్ష్యంగా పెట్టుకున్నాను. కానీ, మెరుగైన ప్రదర్శన చేయలేదు. మంచి స్కోర్ సాధించినా.. పోడియం మీద నిల్చోలేకపోయాను. నా టీమ్మేట్ ఇషా పతకం సాధించింది. క్రీడల్లో మనం ప్రతిసారి, ప్రతిరోజు గెలవలేం. కొన్నిసార్లు ఓడిపోతాం కూడా. నావరకైతే ఈ పోటీల్లో భారత్‌కు పతకం రావడమే ముఖ్యం. ఆ మెడల్ నేను సాధించినా.. మరొకరు గెలిచినా సంతోషమే. అందుకే ఇషా విజయాన్ని నేను ఎంజాయ్ చేస్తున్నా. ఏ స్పోర్ట్స్‌లో అయినా ఇలానే ఉండాలి. ఇక ద్వితీయార్థంలో అత్యుత్తమ ప్రదర్శన ఎంతో మెచ్చుకోతగినది. వైకల్యాన్ని ఎదిరించి విశ్వ వేదికపై సత్తా చాటుతున్న వాళ్లు మనసందరికి స్ఫూర్తిదాయకం' అని వెల్లడించింది. ఇదే పోటీల్లో తెలంగాణ షూటర్ ఇషా సింగ్ సత్తా చాటి కాంస్యం కైవసం చేసుకుంది.

**విశ్వక్రీడల్లో 2 కాంస్యాలతో**

ఒలింపిక్స్ పతకం కోసం సుదీర్ఘ సాధన చేసిన మను భాకర్ నిరుడు తన కల నిజం చేసుకుంది. మాజీ షూటర్, కోచ్ జస్పాల్ రాణా శిక్షణలో రెండు కాంస్యాలతో చరిత్ర తిరగరాసింది. పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ దేశం తరఫున పతక బోణీ కొట్టింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మహిళల వ్యక్తిగత విభాగంలో కంచు మోత మోగించింది. ఆ తర్వాత సరబ్‌జోత్ సింగ్ జతగా.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్లోనూ సత్తా చాటిన ఆమె దేశానికి రెండో కాంస్యం అందించింది. దాంతో, ఒకే విశ్వక్రీడల్లో రెండు కాంస్యాలతో చరిత్ర పుటల్లో నిలిచింది మను. అయితే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో ఆమె గన్ అంతగా పేలలేదు. ఒలింపిక్ ఛాంపియన్‌గా మరిన్ని పతకాలు పట్టేస్తుందనుకుంటే.. తను మాత్రం ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్స్ లోనూ కాంస్యంతో సరిపెట్టుకుంది.

# ఫోకస్ — మహిళ

మహిళల్లో రొమ్ము లేదా బ్రెస్ట్ కేన్సర్ కేసులు ఇటీవల కాలంలో క్రమంగా పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. స్తనాల్లో ఉండే కణాలు అసాధారణంగా పెరుగుతూ, నియంత్రణ లేకుండా విస్తరించడం వల్ల ఈ కేన్సర్ వస్తుంది. ఇది మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే కేన్సర్‌లలో ఒకటి, కానీ ప్రారంభ దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు.

## పెరుగుతున్న బ్రెస్ట్ కేన్సర్ కేసులు





బ్రెస్ట్ కేన్సర్‌కు ఫలానా కారణం అని చెప్పడం కష్టం. అయితే, కొన్ని అంశాలు బ్రెస్ట్ కేన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. 40 ఏళ్లకు పైబడిన మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వంశపారంపర్యం సోకే అవకాశం కూడా ఉంది. ఎస్ట్రోజెన్ హార్మోన్ అధిక స్థాయిలో ఉండడం కూడా కేన్సర్ కారకంగా పేర్కొంటారు. ఆహారం, జీవనశైలి సైతం కేన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం లేకపోలేదు. ప్రత్యేకించి అధిక కొవ్వు ఆహారం, వ్యాయామం లేకపోవడం, మద్యపానం, పొగ తాగడం కూడదు. పిల్లలు ఆలస్యంగా కనడం లేదా పిల్లలు లేని మహిళల్లో ఈ సమస్య ఎక్కువ. బ్రెస్ట్ కేన్సర్ ప్రారంభ దశలో చాలా సార్లు నొప్పి లేకుండా ప్రారంభమవుతుంది. కాబట్టి ముందు జాగ్రత్తగా కొన్ని అంశాలను జాగ్రత్తగా గమనించాలి. బ్రెస్ట్ ఆకారం మారడం, గడ్డలు ఏర్పడడం, ఆ ప్రాంతంలో చర్మం మందంగా మారడం లేదా ముడతలు పడడం, స్తనాల నుంచి ద్రవం (ప్రత్యేకించి రక్తం) కారడం, నొప్పి, వాపు వంటి లక్షణాలు కనిపించినప్పుడు జాగ్రత్త పడాలి. వెంటనే నిపుణులైన వైద్యులు సంప్రదించాలి. ఎవరికివారు సొంతంగా గడ్డలు లేదా ఇతరత్రా మార్పులను పరిశీలించుకోవచ్చు. ప్రత్యేకమైన ఎక్స్‌రే ద్వారా బ్రెస్ట్ కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించవచ్చు. అనుమానాస్పద కణాలను పరీక్షించి కేన్సర్ ఉందా లేదా అని వైద్యులు నిర్ధారిస్తారు. కేన్సర్‌ను అడ్డుకోలేకపోయినా, కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. మెరుగైన ఫలితాలు ఉంటాయి. ప్రతినెలా బ్రెస్ట్ స్వీయ పరీక్ష చేసుకోవాలి. 40 ఏళ్లు దాటిన తర్వాత ప్రతి సంవత్సరం 'మామోగ్రామ్' టెస్టు చేయించుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, ఫైబర్ ఎక్కువగా ఆహారంలో ఉండాలి. వ్యాయామం చేయడం, బరువు నియంత్రణలో ఉంచడం అభిలక్షణీయం. మద్యపానం, పొగతాగడం పూర్తిగా మానుకోవాలి. కుటుంబ చరిత్రలో ఎవరికైనా ఇలాంటి సుమస్య ఉంటే, వైద్యుల సలహాతో 'జెనెటిక్ టెస్ట్' చేయించుకోవాలి. కేన్సర్ వస్తుందని లేదా వచ్చిందని భయపడాల్సిన అవసరం లేదు. అయితే, అప్రమత్తంగా ఉండి, వైద్యుల సూచనల మేరకు చికిత్స చేయించుకోవాలి. తొలి దశల్లో గుర్తిస్తే, బ్రెస్ట్ కేన్సర్ నయమవుతుందని వైద్య నిపుణులు అంటున్నారు. వైద్యులు శస్త్రచికిత్స ద్వారా కేన్సర్ గడ్డను తొలగిస్తారు. రేడియేషన్ థెరపీ ద్వారా కేన్సర్ కణాలను నాశనం చేస్తారు. కీమోథెరపీని అనుసరించి, ఔషధాల ద్వారా కేన్సర్ కణాలను చంపుతారు. హార్మోన్ థెరపీ ప్రకారం, హార్మోన్ల ప్రభావాన్ని తగ్గిస్తారు. ఏదిఏమైనా బ్రెస్ట్ కేన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స విజయవంతంగా అవుతుంది.

### దశలు..

రొమ్ము కేన్సర్‌ను సున్నా నుంచి నాలుగు వరకూ దశలుగా పేర్కొంటారు. ఈ దశలు కణితి పరిమాణం, సమీపంలోని శోషరస కణుపులకు వ్యాపించిందా? లేదా?, శరీరంలోని ఇతర భాగాలకు మెటాస్టాసైజ్ అయిందా? అనే దాని ఆధారంగా నిర్ణయిస్తారు. దశ సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే, కేన్సర్ అంత అభివృద్ధి చెందినట్టు గుర్తించాలి. వీటిలో '0' అనేది తొలి దశ, దీనిని 'కార్సినోమా ఇన్ సిటు' అని కూడా పిలుస్తారు. ఇక్కడ కేన్సర్ కణాలు దాడి చేయవు. వాటి స్థానంలోనే ఉంటాయి. పరిధిని మించి వ్యాపించవు. స్టేజ్ Iలోఈ కణితి చిన్నదిగా ఉంటుంది. సమీపంలోని కణజాలానికి విస్తరించడం ప్రారంభమవుతుంది. స్టేజ్ IIలో, కణితి పెద్దదిగా ఉంటుంది. లేదా అది మరిన్ని శోషరస కణుపులకు వ్యాపిస్తుంది. స్టేజ్ IIIలో కేన్సర్ చుట్టుపక్కల కణజాలానికిపెద్ద సంఖ్యలో వ్యాపిస్తుంది. ఇది ప్రమాదకరమైన దశగా పేర్కోవాలి. ఇక చివరిదైన స్టేజ్ IV అత్యంత భయానక దశ. ఇక్కడ కేన్సర్ మెటాస్టాసైజ్ అవుతుంది. ఊపిరితిత్తులు, కాలేయం లేదా ఎముకలు వంటి సుదూర అవయవాలకు వ్యాపిస్తుంది.




మహిళలు ఎంత కాలం జీవిస్తారనడానికి, పిల్లలకు మధ్య సంబంధం ఉందంటే ఆశ్చర్యం అనిపిస్తుంది. కానీ, తాజా పరిశోధనలు ఈ విషయాన్ని నమ్మకంగా చెప్తున్నాయి. ఈ అధ్యయనాలను అనుసరించి 33 సంవత్సరాల వయసు తరువాత చివరి సంతానాన్ని కనిన మహిళలకు ఎక్కువ కాలం జీవించే అవకాశం, 29 ఏళ్లలోపు చివరి సంతానాన్ని కనిన మహిళల కంటే సుమారు రెండింతలు ఎక్కువ అవకాశం ఉంటుంది. వీరు సగటున 95 ఏళ్ల వరకు జీవించవచ్చు. ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, 40 ఏళ్ల తరువాత కూడా సంతానం కనిన మహిళలు 100 సంవత్సరాల వరకు జీవించే అవకాశం సుమారు నాలుగింతలు ఎక్కువగా ఉన్నట్లు మరో పరిశోధన వెల్లడించింది. ఈ ఆశ్చర్యకరమైన సంబంధం వెనుక కారణాలు పూర్తిగా అర్థం కాకపోయినా, కొన్ని సంభావ్య సిద్ధాంతాలు ఉన్నాయి. ఒక సిద్ధాంతాన్ని అనుసరించి, ఆలస్యంగా సంతానం కలగడం అనేది మహిళ ఆరోగ్య స్థితి, సంతానోత్పత్తి సామర్థ్యం బలంగా ఉన్న సంకేతం. ఎక్కువ వయసులో గర్భధారణ సాధ్యమయ్యే మహిళలకు సాధారణంగా బలమైన జన్యుశక్తి వారు అత్యంత ఆరోగ్యవంతంగా ఉన్నారనడానికి నిదర్శనం. ఈ లక్షణాలు దీర్ఘాయుష్షుకు సహాయపడతాయి. అదే విధంగా సంతానికి సహకరించే పునరుత్పత్తి హార్మోన్లు వృద్ధాప్య ప్రక్రియలతో అనుసంధానమై ఉంటాయి. కాబట్టి, ఈ హార్మోన్లు ఎక్కువ వయసు వరకూ ఉన్న మహిళలకు ఎక్కువకాలం జీవించే అవకాశాలు పెరుగుతాయి. అయితే, ఈ అంశంపై ఇంకా అధ్యయనాలు జరుగుతున్నాయి. కాగా, ఎక్కువ వయసులో పిల్లలు కనడం కొన్ని సవాళ్లను తెస్తుంది. ఆరోగ్యపరమైన రిస్కులు, గర్భధారణ సమస్యలు, ప్రసవ సమయంలో సంక్లిష్టతలు తప్పవు. కానీ ఈ ఫలితాలు, సంతానోత్పత్తి సమయం, ఆయుర్దాయం మధ్య ఉన్న ఆసక్తికరమైన అనుబంధాన్ని చూపుతున్నాయి. ఇది మనకు జీవశాస్త్రం, దీర్ఘాయుష్షు మధ్య ఇంకా పూర్తిగా అర్థం కాని ఒక బంధం ఉందని గుర్తు చేస్తుంది. ఈ పరిశోధనలు, సంతానోత్పత్తి కాలమానం మన మొత్తం ఆరోగ్య పరిస్థితి మరియు వృద్ధాప్యాన్ని అర్థం చేసుకోవడానికి ఒక విలువైన సూచిక కావచ్చని సూచిస్తున్నాయి. జీవనశైలి, ఆహారం, వ్యాయామం, జన్యువులు వంటి అంశాలు ప్రధాన పాత్ర పోషించినా, ఒక తల్లి చివరి సంతానం పుట్టిన వయసు ఆమె జీవిత కాలాన్ని అంచనా వేసే ఒక సంకేతంగా ఈ పరిశోధన నిలుస్తుంది.

## రేపటి నుంచి యాదాద్రి జిల్లాలో సిపిఐ బస్సు జాతా : యానాల





**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ విజయవంతానికి రేపటి నుంచి యాదాద్రి జిల్లాలోని అన్ని మండలాల్లో సిపిఐ బస్సు జాతా ప్రచారం జరుగుతుందని పార్టీ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దామోదర్‌రెడ్డి బస్సు జాతా వివరాలు వివరించారు. ఈనెల 19న జిల్లాలోని నారాయణపురం, చౌటుప్పల్ మండలంలో, 20న బీబీనగర్, భువనగిరి, 21న వలిగొండ మోత్కూరు గుండాల ఆత్మకూర్ మోటకొండూర్ యాదగిరిగుట్టలో 22న రాజపేట మరియు ఆలేరులో బస్సు యాత్ర ప్రచారం జరుగుతుందని, బస్సుజాతాలో పార్టీసభ్యులు, సానుభూతిపరులు, ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని డప్పులు మరి యు కళాకారులతో ఘనస్వాగతం పలకాలని దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

## బస్సు జాతా విజయవంతానికి ఏర్పాట్లు
### సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/కోదాడ :** డిసెంబర్ 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించే సిపిఐ వందేళ్ల ఉత్సవాల ముగింపు బహిరంగసభ విజయవంతానికి జిల్లాలో జరిగే సిపిఐ బస్సు జాతా విజయవంతానికి ఏర్పాట్లు చేస్తున్నామని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం పట్టణ సిపిఐ కార్యాలయంలో బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 15 గద్వాల్‌లో ప్రాంభమైన బస్సుజాతా డిసెంబర్ 20 తేదీనాటికి కోదాడ పట్టణానికి చేరుకుంటుదని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనిసరావు, సిపిఐ మండల, పట్టణ కార్యదర్శులు బత్తినేని హనుమంతరావు, రాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార యాత్ర కరపత్రాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నర్సంపేట :** సిపిఐ వంద సంవత్సరాల ప్రచార జాతా విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్ అన్నారు. నర్సంపేట పట్టణంలో ప్రచార యాత్ర కరపత్రాల మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచార బస్సు జాతా ఈనెల 20న నర్సంపేటకు చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అయిత యాకూబ్, సభ్యులు మియాపురం గోవర్ధన్, దిడ్డి పార్థసారథి, పాలక కవిత, పిట్టల సతీష్, గడ్డం నాగరాజు, అరుణ, శ్రీలత, స్వరూప, స్వప్న పాల్గొన్నారు.

## 'గుట్ట' సమస్యలు పరిష్కరించకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలు
### గోదా శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట దేవస్థానంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే సిపిఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళనలే నిర్వహిస్తామని పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు హెచ్చరించారు. మంగళవారం సిపిఐ యాదాద్రి పట్టణ శాఖ ఆధ్వర్యంలో గుట్టపై పర్యటించారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు నేతృత్వంలో భక్తులకు కలుగుతున్న అసౌకర్యాలు, భక్తులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు తెలుసుకోవడం కోసం దేవాలయ పరిసర ప్రాంతాలు కొండపైన కొండ కింద పరిశీలించారు. పరిశీలన అనంతరం పార్టీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు మాట్లాడుతూ తమ బృందం పరిశీలనలో యాదగిరి గుట్ట దేవస్థానం పరిధిలో వంద సమస్యలు ఉన్నాయని గుర్తించామన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం రూపంలో కార్యనిర్వాణాధికారి, దేవాలయ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ, స్థానిక ఎమ్మెల్యే, దేవాదాయ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి వరకు శాస్త్రీయ పద్ధతిలో వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇటీవల ఎసిబి దాడిలో దొరికిన ఉద్యోగి రామారావు వివరాలను అధి కారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు. దేవాలయ అధికారులు కూడా ఈ సంఘటనపై స్పందించాలని డిమాండ్ చేశారు. యాదగిరి గుట్ట దేవస్థానానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతిగదులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. గుట్ట బస్టాండ్ ఆవరణ పూర్తిగా అసౌకర్యాలతో నిండి ఉందన్నారు. దూరప్రాంతాల నుంచి బస్సులో వచ్చే భక్తులకు బస్టాండ్ ఆవరణలో మౌలిక వసతులు, కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేవస్థాన పరిధిలో అందించే సేవలకు నిర్ణయించిన అధిక ధరలతో భక్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. దేవాలయ రిటైర్డ్ ఉద్యోగుల స్థానాల్లో ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దేవాలయ పరిధిలో అందిస్తున్న సేవలలో అధికారుల అవినీతి పెరిగిందన్నారు. ఇప్పటికయిన అధికారులు స్పందించి యాదగిరి గుట్టలో సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, పెరబోయిన మహేందర్, మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, మండల కార్యదర్శి కల్లపల్లి మహేందర్, పట్టణ సహాయకార్యదర్శి పేరబోయిన బంగారి, కార్యవర్గ సభ్యులు అరె పుష్ప, గోపగాని రాజు, రాయగిరి బాలకిషన్, గుండు వెంకటేష్, మద్దూరు భాగ్య, పాకాలపాటి రాజు, సుబ్బురీ నరసింహ, కోకల రవి తదితరులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చే వరకు సమ్మె
### అంబేద్కర్ విగ్రహానికి మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** తమ సమస్యల పరిష్కారానికి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె పెద్దపల్లి జిల్లాలో నాలుగో రోజుకు చేరుకుంది. తమ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం అమరవీరుల స్థూపం వద్ద నుండి ర్యాలీగా వెళ్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పూసాల రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనైనా మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు మారుతాయని అనుకున్నామని, కానీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలైనా తమ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉండే చందాగా మారాయన్నారు. ప్రభుత్వాలు మారిన మధ్యాహ్న భోజన కార్మికులకు తలరాత మారడం లేదన్నారు. సమస్యలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి తప్పా సమస్యల పరిష్కారానికి ఏ ప్రభుత్వం కృషి చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన వేతనాలు లేక, పరిభారంతో మధ్యాహ్న భోజన కార్మికుల బతుకులు అగమ్య గోచరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేదే లేదని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాఠకుల కళావతి, జక్కుల రాజేశ్వరి, ఎండి సలేహా, మేకల యశోద, లంక విజయ అధిక సంఖ్యలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసిలో అన్నివిభాగాల కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి
### మున్సిపల్ వర్కర్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్/సరూర్‌నగర్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. ఏసురత్నం డిమాండ్ చేశారు. మంగళవారం హయత్ నగర్, ఎల్‌బి నగర్, సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి సంబంధిత అధికారులను వినతిపత్రం అందచేశారు. ఎల్‌బి నగర్ ఎఐటియుసి జోన్ ప్రధాన కార్యదర్శి ఎం.మద్దిలేటి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ దశబ్దాల తరబడి విధులు నిర్వహిస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంలో, కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమైయ్యాయని ఆయన ఆరోపించారు. జిహెచ్‌ఎంసిలో కార్మికులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, సెంటర్ డివైడర్లను పారిశుద్ధ్య పనులు చేస్తున్న సమయంలో కార్మికులకు రక్షణ సదుపాయాలు కల్పించడంలో జిహెచ్‌ఎంసి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. జిహెచ్‌ఎంసి కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఎ ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కేటగిరీల వారిగా వేతనాలు చెల్లించాలని, జిహెచ్‌ఎంసిలో కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్మికుల ప్రతి డిమాండ్‌ను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు బి.హరిబాబు, శ్రీరాములు, శ్రీనివాసులు, సరస్వతి, వెంకటమ్మ, అనురాధ, జయమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కవులు సమాజ సంపద



### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కవులు, కళాకారులు సమాజ సంపద అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ ఆవరణలో చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కూనంనేని మాట్లాడుతూ కవి కలం నుండి జాలువారే ప్రతీ సిరా చుక్క వేయి మెదళ్లను కదలించగలిగే శక్తి అని, బడబాగ్నిని రగిలించే అక్షరానికి అంతటి మహత్తర శక్తి ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు రాసే కవితలు, రచనలు ప్రాచుర్యాన్ని పొందాలని ఆకాంక్షించారు. తనకు పుస్తక పఠనం అంటే ఇష్టమని తెలిపారు. విద్యార్థులు పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని, పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు పుస్తకాలతో దోస్తీ చేస్తే మేలు జరుగుతుందని సూచించారు. అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేసి గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి కరుణకుమారి, ఎంపిడిఒ కార్యాలయ ఉద్యోగి అసోసియేట్ అధ్యక్షురాలు కె.అంబిక, గ్రంథపాలకురాలు గుమ్మడి మణిమృధుల, మధుబాబు, వాణి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



**ప్రజాపక్షం/శంషాబాద్ :** సామాజిక కార్యక్రమాలతో గుర్తింపు లభిస్తుందని 7వ వార్డు మాజీ కౌన్సిలర్ అంజాద్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మధురానగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నార్సింగ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం జరిగాయి. స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్న కార్యక్రమానికి అంజాద్ అతిథిగా హాజరయ్యారు. వెంకటేష్‌గౌడ్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేష్‌గౌడ్ బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలుస్తూ ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడుతున్నారని తెలిపారు.

## ఆధ్యాత్మిక దైవచింతన అలవర్చుకోవాలి

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఆధ్యాత్మిక దైవచింతన అలవర్చుకోవాలని ఎల్‌బి నగర్ నియోజకవర్గ ఎంఎల్‌ఏ దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి కోరారు. మంగళవారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని శ్రీమల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరం ఆయన ప్రారంభించి, ఉమా రామలింగేశ్వర స్వామి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమల్లికార్జున భక్త సమాజం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి ఏటా శివ స్వాములకు నిత్య అన్నదానం కార్యక్రమంతో పాటు, ఉమా రామలింగేశ్వర దేవాలయంలో వసతులు కల్పించడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముద్దగౌని సతీష్ కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిషేధించడమే ప్రధాన బాధ్యత

షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** డ్రగ్స్ నిషేధించడమే ప్రధాన బాధ్యతగా పోలీసులు పని చేయాలని, ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ సూచించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పోలీసులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మత్తు పదార్థాలను నియంత్రించడంలో పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించడంతోపాటు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండటంతోపాటు ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని అన్నారు. కళాశాలు, పరిసరా ప్రాంతాలు, ఇతర చోట్ల ఎక్కడైన డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు యువత కృషి చేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారని, ఇందుకు యువత ముందుకు వచ్చి సహాకరించాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలపై పోలీసులు డేగ కన్నుతో తనిఖీలు చేయాలని, నిఘాను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు శరత్ కుమార్, సుశీలతోపాటు ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా విద్య అభ్యసించాలి

రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా విద్యను అభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఫరూఖ్‌నగర్ ఎంఇఓ మనోహర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినిలతో కలిసి ఉపాధ్యాయులు బోధించే పాఠ్యంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లోకి వెళ్ళి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకొని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రణాళిక బద్ధంగా విద్యను నేర్పించేందుకు కృషి చేయాలని, కష్ట పడికాకుండా ఇష్టంతో విద్యను నేర్పించాలని సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గుర్తు చేశారు.

## మాదక ద్రవ్యాలు వద్దు..

షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ శ్రీనివాసులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మాదక ద్రవ్యాలు వద్దు నిండు జీవితమే ముద్దు అనే లక్ష్యంతోనే యువత ముందుకు నడవాలని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిరోధకంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవన శైలిరి అనుసరిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను విక్రయించడం, కొనుగోలు చేయడం, అక్రమ రవాణా చేసే వ్యక్తుల వివరాలను తక్షణమే పోలీసులకు అంధించేందుకు కృషి చేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ, హెల్త్ సూపర్‌వైజర్ చంద్రకళ, స్టాఫ్ నర్సులు సువర్ణ, పకీరమ్మ, ల్యాబ్ టెక్నిషియన్ శివకుమార్, ఏఎన్‌ఎంలు ఇస్తేర్ రాణి, విజయలక్ష్మి, ఆఫీస్ సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు.

**గురుకుల కళాశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ...** డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గురుకుల కళాశాల ప్రిన్సిపల్ ప్రీతీ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపల్ ప్రీతీ, ప్రధానోపాధ్యాయుడు వినయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మాదక ద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టిచర్ పద్మతోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలి

సిపిఐ బస్సుయాత్ర సభలో జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ







**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కార్పొరేట్ బడా పెట్టుబడిదారుల నాయకత్వంలో పనిచేసే కేంద్రప్రభుత్వాన్ని గద్దె దించడానికి దేశంలోని లౌకిక ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ పిలుపునిచ్చారు. సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సిపిఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం చేవెళ్ల పట్టణానికి చేరింది. బస్సు యాత్ర బృందం నాయకులకు సిపిఐ చేవెళ్ల నియోజకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, టి.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ప్రభులింగం, జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్యనారాయణ, మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, తదితరులు బస్సు బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేవెళ్ల బస్టాండు కూడలిలో జరిగిన సభలో పశ్య పద్మ మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు అవుతున్న తరుణంలో ఖమ్మం పట్టణంలో డిసెంబర్ 26న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు సిపిఐ శ్రేణులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో సిపిఐ నిరంతరం ప్రజాల తరపున పోరాడుతున్నదని పేదలకు ఇండ్ల స్థలాలు కావాలని చేవెళ్ల పట్టణంతో పాటు అబ్దుల్లాపూర్ మెట్టు ప్రాంతంలో గుడిసెలు వేయించి పేదలకు ఇండ్ల స్థలాలు ఇప్పించిన ఘనత సిపిఐది అన్నారు. బస్సు యాత్ర బృందంలో పశ్య పద్మతో పాటు రాష్ట్ర నాయకులు. వలివుల్లా ఖాద్రి. నరేంద్ర. ఉప్పలయ్య.ఉన్నారు. స్వాగతం పలికిన వారిలో నాయకులు కె.శ్రీను, పి.సుధీర్, పాలమాకుల శ్రీశైలం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బూల్, ప్రజానాట్య మండల జిల్లా అధ్యక్షుడు సుధాకర్, బద్దం శివారెడ్డి, రాజేందర్ గౌడ్, ఎఐటియుసి నాయకుడు శివ, లలిత, వెంకటమ్మ, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

### శంకర్‌పల్లి - ఘనంగా స్వాగతం

**శంకర్‌పల్లి:** సిపిఐ ప్రచార జాత భాగంగా శంకర్‌పల్లికి సోమవారం రాత్రి చేరింది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి నరేందర్ ప్రసాద్, ప్రజానాట్యమండలి గాయకుడు ఉప్పలయ్యల తోపాటు 16 మంది ప్రజానాట్యమండలి కళాకారుల బృందం శంకర్పల్లి వచ్చిన సందర్భంలో రంగారెడ్డి జిల్లా సిపిఐ చేవెళ్ల నియోజకవర్గం నాయకులు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభు లింగం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్ల సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పి.సుధీర్, చేవెళ్ల మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం, ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జి.అంజయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహిళా సంఘం వడ్ల మంజుల తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు గోపాల్ రెడ్డి. చంద్రమౌళి; పాపయ్య, శీను, రాములమ్మ, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రివర్గ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం : బాలగోని

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** బిసిల 'స్థానిక' రిజర్వేషన్లపై మంత్రివర్గ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ తెలిపారు. 42శాతం రిజర్వేషన్లు చట్టపరంగా ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే బిసిలను అధికారానికి దూరం చేయడమేనన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం 3 వేల కోట్ల నిధుల కోసమే ఎన్నికలు నిర్వహిస్తునట్టు చెప్పడం విడ్డూరంగా ఉన్నదని, ఇది బిసిల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. బిసిల వ్యతిరేకపాలన కొనసాగిస్తే డిసెంబర్ 1 నుంచి 9వరకు జరిగే ప్రజాపాలన వారోత్సవాలను అడ్డుకొంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చట్టబద్ధమైన రిజర్వేషన్లకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో ఫ్రంట్ నేతలు బైరు శేఖర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బల్లారం బజారు రైల్వే స్టేషన్ సమీపంలో కారులో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎస్‌టిఎఫ్ బి టీమ్ ఎస్‌ఐ బాలరాజు సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. ధూళిపేట్‌కు చెందిన పూజా బాయి సత్యం రావు అలియాస్ సోను గంజాయి అమ్ముతుండగా పట్టుకున్నారు. మహారాష్ట్ర నాంథేడ్ నుంచి 10 కిలోల గంజాయిని తీసుకవచ్చారు. మూడు కిలోల మేర అమ్మకాలు జరుప గా మిగిలిన 7.043 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయితోపాటు కారును, సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. కేసులో పట్టుబడిన పూజాబాయి, సత్యం రావు అలియాస్ సోనులను అరెస్ట్ చేశారు. పూజాబాయి భర్త ఆకాష్ సింగ్‌తోపాటు గంజాయి సరఫరా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశా రు. నిందితులను, గంజాయిని సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించమని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

## సౌది ప్రమాద బాధితులను అన్నివిధాల ఆదుకోవాలి : సిపిఐ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సౌదీ ప్రమాద ఘటన బాధిత కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ కోరారు. మక్కా నుండి మదీనాకు బయలుదేరిన బస్సు ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన సంఘటనలో 45 మంది చనిపోవడం అత్యంత విషాదకరమని మంగళవారం ఒక ప్రకటనలో వారు పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి సంబంధించిన 18మంది చనిపోవడం, ఒక కుటుంబంలో తల్లిదండ్రులు చనిపోయి, ఇద్దరు పిల్లలు అనాధలుగా మారిన ఘటన హృదయ విదారకమైనదన్నారు. మృతులకు సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు సానుభూతిని వారు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబాలకు ఆర్థికంగా సహాయం అందించడం, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఉచితంగా విద్య కల్పించాలని అన్నారు. మృతుల గుర్తింపును వేగవంతం చేసి, సౌదీలో జరిగే అంత్యక్రియలకు ఎక్కువ మంది కుటుంబసభ్యులను తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని వారు సూచించారు.

## బ్రిలియెంట్ కాలేజీ దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

వివరాలు వెల్లడించిన డిసిపి అనురాధ




**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** అబ్దులాపూర్‌మెట్ పీస్ పరిధిలోని బ్రిలియెంట్ కాలేజీలో గత నెల జరిగిన దొంగతనం కేసులో అంతరాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి డబ్బును రికవరీ చేసినట్లు డిసిపి అనురాధ తెలిపారు ఈ కేసులో కోటి రూపాయల గాను 37 లక్షల రూపాయలను రికవరీ చేసి ముగ్గురి నిందుతులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మిగతా ముగ్గురి నిందితులు పరారీలో వున్నారని, వారిని పట్టుకొని మిగతా 67 లక్షల రూపాయలను రికవరీ చేస్తామని తెలిపారు. ఈ కేసును త్వరగా ఛేదించిన పోలీస్ సిబందిని అభినందించారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు చేతులమీదుగా రివార్డులు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డిసిపి క్రైమ్ అరవింద్‌బాబు, అడిషినల్ డిసిపి కోటేశ్వరరావు, ఏసిపి కాశినాథ్‌రెడ్డి. సిఐ అశోక్‌రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

# హత్యకేసులో నిందితుల అరెస్టు

షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ

రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాల సీజ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దళితుడు ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో ఉన్న నింధితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ వివరించారు. సోమవారం రాత్రి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళితుడు ఎర్ర రాజశేఖర్‌ను హత్య చేసిన ప్రధాన నిందితుడితోపాటు అందుకు సహాకరించిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు వివరించారు. నింధితులను రిమాండ్‌కు తరలించడంతోపాటు వారు ఉపయోగించిన రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను, కొంత నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. యువతి తండ్రి కాగుల వెంకటయ్యతోపాటు పత్తి శ్రీను, వడ్డె నర్సింలు, సోమ సురేష్ అలియాస్ సోమచ్ చందన్ కుమార్, బిజ్జు రాఘవేందర్, ఆవుల శ్రీకాంత్, కావుల రాములు, గణేష్‌లను అరెస్టు చేసినట్లు వివరించారు. వీరిపై ఎస్సీ ఎస్టి అట్రాసిటి కేసుతోపాటు హత్య కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, బాధితులకు న్యాయం చేయడంతోపాటు నిందితులను కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎర్ర రాజశేఖర్ హత్య కేసులో ప్రధాన నింధితుడు కాగుల వెంకటయ్య మీడియా ముసుగులో జర్నలిస్టుగా చలామణి అవుతున్నాడని వివరించారు. ప్రజా మలుపు అనే ఓ దినపత్రికు సంబంధించి గుర్తింపు కార్డు లభించిందని, కాగుల వెంకటయ్య కొత్త గురువుగా సైతం చెలమణి అవుతు కొంతమంది శిష్యులను పోగు చేసుకున్నాడని వివరించారు. తద్వారానే ఎర్ర రాజశేఖర్‌ను హత్య చేశారని, వారందరిని అరెస్టు చేసినట్లు తెలిపారు. సంఘంలో పెద్ద మనుషులుగా చలామణి అవుతూ ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెడుతున్నామని పేర్కొన్నారు. మీడియా ముసుగులో ఫేక్ గుర్తింపు కార్డులతో జర్నలిస్టులుగా చెలామని అయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హత్య కేసును త్వరగా చేదించినందుకు పట్టణ సిఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐలు శరత్, సుశీలతోపాటు పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినంధించారు.

# మత్తుపదార్థాల వాడకం సమాజానికి పట్టిన చీడపురుగు

రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత







**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మత్తుపదార్థాల వాడకం సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల నిరోధానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో "నషా ముక్త్ భారత్ అభియాన్" సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి సంగీత "మిషన్ పరివర్తన సామూహిక ప్రతిజ్ఞ"లో భాగంగా... నేను మాదక ద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించారు. డిఆర్‌ఓ సంగీత మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సేవిస్తే కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని,డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం, పోలీసు శాఖ,యువత,సమాజంలోని అన్ని వర్గాలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ వినియోగం యొక్క దుష్ప్రభావాల గురించి యువతకు పరిజ్ఞానం కల్పించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు,తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాధారణ ప్రజలు,విద్యార్థులు అందరూ డ్రగ్స్ రహిత సమాజం తమ బాధ్యతగా భావించాలని,తమ పరిసరాల్లో, కాలేజీల్లో, పాఠశాలల్లో మత్తు పదార్థాల వాడకం గురించి పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. తెలిసీ తెలియక మత్తు పదార్థాల బారిన పడటం వల్ల యువత బంగారు భవిష్యత్తు నాశనం అవుతోందని, యువత యొక్క శారీరక మానసిక ఆరోగ్యాన్ని మత్తు పదార్థాలు విచ్ఛిన్నం చేస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్ పై చేస్తున్న పోరాటం లో యువత తమ వంతు బాధ్యత నిర్వహించాలని, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండడంతోపాటు,తమ దృష్టికి వచ్చే నిషేధిత డ్రగ్స్ సరఫరా మరియు వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని తక్షణమే పోలీసులకు తెలియ జేయాలని సూచించారు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, డిపిఓ సురేష్ మోహన్, ఈ.డి.ఎస్సీ కార్పొరేషన్ పద్మావతి, పిడి మెప్మా వెంకట నారాయణ, సంబంధిత అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఊపిరి ఆగకూడదంటే ...సిగరేట్లు ఆపాలి

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు

**సరూర్‌నగర్ :** కాలుష్య బారిన పడకుండా, పొగ తాగకుండా ఉంటే మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని, ఊపిరి ఆగకూడదంటే సిగరేట్లు తాగడం మానాలని రాజకొండ పోలీస్ కమీషనర్ జి.సుధీర్‌బాబు సూచించారు. మంగళవారం ఎల్‌బినగర్ కామినేని ఆసుపత్రిలో జరిగిన అంతర్జాతీయ సిఓపిడీ డే ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపి సుధీర్‌బాబు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ సిఓపిడీ వీలైనంత ముందుగా గుర్తిస్తే అప్పటి వరకు ఊపిరితిత్తులకు అయిన నష్టాన్ని కొంతవరకైన తగ్గించే అవకాశం ఉందన్నారు. సాధారణంగా 60 ఏళ్ల తర్వాతే ఈ వ్యాధి లక్షణాలు బయటపడతాయని వెల్లడించారు. 20ఏళ్ల వయస్సులో చేసిన తప్పులకు 60 ఏళ్లలో పడే శిక్ష ఇది అన్నారు.దీన్ని గుర్తించడానికి ఉన్న ఏకైక పరిక్ష పల్మనరీ పంక్షన్ టెస్ట్ రూ.3000లకు ఉంటుందని, కాని ప్రస్తుతం కామినేని ఆసుపత్రిలో ఈ నెల 22వ తేదీ నుంచి రూ.400లకే అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. అనంతరం సీనియర్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ రోజుకు పదుల సంఖ్యలో సిగరేట్‌లు తాగుతూ ఆపేసాములే అనుకున్నా.. కొన్ని సంవత్సరాల తరువాత క్రమంగా మన రోగనిరోదక శక్తి తగ్గినప్పుడు బయటపడతాయని తెలిపారు. సిగరేట్ తాగడమే కాకుండా పొగ పీల్చడం కూడా ఎంతో హనికరం అని అన్నారు. ఈ పల్మనరీ పంక్షన్ టెస్ట్ చేయించుకోవడం వల్ల ఆరోగ్య పరిస్థితి మరింత కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం సీపీ సుధీర్‌బాబుకు డాక్టర్లు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు సుధీర్‌బాబు, పద్మల్, కామినేని అకాడమి ప్రిన్సిపల్ డాక్టర్ అంజయ్య, శుభకర్ కంది, రవీంద్రనాథ్, డి.ఎస్. సౌజన్య, భరత్ జానపాటి పాల్గొన్నారు.



# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## దివ్యాంగ అంతర్జాతీయ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దివ్యాంగుడైన అంతర్జాతీయ క్రీడాకారుడు మేడ్చల్ జిల్లావాసి ధీరావత్ మహేష్ శ్రీలంకలో జరుగనున్న జూనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఓ ప్రైవేట్ పారిశ్రామిక సంస్థ ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చిందని జిల్లా పరిశ్రమల కేంద్ర జనరల్ మేనేజర్ తెలిపారు.శ్రీలంకలో జరుగనునన్న జూనియర్ త్రోబాల్ ఛాంపియన్‌షిప్ కెప్టెన్‌గా ఎంపికైన అతడికి రవాణా, ఇతర ఖర్చుల నిమిత్తం అవసరమైన రూ.59వేలు ఆర్థికసాయంగా కావాలని అభ్యర్థించటంతో జిల్లా యువజన క్రీడా అధికారి ప్రతిపాదన మేరకు కలెక్టర్ సూచనతో తుర్కపల్లిలోని నియోవాంటెజ్ టెక్నాలజీ సంస్థ అందించిన చెక్‌ను జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా ఇస్తారని జిల్లా పరిశ్రమల జిఎం తెలిపారు.




## వల్లభ్ భాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు రావాలి : ఎంపి ఈటల

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు రావాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ పిలుపిచ్చారు. 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి ఆనంద్‌బాగ్‌లోని బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం కేంద్ర యువజన సర్వీసుల శాఖకు చెందిన జై భారత్ ఆధ్వర్యంలో జరిగిన మంగళవారం జరిగిన యూనిటీ మార్చ్ పేరిట నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వల్లభ్ భాయ్ పటేల్ దేశ ఐక్యతను ప్రతిబింబించేలా కృషిచేసిన మహనీయుడని, ఆయన జీవత చరిత్ర, అవలంబించిన విధానాలను ప్రతి ఒక్కరూ అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. యువతలో దేశభక్తి పెంపొందించేలా ఏక్ భారత్ నిర్భర్‌లో భాగంగా ఐక్యతా మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న పటేల్ భారతదేశ తొలి ఉప ప్రధానిగా, హోమ్ శాఖ మంత్రిగా తనదైన ముద్ర వేసారన్నారు. ఎన్‌సిసి, ఎన్‌ఎస్‌ఎస్, యువజన సంఘాల ప్రతినిధులు, పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొన్న ఈ పాదయాత్రలో రాష్ట్ర కమిటి సభ్యులు సామల పవన్‌రెడ్డి, జిల్లా పట్టణ, గ్రామీణ కమిటి కన్వీనర్ నాగరాజు, విజయకుమార్, కోకన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.



## నెహ్రూ నగర్‌లో కార్డన్ సెర్చ్

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాలనీల్లో అనుమానితంగా ఏవరైనా కనబడితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని మల్కాజ్‌గిరి డిసిపి పద్మజ అన్నారు. చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీలో మల్కాజ్‌గిరి డిసిపి పద్మజ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 140 అధికారులు, సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిపి పద్మజ మాట్లాడుతూ ఇండ్లలో కొత్తగా కిరాయికి వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకున్నాకే అద్దెకు ఇవ్వాలని, నేరరహిత పట్టణంగా తీర్చిదిద్దడంతో పాటు శాంతి భద్రతలు కల్పించాలని ఉద్దేశ్యంతో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.ఈ కార్డన్ సెర్చ్‌లో డాక్యుమెంట్లు సరిగ్గాలేని వాహనాలు 34, మద్యం బాటిళ్లు 26, డొమెస్టిక్ సిలిండర్, ఇద్దరు, రౌడీషీటర్లు, ఒక అనుమానితునికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఏసిపి వెంకట్‌రెడ్డి, సిఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 617 పోస్టుల మంజూరు హర్షణీయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మేడ్చల్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులు తగ్గించడానికి గత కొన్ని రోజుల క్రితం జిల్లాలో మంజూరైన 28 కొత్త కోర్టులలో సిబ్బంది నియామకానికి 617 పోస్టులు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం క్యాబినెట్ సోమవారం తెలపటం పట్ల మేడ్చల్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు నెపూరి అమరేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి,మంత్రులు,హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి, తెలంగాణ లా సెక్రటరీ పాపిరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



## మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే నా లక్ష్యమని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ ఏరో నగర్ కాలనీలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ పర్యటించారు. కాలనీ వాసులు కాలనీలో నెలకొన్న సమస్యలను వివేక్‌కి విన్నవించారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని అన్నారు. ముఖ్యంగా కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, పార్కుల అభివృద్ధి తదితర సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించే బాధ్యత తనదని, త్వరలోనే ప్రత్యేకంగా నిధులను కేటాయించి ప్రణాళికలను రూపొందించేలా చూస్తానని అన్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి ప్రతి కాలనీ, బస్తీల్లో మౌలిక వసతులను కల్పించామని, ఏరో కాలనీలో సైతం మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, నాయకులు హన్మంతరావు, అంజన్ గౌడ్, విజయ రాంరెడ్డి, ఏరో నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లికి చెందిన ఇంద్రాల రాజు అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుని కుటుంబాన్ని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మహేష్‌గౌడ్ పరామర్శించి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో 10 వేల రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కడియాల నర్సింహ, నాగేష్, అనిల్‌కుమార్, పి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పరిశుభ్రమైన సుందర నగరంగా హైదరాబాద్ అభివృద్ధికి శ్రమిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ కోరారు. మహా నగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి)లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో యూనియన్ ప్రతినిధులు సోమవారం కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు.

అనంతరం బాల్‌రాజ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహులు మాట్లాడుతూ ఉద్యోగులకు న్యాయంగా అందాల్సిన ప్రాథమిక సౌకర్యాలు ఇంకా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సిని వెంటనే విడుదలచేసి ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. జిహెచ్ఎంసిలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను ఇవ్వాలని కోరారు. విధుల్లో ఉండగానే మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు ఉద్యోగావకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరామని తెలిపారు. జిహెచ్ఎంసిలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసులను రెగ్యులరైజ్ చేస్తే సంస్థ అభివృద్ధికి తోడ్పడటంతో పాటు కార్మికులకు న్యాయం జరిగినట్లవుతుందన్నారు. ఉద్యోగులకు రావాల్సిన డిఏ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ సెక్రటరీ శివ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి, మహిళా విభాగం విజయ నిర్మల, శైలజ, అదనపు అధ్యక్షుడు శివ కుమార్ కోశాధికారి మహేష్ కుమార్, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు శ్రీకాంత్, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.



## గీత పనివారల సమస్యల పరిష్కారానికి చలో హైద్రాబాద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** గీత పనివారల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గీత పనివారం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో గీత పనివారం సంఘం చలో హైద్రాబాద్ కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బషీరాబాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో 22వ తేదీన నిర్వహిస్తున్న రాష్ట్ర సదస్సుకు అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, హైకోర్టు న్యాయవాది, ముఖ్య అతిథులు రావాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, మాజీ మంత్రివర్యులు శ్రీనివాస్‌గౌడ్, పల్లా వెంకట్‌రెడ్డి మాజీ శాసన సభ్యులు, సిపిఐ జాతీయ కార్యదర్శి వక్తలుగా సదానంద్‌గౌడ్, డిజి సాయిలుగౌడ్, పల్లె లక్ష్మ న్‌గౌడ్, వెంకట్‌రాములు, అంబాల నారాయణగౌడ్, ప్రజా సంఘాల, ఐక్య సంఘాల నాయకులు విచ్చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా డిజి సాయిలుగౌడ్ మాట్లాడుతూ గీత పనివారల కుటుంబాలకు చెల్లించాల్సిన రూ.13కోట్లు ఎక్స్‌గ్రేషియా బకాయిలు విడుదల చేయాలన్నారు. ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు, పెన్షన్ రూ.5వేలు, అర్హులైన అందరికీ గుర్తింపు కార్డులు, సేఫ్టి కిట్స్, మోటార్ సైకిళ్లు, జిఒ 56 ప్రకారం ప్రతి సొసైటీకి 10 ఎకరాల భూమి వన పెంపకానికి ఇవ్వాలని, రాజ్యాంగ పరంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు పల్లె సీతారాములుగౌడ్, భాస్కర్‌గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములుగౌడ్, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## త్రోబాల్‌కు సంబంధించిన కమిటీలు రద్దు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర త్రోబాల్ సంబంధించిన కమిటీలను మంగళవారం నుండి రద్దుచేయడం జరిగిందని టిపిసిసి అధికార ప్రతినిధి, తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ అధ్యక్షులు సత్యం శ్రీరంగం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్రంలో త్రోబాల్ అసోసియేషన్ సెవెన్ సైడ్ భవిష్యత్తు, పటిష్టత కొరకు త్వరలో నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు రామన్ కుమార్ సాహ్ని, జనరల్ సెక్రటరీ గౌతమ్ కుమార్ సింగ్ సూచనలతో తెలంగాణ క్రీడాకారుల పటిష్టత, భవిష్యత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా త్రోబాల్ క్రీడాభివృద్ధికి తోడ్పడుతామన్నారు. త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిబంధనలు పాటించకుండా అనుబంధ రుసుములు కూడా చెల్లించకపోవడం వంటి తీవ్రమైన అవకతవకలు జరుగుతున్నాయనే కారణాలతో కేంద్ర కమిటీ సూచనల మేరకు అన్ని కమిటీలను రద్దు చేయడం జరిగిందన్నారు.

## నకిలీ వస్తువుల విక్రేత అరెస్ట్



**ప్రజాపక్షం/ఉప్పల్:** భువనగిరి ఎస్ఓటి పోలీసులు ఒక కిరాణ దుకాణంపై దాడిచేసి పెద్దఎత్తున డూప్లికేట్ ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నారు. షాప్ యజమాని సురేష్ కుమార్ (25) ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నకిలీ ఉత్పత్తులను బేగంబజార్‌కు చెందిన రామరాజు అనే వ్యక్తి సప్లై చేస్తున్నాడని నిందితుడు విచారణలో వెల్లడించాడు. స్వాధీనం చేసుకున్న వస్తువులతోతో పాటు నిందితున్ని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బహుళ అంతస్థుల భవనాలకు నోటీసులు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాలకు పట్టణ ప్రణాళిక అధికారులు నోటీసులను ఇవ్వడం షురూ చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, నిజాంపేట్, ప్రగతినగర్‌లలో అనుమతులకు మించి ఐదు, ఐరు, ఏడు అంతస్థుల భవనాలను నిర్మిస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్, ఇందిరా నగర్, సాయినగర్, నిజాంపేట్‌లోని సర్వేనంబరు 191 బస్తీలో, ఇంద్రన్న బస్తీ, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాలలోని మురికివాడలలో అసలే నోటరీ పత్రాలతో ప్లాట్లు ఉన్నాయి. ఇక్కడ అత్యధికంగా సామాన్య, మధ్య తరగతి, పేద ప్రజలు ఎక్కువగా నివసిస్తారు. అయితే ఈ బస్తీల్లో సైతం ఐదు, ఐరు, ఏడు అంతస్థుల భవనాలను కనీస నియమ నిబంధనలను పాటించకుండా నిర్మించడం గమనార్హం. అయితే నిజాంపేట్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక అధికారులు మురికివాడల్లో సైతం నిర్మించే బహుళ అంతస్థుల భవన యజమానులకు నోటీసులను ఇవ్వడం మంగళవారం ప్రారంభించారు. బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లో పలు బహుళ అంతస్థుల భవనాలకు టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులను ఇచ్చారు. దీంతో అనుమతులు లేకుండా నిర్మించే బహుళ అంతస్థుల భవనాల నిర్మాణ దారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.





ప్రజాపక్షం ఎఫెక్ట్

**మాజీ ప్రజాప్రతినిధి భవనానికి నోటీసులు ఇవ్వరా.. ?**

బాచుపల్లి, రాజీవ్ గాంధీనగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాల కు నిజాంపేట్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులను జారీ చేశారు. కాని ఓ మాజీ ప్రజాప్రతినిధి బాచుపల్లి ప్రధాన రోడ్డులో ఏకం గా సెల్లార్‌తో పాటు ఐదంతస్థుల భవనాన్ని నిర్మిస్తుంటే కార్పొరేషన్ అధికారులకు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజీవ్ గాంధీ నగర్‌లోని భవనాలకు నోటీసులను జారీ చేసినప్పుడు అనుమతి లేకుండా నిర్మించే ఓ నాయకుడి భవనంపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి. నిజాంపేట్, వెంకట్రాయ నగర్‌లో అనుమతులకు మించి రెండు అంతస్థులను నిర్మించిన ఓ భవనం యొక్క స్లాబ్‌లను తొలగించిన టౌన్ ప్లానింగ్ అధికారులు బాచుపల్లిలో ఓ నాయకుడి భవనం పై అసలు చర్యలు తీసుకుంటారా లేదా అన్న ప్రశ్నలు ప్రజల నుండి వెల్లువెత్తుతున్నాయి. ఓ నాయకుడు నిర్మించే ఈ భవనానికి ఎలాంటి అనుమతులు ఉన్నాయని టౌన్ ప్లానింగ్ చైన్ మెన్‌ని ప్రశ్నించగా ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. సామాన్యులకు ఓ న్యాయం, నేతలకు మరో న్యాయమా అని పలువురు నిలదీస్తున్నారు. అనుమతి లేకుండా నిర్మించే భవనంపై కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని బాచుపల్లి వాసులు డిమాండ్ చేస్తున్నారు.

**'ప్రజాపక్షం' కథనానికి స్పందన..**

బాచుపల్లి, రాజీవ్ గాంధీ నగర్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాల పై ప్రజాపక్షంలో వచ్చిన కథనానికి నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు స్పందించారు. రాజీవ్ గాంధీ నగర్‌లో అనుమతులను తీసుకోకుండా నిర్మిస్తున్న నిర్మాణ దారులకు మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులను జారీ చేశారు. కార్పొరేషన్ అధికారులు కనీస నియమ నిబంధనలను పాటించకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్థుల భవనాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# మాదక ద్రవ్యాలను నిరోధిద్దాం

### కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ ఆఫీస్ నందు మున్సిపల్ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్ మున్సిపల్ స్టాఫ్ అందరితో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ 2025 చేయించారు. అందరూ మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామి అవ్వాలని, డ్రగ్స్ రహిత జీవనశైలనే అనుకరిస్తూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని, డ్రగ్స్ అమ్మకం కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో అందరం భాగస్వామ్యం అవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ బి.లక్ష్మయ్య, వార్డ్ ఆఫీసర్లు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.





దుండిగల్ గ్రామంలోని పిహెచ్.సి సెంటర్‌లో డాక్టర్ స్వర్ణలత మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందన్నారు. గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల విక్రయం, కొనుగోలు, వంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఎం.డి సిరాజ్ ఉద్దీన్, సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**శామీర్‌పేటలో:** డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దడానికి యువత ముందుకు రావాలని, మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గురువయ్య, అలియాబాద్ మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపాలిటి ఆవరణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పిస్తు మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అలియాబాద్ కమిషనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్ధాలను ప్రజలకు వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగంవల్ల కలిగే హానికారక ప్రభావాలపై అవగాహన కల్పించారు.




అలాగే మూడుచింతలపల్లి మున్సిపల్‌లో ఇన్‌చార్జ్ మేనెజర్ రాజేశ్వర్‌రెడ్డి మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేయించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత పాత్ర చాల కీలకమైనదని చెప్పారు. డ్రగ్ రహిత భారత నిర్మాణంలో బాగస్వామ్యం కావడం చాల ముఖ్యమని పేర్కొన్నారు. నశాముక్త్ భారత్ అభియాన్ కింద ఏకమవుతు మన సమాజాం, కుటుంబం, స్నేహితులు మాత్రమే కాకుండా ముందుగా మనంలో మనం డ్రగ్ రహితంగా ఉండేందుకు ప్రతిజ్ఞ చేస్తున్నామని చెప్పారు. మార్పు మనలోనే మొదలవ్వాలని ఒకరిని చూసి మరొకరు మారాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మేనెజర్ శ్రీనివాస్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, మెప్మా అధికారి ప్రమీలాదేవి, టిపిఒ వికాస్, మున్సిపల్ ఎఇ సన, దేవేందర్‌రావు, ఉష, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు పాఠశాలలకు రక్షణ కల్పించాలి

### ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ రెడ్డి



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రైవేటు పాఠశాలల నిర్వాహుకల పై బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్న వారి నుండి పాఠశాలల నిర్వాహకులకు రక్షణ కల్పించాలని తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎస్ రెడ్డి డిమాండ్ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం విఐపి గార్డెన్‌లో మేడ్చల్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ట్రస్మా అధ్యక్షులు రెడ్డి విచ్చేసి మట్లాడుతూ ఇటీవల వరంగల్ జిల్లాలో పిడిఎస్‌యు నాయకులు పాఠశాల యాజమాన్యం పై భౌతిక దాడులకు దిగడం దురదృష్టకరమని అన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా తరుచుగా జరుగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, జేఏసీలు, రాజకీయ పార్టీల అనుబంధ సంఘాలు అంటూ ఇలా నిత్యం ప్రతి పాఠశాల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూనే ఉన్నారని, ఇలాంటి వాటి పై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులకు బడ్జెట్ పాఠశాలలు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాయని, సేవే పరమావధిగా నిర్వహిస్తున్న పాఠశాలలకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ట్రస్మా రాష్ట్ర కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పాఠశాలల నిర్వహణ కోసం సంఘం తగిన సలహాలు, సూచనలను అందిస్తుందని తెలిపారు.

ఇఎస్ఐ, పీఎఫ్, ప్రొఫెషనల్ ట్యాక్స్ తదితర అంశాల పై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆయా అంశాల పై రాష్ట్ర కమిటీ ఇప్పటికే ఉన్నతాధికారులతో చర్చించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, అధికార ప్రతినిధి రాంచందర్, సత్యా రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

**ట్రస్మా మేడ్చల్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

మేడ్చల్ జిల్లా ట్రస్మా నూతన అధ్యక్షులుగా శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి, గడ్డమీది బాల్ రాజు, ఆంజనేయులు, శ్రీనివాసులు, సోమశేఖర్, ధనలక్ష్మీ, అశోక్ రెడ్డి, మథ్యూజోసెఫ్, తాజొద్దీన్, స్వరూప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి. ఆంజనేయులు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నర్సింహులు, ఉపేందర్, సహాయ కార్యదర్శులుగా వీరన్న, మన్‌మోహన్ రావు, సాయిగణేశ్, విజయ్ భాస్కర్ రెడ్డి, లిథియా, శ్రీనివాస్ రెడ్డి, కెవిఎన్ రెడ్డి, దశరథ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులుగా మహేందర్ రెడ్డి, చంద్రశేఖర్, ఆనంద్, మల్లిఖార్జున్ రెడ్డి, జితేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజిరెడ్డి, శ్రీనాథ్ రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మత్తుపదార్థాల బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దు : కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాల నిర్మూలనకై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుని సమాజానికి తోడ్పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మత్తుపదార్థాల బారినపడి జీవితాన్ని నాశనం చేసుకోరాదని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం అనంతగిపల్లి తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాల, కళాశాల నందు శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదకద్రవ్యాల దుర్వినియోగం, అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలే సేవించరాదని, పిల్లలు పెద్దలు ఈ విషయంలో బాధ్యతగా ఉండాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు వాడటం వలన గుండె జబ్బులు, అన్ని అవయవాలు పాడవటానికి కారణమవుతాయని, ప్రపంచం మిమ్మల్ని ఆరోగ్యవంతులుగా చూడాలంటే మత్తుపదార్థాల జోలికి వెళ్లకూడదని అన్నా రు. ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకున్నా, తీసుకుంటున్నా సమాచారం ఇవ్వాలని తెలిపారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని అందువల్ల క్రమశిక్షణతో, ఓపికగా చదువుకొని, మంచి పౌరులుగా ఎదగాలని , చదువుతో పాటు ఆరోగ్యకరమైన జీవితాన్నిగడపాల్సిన అవసరం అందని అన్నారు. ఎస్‌పి నారాయణరెడ్డి మాట్లాడుతూ నిషాయుక్త భారత్కార్యక్రమముపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. రాష్ట్ర యువత , మత్తు రహిత రాష్ట్రంగా ఉండాలంటే విద్యార్థులను మంచి నడవడికలో నడిపించవల్సిన బాధ్యత ఉపాధ్యాయులది అని అన్నారు. దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని, యువత చెడు అలవాట్లకు గురి కాకూడదని పిలుపునిచ్చారు. డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తామని , డ్రగ్స్ అమ్మకం కొనుగోలు, అక్రమ రవాణాచేసే వ్యక్తుల సామాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారి కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



# రీల్



## 'వారణాసి' ఫొటో షూట్

మహేష్ బాబు హీరోగా ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న వారణాసి సినిమా కోసం హీరో హీరోయిన్లు ఫొటోలకు ఫోజులిచ్చారు. ఇటీవల ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ అయిన విషయం తెలిసిందే. తొలిసారిగా మహేష్ బాబు, ప్రియాంక చోప్రా తెరపై కలిసి నటిస్తున్నారు. నటుడు ప్రిథ్వీరాజ్ కూడా ఫొటోల్లో జాయిన్ అయ్యారు.

## నటుడు జోష్ రవి తండ్రి కన్నుమూత



పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, మార్టేరు గ్రామంలో ప్రముఖ సినీ నటుడు జోష్ రవికు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి సూర్య వెంకట నరసింహ శర్మ(68) గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. సూర్య వెంకట నరసింహ శర్మ కు జోష్ రవి ..ఒక్కగానొక్క కుమారుడు ఒక మంచి నటుడుగా జోష్ రవి మన అందరికీ సుపరిచితులే. మార్టేరు గ్రామంలో మూడో కార్తీక మాసం సందర్భంగా సోమవారం ఉదయం శివాలయంలో అభిషేకాలు చేయడానికి వెళ్లిన సమయంలో రవి తండ్రి అకస్మాత్తుగా అస్వస్థకు గురయ్యారు, అక్కడే కుప్పకూలి పోయారు. వెంటనే ఇంటికి వెళ్లే లోపు గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు అని డాక్టర్స్ తెలియచేసారు. ఈ వార్త తెలియగానే మార్టేరు గ్రామం అంతా శోకసముద్రంలో మునిగి పోయింది. జోష్ రవి తోటి నటీనటులు సినిమా పెద్దలు కళాకారులు ఇంటికి వెళ్లి జోష్ రవిని పరామర్శించారు.



వైజాగ్‌లోని జగదాంబ థియేటర్ జరిగిన అఖండ-2 ఈవెంట్ సందర్భంగా వరాహ లక్ష్మి నరసింహ స్వామి, సింహాచలం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన బాలక్రిష్ణ, బోయపాటి శ్రీను ఇతర యూనిట్ సభ్యులు.

## 'సంతాన ప్రాప్తిరస్తు' సక్సెస్ మీట్



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించిన 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని సెంటర్స్ నుంచి ఈ సినిమాకు సూపర్ హిట్ టాక్ తో ప్రదర్శితమవుతోంది. ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. దర్శకుడు సంజీవ్ రెడ్డి రూపొందించారు. 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా బాక్సాఫీస్ సక్సెస్ అందుకున్న నేపథ్యంలో ఈ మూవీ టీమ్ హైదరాబాద్ లో సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్ అందజేశారు. డైరెక్టర్ సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ.. ఏడాదిన్నర పాటు ఈ సినిమాకు పడిన కష్టం మర్చిపోయే విజయాన్ని ప్రేక్షకులు అందించారు. మీడియా నుంచి వచ్చిన ప్రశంసలతో పాటు చిన్న చిన్న సజెషన్స్ కూడా తీసుకుంటాం. మా హీరో తన సెకండ్ మూవీకే ఇలాంటి ఛాలెంజింగ్ సబ్జెక్ట్ ను యాక్సెప్ట్ చేశాడు. బరువు పెరిగి డీ గ్లామర్‌గా నటించాడు. ప్రమోషన్స్ కోసం చాలా కష్టపడ్డాడు. చాందినీ చౌదరి ప్రామిసింగ్ రోల్ చేసింది. మరోసారి మా టీమ్ అందరికీ థ్యాంక్స్ అన్నారు. హీరోయిన్ చాందినీ చౌదరి మాట్లాడుతూ మా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమాను మీరంతా ఇష్టపడతారని అనుకున్నాము గానీ ఇంత ప్రేమ చూపిస్తారని ఊహించలేదు అని అన్నారు. హీరో విక్రాంత్ మాట్లాడుతూ మూవీ కోసం పడిన కష్టాన్ని మర్చిపోయే విజయాన్ని ప్రేక్షకులు అందించారు. ఈ సినిమాకు మూడు పిల్లర్స్ ఎవరంటే మా డైరెక్టర్ సంజీవ్, రైటర్స్ షేక్ దావూద్, కల్యాణ్ రాఘవ్ అని చెప్పాలి. వాళ్లు ప్రతి సీన్ లో ఎలాంటి ఎమోషన్ కనెక్ట్ చేయాలి, ఎలాంటి ఫన్ ఇవ్వాలి, ఈ సీన్ ను ఎలా ల్యాండ్ చేయాలని ఎంతో శ్రద్ధగా క్రియేట్ చేశారు. ఈ సినిమాతో నాకు ఒక ఫ్యామిలీని మీట్ అయినట్లు ఉంది. చాందినీ లేకుంటే ఈ సినిమా ఇంత బాగా వచ్చేది కాదు. తను నాకు ఒక స్నేహితురాలిగా మారిపోయింది అన్నారు.

## ఇది కల్ట్ మూవీ..

### హీరోయిన్ తేజస్వినీ



అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటిస్తున్న సినిమా 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్స్ ప్రొడక్షన్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టేల్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మిస్తున్నారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నారు. నవంబర్ 21న 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు తీసుకొస్తున్నారు. ఇంటర్వ్యూలో హీరో హీరోయిన్స్ అఖిల్ రాజ్, తేజస్విని సినిమా హైలైట్స్ తెలిపారు. హీరో అఖిల్ రాజ్ మాట్లాడుతూ యాక్టర్ కావాలి అనేది నా డ్రీమ్. ఇంటర్ చదివిన తర్వాత ఇండస్ట్రీకి వచ్చాను. మీడియాలో యాంకర్, ఫొటోగ్రాఫర్‌గా వర్క్ చేశాను. యూట్యూబ్ షార్ట్ ఫిలింస్ చేశాను. కొన్నాళ్లు థియేటర్ ట్రైనింగ్ తీసుకున్నాను. 'రాజు వెడ్స్ రాంబాయి' మూవీకి ఆడిషన్ చేశాక సెలెక్ట్ అయ్యాను. డైరెక్టర్ సాయిలు, వేణు గారు, ఈటీవీ విన్..ఇలా అందరి ముందు ఆడిషన్స్ ఇచ్చాక నన్ను తీసుకున్నారు.ఇప్పటిదాకా మన సినిమాల్లో రాని క్లైమాక్స్ ఈ చిత్రంలో చూస్తారు. ప్రేక్షకులు ఇప్పటికే సోషల్ మీడియాలో మా మూవీ క్లైమాక్స్ గురించి మాట్లాడుకుంటున్నారు. సినిమా రిలీజ్‌కు ముందే ఆడియెన్స్‌లో బజ్ క్రియేట్ అవుతోంది. మా సినిమాకు ప్రేక్షకుల ఆదరణ, ప్రశంసలు దక్కుతాయని ఆశిస్తున్నాం అన్నారు. హీరోయిన్ తేజస్వినీ మాట్లాడుతూ.. నా జర్నీ 2019లో బిగిన్ అయ్యింది. ఆ ఇయర్ ఒక షార్ట్ ఫిలింలో నటించాను. ఆ తర్వాత కమిటీ కుర్రోళ్లు సినిమాకు ఆడిషన్ ఇచ్చాను నన్ను సెలెక్ట్ చేశారు. అది నా మొదటి మూవీ. రాజు వెడ్స్ రాంబాయి' సినిమాను 7 జీ బృందావన్ కాలని, ప్రేమిస్తే, బేబి, సైరత్ వంటి కల్ట్ మూవీస్ తో పోల్చుకోవచ్చు. ఆ చిత్రాల్లాగే మా సినిమాకూడా కల్ట్ మూవీగా పేరు తెచ్చుకుంటుంది. నేను ప్రస్తుతం తమిళంలో ప్రభు సోలొమన్ గారితో ఓ సినిమా చేస్తున్నాను. తెలుగులో ఇంకా ఏ మూవీ సైన్ చేయలేదు. స్టోరీస్ వింటున్నాను. నా దగ్గరకు వచ్చే స్క్రిప్ట్స్ ను ఒక ఆడియెన్‌గా వింటాను. స్క్రిప్ట్ ఎగ్జైట్ చేసేలా ఉంటే నటిస్తాను అన్నారు.

## నయన తార బర్త్‌డే స్పెషల్




చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మనం శంకర వరప్రసాద్ గారు సినిమా రెగ్యులర్‌గా షూటింగ్ జరుగుతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ నయన తార జన్మదినం నేపథ్యంలో పోస్టర్ విడుదల చేశారు. చిరంజీవి, నయన తార మీద ఇటీవల ఒక పాటను షూట్ చేశారు. ఈ సినిమా ప్రమోషన్ కూడా మొదలు పెట్టారు. ఇటీవల రిలీజ్ అయిన మీసాల పిల్లా అనే పాట బ్లాక్ బస్టర్ అయింది. ఈ పాట కూడా చిరంజీవి, నయన తారలపై చిత్రీకరించారు. ఈ సినిమాను వచ్చే యేడాది సంక్రాంతికి విడుదల చేయనున్నారు.

## 'మకుటం' షూటింగ్ పూర్తి



హీరో విశాల్ స్వీయ దర్శకత్వంలో 'మకుటం' చిత్రం రాబోతోంది. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద ఆర్ బి చౌదరి 99వ చిత్రంగా రానున్న ఈ ప్రాజెక్ట్కి రవి అరసు కథను అందించారు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పోస్టర్లు, గ్లింప్స్ సంచలనంగా మారాయి. వరుసగా 17 రోజుల పాటు నిర్విరామంగా షూటింగ్ చేసినట్టుగా ప్రకటించారు. విశాల్ స్వీయ దర్శకత్వంలో రానున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'మకుటం' సినిమాకు సంబంధించిన గ్రాండ్ క్లైమాక్స్ షూటింగ్ పూర్తయింది. మకుటం' మూవీకి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. దురైరాజ్ కళా దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఎన్.బి. శ్రీకాంత్ ఎడిటర్గా పని చేస్తున్నారు. ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రిచర్డ్ ఎం. నాథన్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.

## 'ప్రేమంటే' ట్రైలర్ రిలీజ్



ప్రియదర్శి రిఫ్రెషింగ్ రొమాంటిక్ కామెడీ మూవీ ప్రేమంటే. నవంబర్ 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆనంది హీరోయిన్‌గా నటిస్తోంది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్‌గా అరంగేట్రం చేస్తున్నారు. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నారంగ్ నిర్మాణంలో, శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్పీ బ్యానర్ల తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సమర్పిస్తోంది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్ గారికి ట్రిబ్యూట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. కొత్తగా పెళ్ళయిన జంట జీవితంలోని ప్రేమ, గొడవలు, సరదాలు, సంతోషాలని ట్రైలర్ ఫన్ రోలర్ కోస్టర్ రైడ్ లా ప్రజెంట్ చేసింది. ప్రియదర్శి నేచరల్, హ్యూమరస్ పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నారు. ప్రియదర్శి, ఆనంది కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



హన్మకొండ జిల్లాలో..



దేవరకొండలో..



వికారాబాద్ జిల్లాలో..

# దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ జాతీయకార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ తదితరులు పాల్గొంటున్నారు. గద్వాల్‌లో ప్రారంభమైన బస్సు జాతా మంగళవారం దేవరకొండ మండల కేంద్రానికి చేరింది. పార్టీ శ్రేణులు జాతాకు డప్పు చెప్పుళ్లు, బాణాసంచాలతో పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. వైష్ణవి ఫంక్షన్ హాల్ నుండి బస్‌స్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని మొట్టమొదటగా గర్జించిన పార్టీ సిపిఐ అన్నారు. కార్మికులు, కర్షకులను దోపిడీ నుండి విముక్తి చేయడానికి రాజీలేని పోరాటాలు సిపిఐ నిర్వహించిందన్నారు. నాగార్జునసాగర్ శ్రీ రామ్ సాగర్, సీతారామ ప్రాజెక్ట్ వంటి అనేక ప్రాజెక్టుల సాధనలో పెరుగని పోరాటం చేసిందని తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థకు పరిరక్షించేందుకు కార్మికుల సమస్యలపైన అలుపెరుగని పోరాటాలు నిర్వహించిందని చెప్పారు. బయ్యారం ప్రాంతంలో లక్షల కోట్ల విలువైన ఐరన్ ఓర్‌ను కాపాడడంలో శాసనసభలో, వెలుపల వీరోచిత పాత్ర సిపిఐ నిర్వహించిందని గుర్తు చేశారు. బాల నర్సింహా, నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ 2014లో ప్రతి కుటుంబానికి 15 లక్షల ఇస్తామని రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ధరలు తగ్గిస్తామని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రజాకర్షణ నినాదాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి అవేమీ అమలు చేయలేదని, దేశంలో ప్రజల మధ్య మత విద్వేశాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటుందని మండిపడ్డారు. రైతులు, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా మార్చే చట్టాలు బిజెపి తెచ్చిందని, వీటి రద్దు కోసం సిపిఐ నిరంతరం పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఐక్యత వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత కోసం సిపిఐ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల కార్యదర్శులు, ప్రజానాట్యమండలి సభ్యులు, వివిధ గ్రామ శాఖ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కమ్యూనిస్టుల పాలనకు కేరళే నిదర్శనం : చాడ వెంకటరెడ్డి

కమ్యూనిస్టుల ఆదర్శ పాలనకు కేరళ రాష్ట్రమే నిదర్శనం అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ముల్కనూర్‌లోని ఎల్లమ్మ దేవాలయం నుండి బస్టాండ్ అంబేద్కర్ కూడలి వద్దకు ప్రచారం జాతా డప్పు చప్పుళ్లతో కళాబృందాల ఆటపాటలతో చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి సిపిఐ నాయకులు పూల మాల వేశారు. ఎల్కతుర్తి, ఎల్లాపూర్, హసన్‌పర్తి మండలంలోనూ జాతాకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం హనుమకొండకు జాతా చేరుకోగా భీమారం వద్ద ఏర్పాటు చేసిన సిపిఐ పతాకాన్ని ఆవిష్కరించి హనుమకొండ అశోక జంక్షన్‌లోని బిఆర్ భగవాన్‌దాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకట రెడ్డి మాట్లాడుతూ సిపిఐకి ఉన్న పోరాటాల చరిత్ర దేశంలో మరే పార్టీకి లేదన్నారు. సిపిఐకి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు లేరని ఎద్దేవా చేస్తున్నారని, ఇప్పటివరకు దేశంలో కమ్యూనిస్టులు పరిపాలించిన కేరళ రాష్ట్రం పూర్తి అక్షరాస్యత సాధించిందని, ప్రజలకు ఇండ్లు, విద్య, వైద్యాన్ని అందించి పేదరికం లేకుండా చేసిందని, దేశంలో పేదరికం లేని ఒకే ఒక్క రాష్ట్రం కేరళ అని అన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నేటికీ మనదేశంలో ఆరు కోట్ల మంది చిన్న పిల్లలు బాల కార్మికులుగా ఉన్నారని, ప్రభుత్వం ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని, ప్రైవేట్ విద్యతో ప్రైవేట్ స్కూల్స్ కోట్ల రూపాయలు దోచుకుంటున్నాయని, విద్య ఒక వ్యాపారం అయిపోయిందని, ఈ దేశంలో పుట్టిన పేదవాడికి సమానంగా ప్రభుత్వ విద్య అందించాలని కొట్లాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు.

ఈ కార్యక్రమాలలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్,సిరబోయిన కరుణాకర్,మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎఐఎస్ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### దేశాన్ని అంబానీ, ఆదానీలు శాసిస్తున్నారు: పశ్యపద్మ

వికారాబాద్ కేంద్రంలో బస్సుజాత సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతాలో జాతయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ మాట్లాడుతూ 15వ తేదీన బాసర నుండి ప్రారంభమైన జాతా వికారాబాద్‌కు చెరుకుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి ఎన్నో ఉద్యమాలు, త్యాగాలు, బలిదానాలు సిపిఐ నాయకులు చేశారన్నారు. ఎన్నో హక్కులను సాదించామని, ఉపాధి హామీ, ఆర్‌టిఐ చట్టం కూడా సిపిఐ పార్టీ సాధించిన గొప్ప విజయమన్నారు. నేడు దేశాన్ని అంబానీ, ఆదానీలు శాసిస్తున్న తీరు చూస్తుంటే రోజు రోజుకు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ నిర్వీర్యమైన ప్రైవెట్ పరం చేసి దేశాన్ని పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టే పరిస్థితి ఉందని, మధ్యతరగతి వ్యాపారులకు ఇది పెద్ద దోకా దీన్ని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మేలు అని అన్నారు. జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా కర్ణటక సరిహద్దు కావడంతో నిర్లక్ష్యనికి గురవుతుందన్నారు. ఇందుకు బస్సు ప్రమాదమే నిదర్శలనమన్నారు. వికారాబాద్ జిల్లాలో యువకులకు ఉపాధి లేదని దానికోసం ఏ ప్రభుత్వంమైనా ఇక్కడ కొత్త ఇండస్ట్రీస్ తీసుకురావడం జరిగిందా అని ప్రశ్నించారు. తాండూర్ ప్రాంతం కొట్టుమిట్టాడుతుందని క్యాన్సర్ ఉపిరితితుల సంబంధించిన వ్యాధితో చాలా మంది బాదపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు వలీవుల్లా ఖాద్రి, నాయకులు గోపాల్‌రెడ్డి, అనంతయ్య, వెంకటేష్, సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు దేశవ్యాప్త నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ రహదారులను షేక్ హసీనా అనుచరులు, అభిమానులు, ఆ పార్టీ కార్యకర్తలు స్తంభింపజేశారు. వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. ప్రదర్శకులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. దీంతో ప్రదర్శకులు చేతి బాంబులు విసిరారు. బాంబు ధ్వనులతో ఆ ప్రాంతం దద్దరిల్లిందని స్థానిక మీడియా వెల్లడించింది. గత ఏడాది విద్యార్థి ఉద్యమ సమయంలో ఆవిర్భవించిన జతియ ఛత్ర శక్తి కార్యకర్తలకు, అవామీలీగ్ కార్యకర్తలకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. తొలుత సోమవారం తీర్పు వెలువడిన వెంటనే ఢాకాలోని ధన్మండీ–32 ప్రాంతంలో ఆగ్రహం పెల్లుబికింది. గ్రెనేడ్ బాంబు పేలుళ్ళతో దద్దరిల్లిపోయింది. నిరసనలు వెల్లువెత్తాయి. దాదాపు 100 గ్రెనేడ్లు ఆ ప్రాంతంలో పేలుడు శబ్దాలను సృష్టించాయి. సోమవారం జరిగిన అల్లర్లలో పోలీసులతోపాటు 50 మంది గాయపడ్డారు. ఈ ప్రాంతంలోనే బంగబంధు నివాసం ఉంది. ఈ ప్రాంతంలో జతియ ఛత్ర శక్తి కార్యకర్తలకు, అవామీ లీగ్ కార్యకర్తలకు మధ్య ఘర్షణలు చెలరేగాయి. మిర్‌పూర్ రోడ్, కలబాగన్ ప్రాంతాలలో రాకపోకలను పోలీసులు నిషేధించారు.

### అవామీ లీగ్‌ను ఎన్నికల్లో అనుమతించాలి

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా పార్టీ 'అవామీలీగ్'ను రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతించాలని మహ్మద్ అలీ జిన్నా స్థాపించిన పాకిస్థాన్ పత్రిక 'డాన్' తన సంపాదకీయంలో పేర్కొంది. బంగ్లాదేశ్‌లో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ దేశంతో సన్నిహిత సంబంధాలు ఏర్పాటు చేసుకోవడానికి పాకిస్థాన్ ఉవ్విళ్ళూరుతున్న పాకిస్థాన్ ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నది. ప్రతిపక్షాలను నిర్మూలించేందుకు ప్రధానమంత్రి పదవిలో ఉండగా షేక్ హసీనా ఏర్పాటు చేసిన వ్యవస్థలవల్ల చివరకూ ఆమె బలి కావాల్సి వచ్చిందని సంపాదకీయం విచారం వ్యక్తం చేసింది. పరిస్థితి తన చేతులు దాటి వెళ్ళిపోయిందని, అదుపు తప్పిందని దేశం వదలి వెళ్ళిపోయే ముందుగా హసీనా చేసిన వ్యాఖ్యలను పత్రిక ఉటంకించింది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలను బంగ్లాదేశ్ ప్రతిపక్షాలు బహిష్కరించాయని, హసీనా తిరిగి అధికారంలోకి వచ్చారని, ఈ విధమైన ఎన్నిక న్యాయబద్ధమైనది కాదనీ, ఆమె పతనానికి ఇది కూడా ముఖ్యకారణాలలో ఒకటనీ పేర్కొంది. అందువల్ల ఈసారి వచ్చే ఫిబ్రవరిలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో అవామీలీగ్ పార్టీని కూడా పోటీ చేసేందుకు అనుతించాలని డాన్ పత్రిక పేర్కొంది.

### హసీనాకు ఉరిశిక్ష అంతర్గత వ్యవహారం: చైనా

న్యాయస్థానం విచారణ జరిపి షేక్ హసీనా (78)కు ఉరిశిక్ష విధించడం బంగ్లాదేశ్ జాతి అంతర్గత వ్యవహారమని చైనా ప్రభుత్వం వ్యాఖ్యానించింది. అంతకుమించి నస్థాయిలో ఈ విషయంపై అధికారికంగా వ్యాఖ్యానించేందుకు చైనా తిరస్కరించింది. చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మంగళవారం రోజువారీ స్థాయిలో మీడియాతో మాట్లాడుతూ, పాత్రికేయులు అడిగిన ఒక ప్రశ్నకు పైవిధంగా స్పందించారు. ఒక మంచి పొరుగుదేశంగా, మిత్రదేశంగా ఉండాలన్నదే చైనా విధానమని ఆయన అన్నారు. బంగ్లాదేశ్ తన సార్వభౌమాధికారాన్ని, స్థిరత్వాన్ని,అభివృద్ధిని నిలబెట్టుకోగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది ఆగస్టు 5న దేశం వదిలి వెళ్ళిపోయిన హసీనా ప్రస్తుతం భారత్‌లోని ఒక అజ్ఞాత ప్రదేశంలో తలదాచుకున్నారు.

# ఐటి దాడులు (మొదటి పేజీ తరువాయి)

శాఖలు, అకౌంటింగ్ సెక్షన్లు, గిడ్డంగులు, నిర్వాహకులకు చెందిన ఇళ్లు వంటి చోట్ల ఒకేసారి చేపట్టారు.మోహిఫిల్ రెస్టారెంట్ 2006లో ప్రారంభమైన ఈ చైన్, ప్రస్తుతం హైదరాబాద్‌లో 15 బ్రాంచీలు నిర్వహిస్తోంది. అదనంగా యుఎఇలో కూడా శాఖలు నడుపుతోంది. 2025వరకు ఈ బ్రాండ్ విస్తరణను కొనసాగిస్తూ కొత్త అవుట్‌లెట్లు కూడా ప్రారంభించింది. పిస్తా హౌస్ 1997లో మహ్మద్ అబ్దుల్ మజీద్ స్థాపించిన ఈ బ్రాండ్ ప్రస్తుతం దేశంతో పాటు విదేశాల్లో కలిపి 44 స్టోర్లతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అనేక అవుట్‌లెట్లు కలిగి ఉంది. ప్రత్యేకంగా హలీం సీజన్‌లో కోట్లలో అమ్మకాలు జరుగుతుండటం, ఆన్‌లైన్ ఆర్డర్లు మరియు ఫ్రాంచైజీ నెట్‌వర్క్ భారీగా ఉండటం అధికారుల దృష్టిని ఆకర్షించిన అంశాలుగా తెలుస్తోంది. ఈ దుకాణాన్ని బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ సహా పలు ప్రముఖులు కూడా సందర్శించిన విషయం తెలిసిందే. షా గౌస్ రెస్టారెంట్‌పై కూడా అధికారులు దృష్టి సారించారు. గచ్చిబౌలి, ఓల్డ్ సిటీ తదితర ప్రాంతాల్లో అనేక శాఖలు ఉండటం, అలాగే ఫుడ్ డెలివరీ యాప్‌లపై అధిక అమ్మకాల ప్రస్థానం ఉన్నట్టు తెలిసింది.

### వాస్తవాదాయానికి, రికార్డుల్లో ఆదాయానికి తేడా

ఈ క్రమంలో రికార్డుల్లో చూపిన ఆదాయం, నిజమైన ఆదాయం మధ్య చాలా వ్యత్యాసం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హవాలామార్గంలో అనుమానాస్పద ట్రాన్సాక్షన్ ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ట్యాక్స్ చెల్లింపులో వ్యత్యాసం ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు. పిస్తా హౌస్ యజమాని మజీద్ నివాసంలో ఆరు బృందాలు సోదాలు జరుపుతున్నాయి. పిస్తా హౌస్లో పనిచేసే వర్కర్ల నివాసాల్లోనూ, వర్కర్లకు కల్పించిన వసతి నివాసాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. వారికి సంబంధించిన ఫోన్లు, కంప్యూటర్లను ఐటీ అధికారులు తనిఖీ చేశారు. ఫోన్లలో, కంప్యూటర్లో ఉన్న డేటాను ఐటీ శాఖకు సంబంధించిన హ్యాకర్లు పరిశీలిస్తున్నారు. ఆయన అందుబాటులో లేకపోవడం వల్ల ఐటీ అధికారులు ఇతర సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకుంటున్నారు. బినామీల పేర్లతో పిస్తా హౌజ్ ఆస్తులు ఉన్నట్లు ఆరోపణల నేపథ్యంలో వర్కర్ల ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నాయి. సోదాల్లో కీలకమైన డాక్యుమెంట్స్ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కంప్యూటర్ కి సంబంధించిన హార్డ్ డిస్కులు, కీలక పత్రాన్ని అధికారులు చేజిక్కించుకున్నారు. అంతే కాకుండా వర్కర్ల నుంచి ఐటీ అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది.






Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com